సమీక్ష గతి నెరవేర్చిన పుస్తకాలు... (illustration)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 137 పేజీలు: 12 వెల: 6.50


ముంచెత్తుతున్న భారీ వర్షాలు

9 ఎయిరిండియా విమానాలు రద్దు

5లో

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేద్దాం..

### సర్క్యులర్ ఎకానమీపై త్వరలో కొత్త పాలసీ

### యేడాదిలోగా 3 సర్క్యులర్ ఎకానమీ పార్కులు

### ఉత్తమ నిర్వహణకు 'స్వచ్ఛతా అవార్డు'లు

### సమీక్షలో సిఎం చంద్రబాబు



మంగళవారం సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ట పరిచేలా. రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మొదటగా రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయాలని, అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాలను వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలిగించాలని సిఎం ఆదేశించారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు.

మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు..వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై రివ్యూలో సిఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ యోచన చేస్తుందన్నారు.

ఇందుకు అనుగు ణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసిన మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంమున్సిపల్, వాహనాలు, లిథియంబ్యాటరీలు, జిప్సం,టైర్లు, రబ్బర్, >>2

## మన ఆరోగ్యానికి మహా 'యోగా'



### 21న ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలి

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21వ తేదీన జరుగుతున్న సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రజలందరూ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రజలందరూ యోగా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను విడుదల చేసారు. ఎపి ప్రభుత్వం సమాచార, పౌరసంబంధాల శాఖ ద్వారా ఈ లేఖను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్తుంది. ప్రధాని మోడీ ఈ లేఖలో ఈ సంవత్సరం జూన్ 21న మనం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నామని తెలిపారు. ఈ చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గత దశాబ్ద కాలంగా దేశ ప్రజలు ఈ గొప్ప కార్యక్రమానికి అందిస్తున్న ఆదరణ ఒక ప్రత్యేకమన్నారు. గత పదేళ్లుగా యోగా కేవలం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం మనందరికీ గర్వకారణ మన్నారు. ఈ ఎడాది జూన్ 21న విశాఖపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి, ఒక ఆరోగ్యం' అనే థీమ్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, మరియు ప్రపంచ ఐక్యత స్ఫూర్తినికూడా ప్రతిబింబిస్తుందన్నారు. యోగా మన గొప్ప సాంస్కృతిక వారసత్వంలో >>2

# బనకచర్లపై తెలంగాణ ఆరోపణలు అవాస్తవం



### అక్కడ అంతర్గత రాజకీయ పోరు కోసమే వివాదం చేస్తున్న నాయకులు

### యేటా సముద్రంలో కలిసే 3వేల టిఎంసిల గోదావరి నీటి సద్వినియోగానికే బనకచర్ల ప్రాజెక్టు

### సిఎం చంద్రబాబుకు రెండు రాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యమే: పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో అంతర్గత రాజకీయ పోరు కోసమే పోలవరం- బనకచర్లపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. నికరజలాల్ని ఈ ప్రాజెక్టుకోసం ఎట్టి పరిస్థితుల్లోనూ వాడట్లేదనే విషయాన్ని ఎగువ రాష్ట్రాలు గ్రహించాలన్నారు. రాయలసీమ దాహార్తి తీర్చి ఆ ప్రాంత కరవు నివారణ కోసమే వినియోగిస్తున్నట్లు చెప్పారు. సముద్రంలో కలిసే ఉప్పునీటినే వాడుకుంటున్నామని తెలిపారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు పేరిట ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పోలవరం బనకచర్లకు అభ్యంతరాలు పెడుతున్న వారికి తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులకు నిబంధనలు ఎందుకు వర్తించవో సమాధానం చెప్పాలని నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఎన్నో ప్రాజెక్టులు కెసిఆర్ ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టలేదా అని నిలదీశారు. దిగువ రాష్ట్రమైన ఎపి ప్రయోజనాలు పట్టించుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా అనేక ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. కానీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్న బనకచర్లపై అభ్యంతరాలు చెప్తున్నారని నిమ్మల మండిపడ్డారు.

చంద్రబాబుకు రెండుతెలుగురాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యం. అందుకే అనుమతులు లేకుండా చేపట్టిన తెలంగాణ ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పలేదు. ప్రతీ ఏటా సముద్రంలో కలిసే 3000ల టీఎంసీల గోదావరి నీటిలో 200ల టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోవటం కోసమే పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు. పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలియాలి అని నిమ్మల పేర్కొన్నారు. 'గోదావరి వరదల వల్లవచ్చే నష్టం దిగువ రాష్ట్రమైన ఎపి మాత్రమే భరిస్తోంది. వరద నష్టం భరిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు వరద జలాలను సద్వినియోగం చేసుకోవటం సహజ న్యాయమైన హక్కు. పోలవరం వల్ల లభ్యమయ్యే వరద జలాలను >>2



ఇజ్రాయెల్ దాడుల్లో మండుతున్న ఇరాన్ షారన్ ఆయిల్ డిపో

# మండుతున్న మధ్యప్రాచ్యం

### ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ముమ్మరం

### పశ్చిమాసియాలో ఎయిర్‌పోర్టులు మూసివేత

### టెల్‌అవివ్‌పై క్షిపణుల వర్షం కురిపించిన టెహ్రాన్

### జి-7 సదస్సునుంచి ట్రంప్ అర్ధాంతరంగా అమెరికా పయనం

**టెల్‌అవీవ్, జూన్ 17:** ఇజ్రాయెల్ -ఇరాన్ యుద్ధం ఐదో రోజుకు చేరుకుంది. ఆ దేశాలు ప్రతీకార చర్యలతో రగిలిపోతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమాసియావ్యాప్తంగా ఎయిర్‌పోర్టులను మూసి వేయడంతో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గగనతలాలపై ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గగనతలాన్ని ఇరాన్ పూర్తిగా మూసివేయగా.. అత్యంత కీలకమైన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ మూసివేసింది. దీంతో లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లోనూ >>2

# అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసి కొడతారా?



బాధిత మహిళతో ఫోన్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### కుప్పం ఘటనపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

### వారిపై కఠిన చర్యలకు ఆదేశం

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లాలోని కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. అప్పు తీర్చలేదని కుప్పం నియోజకవర్గం నారాయణపురంలో ఓ మహిళపై దాడిచేశారు. మహిళను చెట్టుకు కట్టేసి మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులు అమానుషంగా వ్యవహరించారు. కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఘటనపై ఇప్పటికే సిఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పి సిఎం చంద్రబాబుకు తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని స్పష్టంగా ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని జిల్లా అధికారులకు సిఎం చెప్పారు. తిమ్మరాయప్ప అనేవ్యక్తి మునికన్నప్ప వద్ద కొంత అప్పుతీసుకున్నారు. అప్పుల భారం భరించ >>2

### రూ. 5 లక్షల ఆర్థిక సాయం.. పిల్లల చదువుకు హామీ

2లో

ధైర్యంగా ఉండాలని కుప్పం మహిళ శిరీషకు సిఎం భరోసా



# తిరుపతి ఎయిర్‌పోర్టుకు తిరుమలేశుని పేరు

### విమానయాన శాఖకు సిఫారసు చేసిన టిటిడి బోర్డు

### బెంగళూరులో బాలాజీ ఆలయ నిర్మాణం

### న్యూఢిల్లీలోని ఎస్వీ కళాశాల ఆధునీకరణ

### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

**తిరుమల, జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలచెంతన ఉన్న రేణిగుంటలోని విమానాశ్రయానికి 'శ్రీవేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయం'గా పేరు మార్చాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు పాలక మండలి కీలకంగాచర్చించి పేరుమార్పుకు ఆమోదం తెలుపుతూ కేంద్రవిమానయానశాఖకు సిఫార్సు చేసింది. ఇప్పటికే దేశవిదేశాల నుండి రోజువారీగా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విమానాల్లో వస్తున్న భక్తులసంఖ్య పెరిగింది. రేణిగుంట విమానాశ్రయానికి స్వామివారి పేరున అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు మార్చడం, తిరుమలకు ఐకానిక్‌గా విమానాశ్రయానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా సిఫార్సు చేశారు. తిరుమలలో భక్తులను ఒకచోట నుండి మరోచోటుకు ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అవసరమైన వంద విద్యుత్‌బస్సులను కేంద్రప్రభుత్వం సమకూర్చేలా కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామి సానుకూలత చూపారు. బెంగళూరులో ప్రధాన ప్రాంతంలో శ్రీవారి నూతన ఆలయం విశాలంగా నిర్మించాలని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ కోరారు. ఆయన కోరికతో ఇందుకోసం 47ఎకరాల స్థలాన్ని కర్నాటక ప్రభుత్వం కేటాయించగానే ఆలయం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఉదయం టిటిడి పాలకమండలి అత్యవసర సమావేశం జరిగింది.

టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి. బోర్డుసభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, జ్యోతుల నెహ్రూ, తమ్మిశెట్టి జానకిదేవి, >>2

# కొల్లేరు ప్రాంతీయుల ప్రయోజనాలు కాపాడుతాం

### ప్రజల సమస్యలు విని, వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించిన సిఇసి

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



మంగళవారం కొల్లేరు ప్రజల సమస్యలు పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీ సభ్యులకు వినతిపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**కైకలూరు, జూన్, 17(ప్రభాతవార్త):** కొల్లేరు ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం కొల్లేరు ప్రజల సమస్యలు, వారి ప్రస్తుత జీవన పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీ సభ్యులు కొల్లేటికోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి నుండి వినతిపత్రాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర సాధికారిక కమిటీ సభ్యులతో కలిసి, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసినసమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో 3లక్షలకుపైగా ప్రజలు నివసిస్తున్నారని, కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణతో పాటు ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు కూడా ముఖ్యమేనన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలు పర్యావరణ ప్రేమికులని, పక్షులను కాపాడుతూ అటవీ చట్టాలను గౌరవిస్తూ ఉంటారన్నారు. పర్యావరణం, పక్షులతోపాటు ఈ ప్రాంతంలోని ప్రజలు కడుపునిండా ఆహారం అందించేలా వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామన్నారు. కొల్లేరు ప్రాంత సమస్య ఎన్నో దశాబ్దాల నాటిదన్నారు. గతంలో కొల్లేరు ఆపరేషన్ సమయంలో సరిహద్దులు సరిగ్గా గుర్తించని కారణంగా వచ్చిన గందరగోళమని, దాంతో అక్కడి ప్రజల మనుగడ ప్రస్నార్థకమైందన్నారు. ఆ ప్రాంతంలోని జీరాయితీ రైతుల హక్కులు హరించబడ్డాయన్నారు. కొల్లేరు ప్రాంతాల ప్రజల సమస్యలపై డిప్యూటీ >>2

### పట్టాలెక్కనున్న 200 కొత్త రైళ్లు

### ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్‌లతో దాడి

5లో

# 67 వేల మంది టీచర్ల బదలీ

### రికార్డు స్థాయిలో 4 వేల మందికి పైగా పదోన్నతులు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. 67,732 మందికి స్థానచలనం కలిగింది. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 31,174 మంది బదిలీ అయ్యారు. వీరికి మాన్యువల్‌గా, మిగతా కేటగిరీల వారికి ఆన్ లైన్ వెబ్ ఆధారిత కౌన్సిలింగ్ నిర్వహించారు. కొంత మది ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లకు బదిలీలు అయినప్పటికీ, వారు పాత బడుల్లోనే పనిచేయాల్సిన అనివార్యత నెలకొంది. వీరు కొత్త పాఠశాలలో చేరి, పాత పాఠశాలలో కొన్నాళ్లు కొనసాగాల్సి ఉంటుంది. మెగా డిఎస్సీ నియామకాల తర్వాత వీరిని రిలీవ్ చేస్తారు.

కొన్ని చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు బదిలీ అయినప్పటికీ, అక్కడికి కొత్తవారు రాని పక్షంలో పాతవారే కొనసాగాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. సబ్జెక్ట్ టీచర్లలో సగం మంది ఉండాలన్న నిబంధన పెట్టడంతో కొందరు కొత్త పాఠశాలల్లో చేరి, వెనక్కి వచ్చారు. డిఎస్సీ నియామకాల తర్వాత వీరందరూ ఆగస్టులో రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

అత్యధికంగా అనంతపురం జిల్లాలో 7,172 మందికి, అత్యల్పంగా విజయనగరంలో 3,587 మందికి స్థాన చలనం కల్గింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,477 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. ఇందులో స్కూలు అసిస్టెంట్ గ్రేడ్-2 గా >>2



ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి మంగళవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన దృశ్యం

# ఆరోపణలు అవాస్తవం

>> మాత్రమే బనకచర్ల కోసం సద్వినియోగం చేసుకుంటున్నామని ప్రజలు గ్రహించాలి. ఎక్కడా నికర జలాల్ని వాడకుండా వరద జలాల్ని మాత్రమే వాడుకుంటున్నామని అంతా తెలుసుకోవాలిలని నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రతీ ఏటా సగటున 100 రోజులు గోదావరికి వరద వస్తున్న చరిత్ర ఆధారంగా 200 టీఎంసీల వరద జలాల్ని మాత్రమే తీసుకుంటున్నామని నిమ్మల వివరించారు. ప్రాజెక్టుపై ప్రాథమిక నివేదిక సిడబ్ల్యూసికి అందచేయటంతోపాటు అన్నీ నిబంధనల ప్రకారమే ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. సిడబ్ల్యూసి ప్రాథమిక నివేదికకు ఆమోదం తెలిపాకే డిపిఆర్ రూపొందిస్తామని చెప్పారు. పర్యావరణ అనుమతులు వచ్చాకే ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్తామని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గోదావరి జలాలపై ద్వంద్వ వైఖరి అంటూ కెసిఆర్, జగన్ వివిధ సందర్భాల్లో మాట్లాడిన వీడియోలను నిమ్మల రామానాయుడు ప్రదర్శించారు. నాటి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్ కెసిఆర్‌లు మాట్లాడిన మాటలకు భిన్నంగా ఇప్పుడు బిఆర్ఎస్ నేతల వాదన ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమను కరువు నుంచి కాపాడాలి అంటే గోదావరి వరద జలాల తరలింపు ఒక్కటే మార్గం అని కెసిఆర్ చెప్పారని గుర్తు చేశారు. ఇవాళ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అభ్యంతరం చెప్పడం ఎంతవరకు సమంజసమని నిమ్మల నిలదీశారు. తాజా పరిణామాలపై రాయలసీమ బిడ్డనని చెప్పుకునే నాటి సిఎం జగన్ ఎందుకని నోరు మెదపడం లేదు? అధికారం ఉంటే ఒకలా లేకుంటే మరోలా ఉంటారనే ఇద్దరి నేతల ద్వంద్వ వైఖరి ఇక్కడ స్పష్టమవుతోందన్నారు. తెలంగాణ ప్రాజెక్ట్‌లు అడ్డుకోవాలనే దురుద్దేశాలు చంద్రబాబుకు కానీ ఎపి ప్రభుత్వానికి ఎప్పుడూ లేవు. 75 శాతం పనులు పూర్తయిన సీతారాం సాగర్ లిఫ్ట్‌కు ఇటీవలే అనుమతులు రాలేదా? దేవాదుల, భీమా ఎత్తి పోతల ఇలా అనేక ప్రాజెక్ట్‌లకు చంద్రబాబు సహకరించారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోలేదు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సిఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలన్నదే చంద్రబాబు అభిమతమని వివరించారు. గోదావరి నదికి చిట్ట చివరి రాష్ట్రమైన ఎపిది సహేతుక వాదనఅని నిమ్మల స్పష్టం చేశారు.

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

>> ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల నుంచి సర్క్యులర్ ఎకానమీ సృష్టించేలా కేంద్రం కార్యాచరణ ఉందన్నారు. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీపై ఉత్పత్తి, వినియోగానికి సంబంధించి మాదిరి కరమైన ప్రయోగాలు చేయవచ్చునన్నారు., దీనిలో వీలైనంతకాలం ఉన్న పదార్థాలు,. ఉత్పత్తులను పంచుకోవడం, లీజుకు ఇవ్వడం, తిరిగి ఉపయోగించడం, మరమ్మత్తు చేయడం, పునరుద్ధరించడం మరియు రీసైక్లింగ్ చేయడం వంటివి సర్క్యులర్ ఎకానమీలో కీలకమన్నారు., ఈ విధంగా, ఉత్పత్తుల సుదీర్ఘ నాణ్యత విలువలతో ఉంటాయన్నారు. ఇక ఆచరణలో, ఇది వ్యర్థాలను కనిష్ట స్థాయికి తగ్గించడాన్ని సూచిస్తుంది. ఒక ఉత్పత్తి దాని జీవితకాలం ముగిసినప్పుడు, రీసైక్లింగ్ ద్వారా సాధ్యమైన చోట దాని పదార్థాలు ఆర్థిక వ్యవస్థలోనే ఉంచబడతాయి. వీటిని మళ్లీ మళ్లీ ఉత్పాదకంగా ఉపయోగించవచ్చు, తద్వారా మరింత విలువను సృష్టించవచ్చు ఇది సాంప్రదాయ, సరళ ఆర్థిక నమూనా నుండి నిష్క్రమణ, ఇది టేక్‌మేక్‌కంస్యూమ్‌త్రో అవే నమూనాపై ఆధారపడి ఉంటుంది. ఈ నమూనా పెద్దమొత్తంలో చౌకైన, సులభంగా అందుబాటులో ఉండే పదార్థాలుశక్తిపై ఆధారపడుతుంది. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

**సర్క్యులర్ ఎకానమీ ప్రయోజనాలు**

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ సమర్థంగా అమలు చేయగలిగితే జిఎస్డీపీకి ఏడాదికి అదనంగా రూ.15,000 కోట్లు జత చేరుతుందని అంచనా. అలాగే మరో రూ.10,000 కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జిఎస్టీ రూపంలో రూ.3,000 కోట్ల ప్రతీ ఏటా ఆర్జించవచ్చు. మరోవైపు ప్రత్యక్షంగా 1,00,000 మందికి ఉద్యోగావకాశాలు దక్కను న్నాయి. 10 వేల మైక్రో ఎంట్రప్రెన్యూర్లకు ఉపాధి లభిస్తుంది. దీంతోపాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కర్బన వాయువుల విడుదల తగ్గుతుంది. భూ, జల, వాయ కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చు.

**ప్లాస్టిక్ రహిత నగరాలు**

ఈ ఏడాది అక్టోబర్ 2 కల్లా రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండి.4 నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగులు వినియోగాన్ని పెంచాలని చెప్పారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్‌రీయూజ్‌రీసైకిల్ సెంటర్ల ఏర్పాటు చేయాలని నిర్దేశించారు.

జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలోని పట్టణాలు, పంచాయతీ ప్రాంతాల్లో మొత్తం 52 వేస్ట్ క్లస్టర్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రం నుంచి ప్రతీ ఏటా బ్యాటరీలు, ఇతర ఆటోమోటివ్ వ్యర్థాలు 36,588 టన్నులు, ప్లాస్టిక్ పెట్ బాటిల్స్ వేస్ట్ 61,996 టన్నులు, ఇంజిన్ ఆయిల్స్ ఇతర హైడ్రాలిక్ చమురు వ్యర్థాలు 23,928 లీటర్లు, టైర్లురబ్బర్ 59,654 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అత్యధికంగా వ్యవసాయరంగం నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, పశువులు ఆక్వాపౌల్ట్రీ ఈ మూడు రంగాల నుంచి 347 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ రోజూ 88 లక్షల గృహాల నుంచి 1,329 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. రాజస్థాన్, కర్నాటక, మహారాష్ట్రలో సర్క్యులర్ ఎకానమీ కోసం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మరణించిన పైలెట్ సుమిత్ సబర్వాల్ భౌతిక కాయానికి మంగళవారం ముంబయిలో నివాళులర్పిస్తున్న తండ్రి, బంధువులు

# మన ఆరోగ్యానికి మహా 'యోగా'

>> అంతర్భాగమని, ఇది శరీరం మరియు మనస్సు మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడంలో సహాయ పడుతుందన్నారు. అంతేకాకుండా యోగా సమగ్రమైన, ప్రశాంతమైన మరియు సంతృప్తికరమైన జీవనశైలి వైపు మనకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. శారీరకంగా మరియు మానసికంగా సాధికారత పొందిన పౌరులు దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన, ప్రభావవంతమైన పాత్ర పోషిస్తారన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో యోగా ఒక శక్తివంతమైన సాధనమన్నారు. యోగా ద్వారా మనం స్వావలంబన మరియు అభివృద్ధి చెందిన భారతదేశం అనే మన జాతీయ సంకల్పాన్ని మరింత బలంగా, వేగంగా సాధించ గలుగుతామన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని కోరారు. ఈ మహత్తర కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా, బహిరంగ ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పంచాయితీ భవన్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రదేశాల్లో నిర్వహించాలని సూచించారు. దీనివల్ల పిల్లలు, యువత, మహిళలు మరియు పెద్దలు సహా అన్ని వర్గాల ప్రజలు యోగా వల్ల ప్రయోజనాలు పొంది, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచు కోగలరన్నారు. అందరం కలిసి ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా చేసుకోవడానికి గొప్ప ప్రేరణనిస్తుందని ప్రధాని గట్టిగా విశ్వసిస్తున్నానన్నారు. యోగా ద్వారా వారు మరింత ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితం వైపు అడుగులు వేస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఆశిస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

# బెంగళూరు ఎయిర్‌పోర్టులో వైసిపి నేత చెవిరెడ్డికి ఝలక్

## లుకౌట్ నోటీసు కింద చెవిరెడ్డిని అడ్డుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు

**తిరుపతిరూరల్, జూన్17 ప్రభాతవార్త:** బెంగళూరు ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు వెళ్లాలనుకున్న వైఎస్సార్సీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుమతి లభించలేదు. చెవిరెడ్డిపై లుకౌట్ నోటీసులు ఉండటంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తనపై కేసులు లేవని, ఎఫ్ఐఆర్‌లు లేవని, అయిన ఎందుకు ఆపారని చెవిరెడ్డితో పోలీసులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చెవిరెడ్డిపై లిక్కర్ కేసుతో పాటు మనీ లాండరింగ్‌లో ప్రధాన పాత్ర పోషించినట్లు కీలకమైన వ్యక్తులు అసలు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల సమయంలో దొరికిన ఎనిమిది కోట్లకు లెక్కలున్నాయని, ఆడబ్బులు తనవి కాదని చెప్పుకున్న విషయం తెల్సిందే. దీంతో పాటు పోలీసులను బెదిరించిన ఘటనలు, ఇతర కేసులు ఆయనపై చాలానే ఉన్నాయి. సైలెంట్‌గా బెంగళూరు ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేసారని ఆరోపణలు ఉన్నాయి. చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఎపి పోలీసులు సిట్ అధికారులకు అప్పగిస్తే విచారణ చేస్తారా లేక వదిలేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

# టీచర్ల బదలీ

>> 1,375, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా 1,592, స్కూల్ అసిస్టెంట్‌లుగా 1,510 మందికి పదోన్నతులు లభించాయి. ఎక్కడా ఆరోపణలు, విమర్శలు లేకుండా ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను క్రమబద్ధీకరించారు. సబ్జెక్ట్ టీచర్లలో అత్యధికంగా గణితం టీచర్లు 346 మందికి, అత్యల్పంగా సంస్కృత భోధకులిద్దరికి పదోన్నతులు లభించాయి.

# మండుతున్న మధ్యప్రాచ్యం

>> విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు, తమ అణు స్థావరాలను ధ్వంసం చేయడంతో అత్యున్నత సైనికాధికారులను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో సోమవారం ఉదయం క్షిపణుల వర్షం కురిపించింది.

టెల్‌అవీవ్, పెటా తిక్వా ప్రాంతాల్లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దట్టమైన నల్లటి పొగ అలముకుంది. ఈ దాడుల్లో కనీసం 8 మంది ఇజ్రాయెల్ పౌరులు మృతి చెందారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా టెల్‌అవీవ్ దాడులు చేసింది. రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసం అయ్యాయి. దీనిని సంబంధించిన విడియోను ఇజ్రాయెల్ డిఫెన్స్‌ఫోర్సెస్ విడుదల చేసింది.

**జి-7 సదస్సు నుంచి అర్థాంతరంగా ట్రంప్ పయనం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి, జి-7 సదస్సు నుంచి హుటాహుటిన స్వదేశానికి పయనమయ్యారు. దీంతో పశ్చిమాసియాలో ఏవో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయి. గతంలో అల్‌ఖైదా అగ్రనేత బిన్‌లాడెన్, ఐసిస్ నాయకుడు అబూబకర్ అల్ బాగ్దాదీని అమెరికా సేనలు మట్టుపెట్టినప్పుడు కూడా అగ్రరాజ్యాధినేత ఈ గదిలోనే ఉండి ఆపరేషన్లు పరిశీలించారు.

**తక్షణమే టెహ్రాన్‌ను వీడండి.. భారతీయులకు ఇండియన్ ఎంబసీ అడ్వైజరీ**

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారతీయులకు ఇండియన్ ఎంబసీ తాజాగా మంగళవారం మళ్లీ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారతీయులంతా వెంటనే నగరాన్ని వీడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇప్పటివరకు ఎంబసీని సంప్రదించని భారతీయులు.. తక్షణమే అధికారులతో మాట్లాడి తమ లోకేషన్లను షేర్ చేయాలని సూచించింది. ఈ క్రమంలో హెల్ప్‌లైన్ నంబర్లు +98 9010144557, +98 9128109115, +98 9128109109 లకు తమ వివరాలు తెలియజేయాలని కోరింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. అమెరికా రాయబార కార్యాలయంతోపాటు పలు కార్యాలయాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి 'ఆలస్యం చేయకుండా నగరాన్ని వీడాలి' అంటూ భారతీయుల కోసం భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇరాన్‌లో సుమారు 10,000 మంది భారతీయులు ఉన్నట్లు ఓ అంచనా. వీళ్లలో ఆరు వేల మందికిపైగా విద్యార్థులే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ఇరాన్ నుంచి 110 భారతీయ విద్యార్థుల తరలింపు**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తం అయింది. భారతీయులను అలర్ట్ చేసింది. తక్షణమే ఖాళీ చేయించాలని సూచించింది. ఇందులో భాగంగా 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన మొదటి బ్యాచ్ అర్మేనియ చేరుకుంది. బుధవారం ఉదయం కల్లా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తరలించనున్నారు. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసింది. ఇక సొంత వనరులు కలిగిన వారు కూడా తరలి వెళ్లాలని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**ఖమేనీ అంతంతోనే యుద్ధం ముగింపు: నెతన్యాహు**

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా ఖమేనీని అంతం చేస్తేనే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేశారు. ఖమేనీని హత్య చేసేందుకు వేసిన ప్లాన్‌ను ట్రంప్ వ్యతిరేకించారంటూ అమెరికా అధికారులు ధ్రువీకరించిన తర్వాత నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.

# ప్రయోజనాలు కాపాడుతాం

>> స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు ప్రభృతులు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రివర్యులు భూపేంద్రయాదవ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించగా, సుప్రీం కోర్ట్ కేంద్ర సాధికార కమిటీని నియమించిందని, ఇది కొల్లేరు ప్రాంత ప్రజల మొదటి విజయమన్నారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణతో పాటు ప్రజల జీవనస్థితిగతులు కూడా పరిశీలించి ఇక్కడి ప్రజలకు న్యాయం జరిగేలా కేంద్ర సాధికార కమిటీ నివేదిక ఇస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను ఈ ప్రాంత ఎమ్మెల్యేలు అందరూ కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చయవలసిందిగా కోరామని, అదేవిధంగా కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండేలా కొల్లేరు పరిధిని కాంటూర్ 5 నుండి 3 కు తగ్గించేందుకు కోరామన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో భూములు కొల్పిన రాయితీ భూమిదారులకు పరిహారంగా 5వ కాంటూర్ బయట భూమి అందించాలని కోరామన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా కొల్లేరుప్రాంతంలో పక్షులను కాపాడుకుంటాం, పర్యావరణాన్ని పరిరక్షిస్తామని అక్కడి ప్రజల చేత రఘురామకృష్ణరాజు ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో 122 గ్రామాలున్నాయని, కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణ, ప్రజల సమస్యలను పరిశీలించేందుకు కేంద్ర సాధికార కమిటీ సభ్యులు రెండురోజులపాటు జిల్లాలో పర్యటిస్తారన్నారు. కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, కొల్లేరు ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెంచి, కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఉప్పుటేరులో ఆక్రమణల కారణంగా వర్షాకాలంలో వరదల సమయంలో కొల్లేరు ప్రాంతంలో నీరు నిలబడి కొల్లేరు ప్రాంతంలోని గ్రామాలు ముంపు భయాన్ని ప్రతీ ఏటా ఎదుర్కుంటున్నాయన్నారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణం, వన్యప్రాణులతో పాటు ఆ ప్రాంతంలో జీవించే ప్రజల జీవన స్థితిగతులను కూడా కమిటీ సభ్యులు పరిశీలించాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు ఎన్నోదశాబ్దాలుగా కొల్లేరు ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు కూడా రక్షణ కల్పించాలని కోరారు. వారి మనోభావాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. కేంద్ర సాధికార కమిటీ గౌరవ సభ్యులు చంద్రశేఖర్ గోయల్ మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ పరిమితులకు లోబడి కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల స్థితిగతులను కూడా పరిశీలించి నివేదిక అందించడం జరుగుతుందన్నారు.

# రూ. 5 లక్షల ఆర్థిక సాయం.. పిల్లల చదువుకు హామీ

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించినఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమెచెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని.. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి...అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుం టుందని శిరీషకు ఫోన్‌లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందు బాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిరీష

# మహిళను చెట్టుకు కట్టేసి కొడతారా?

>> లేక తిమ్మరాయప్ప గ్రామం వదిలి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తిమ్మరాయప్ప భార్యను అప్పు చెల్లించాలని గొడవపడి, మునికన్నప్ప, ఆయన కుటుంబ సభ్యులు ఆమెను చెట్టుకు కట్టేశారు. వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే స్పందించిన సిఎం చంద్రబాబు బాధితురాలి పట్ల దారుణంగా ప్రవర్తించిన మునికన్నప్పతో పాటు అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని జిల్లా అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. కుప్పం పురపాలిక పరిధిలోని నారాయణపురం అనే గ్రామంలో సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. పోలీసుల సమాచారాన్ని అనుసరించి నారాయణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప దగ్గర రూ.80 వేలను అప్పుగా తీసుకున్నాడు. అప్పుల భారం భరించలేక ఊరు విడిచిపెట్టి వెళ్లిపోగా, అతని భార్య పుట్టిల్లు శాంతిపురం మండలంలో ఉండి కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తున్నారు.

ఈ క్రమంలో నారాయణపురం పాఠశాలలో కుమారుడి టిసి తీసుకునేందుకు వచ్చిన ఆమెను మునికన్నప్ప, అతని భార్య మునెమ్మ, కుమారుడు రాజా, కోడలు జగదీశ్వరి పట్టుకొని భర్త తీసుకున్న డబ్బు చెల్లించాలని తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజుల్లో డబ్బులను తిరిగి చెల్లిస్తామని ఆమె చెప్పినా వారు వినిపించుకోలేదు. ఆమెను చెట్టుకు కట్టి విచక్షణారహితంగా దాడి చేయగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను విడిపించారు. ఈ ఘటనలో బాధితురాలు స్కూల్‌లో నా పిల్లల టిసి తీసుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చానని వివరించారు, నాపై దాడి చేసిన వాళ్లు గతంలో నాతో సంతకం చేయించుకొని రూ.80 వేలు అప్పు ఇచ్చారు. నేను అప్పు కట్టేస్తాను అని ఎంత చెప్పినా వినలేదు. నేను వస్తానని ముందుగానే తెలుసుకున్న వారు అక్కడికి వచ్చి ఉన్నారు. ఆ తరువాత నన్ను లాక్కెళ్లి చెట్టుకు కట్టేశారు. ఇంకా వేరే వాళ్ల దగ్గర కూడా మాకు అప్పు ఉంది. వాళ్ల దగ్గర కూడా మాకు చాలా ప్రమాదం ఉంది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నన్ను కొడుతుంటే మా అమ్మను కొట్టొదంటూ నా కొడుకు ఏడుస్తూ వాళ్ల కాళ్లు పట్టుకున్నా వదలేదు. నేను ఎంత వేడుకున్నా వదలలేదు. ఇక్కడ మాకు ఎవరూ లేరు. మమ్మల్ని చంపేస్తాం అని బెదిరించారు. ఇంక మా పిల్లలు స్కూల్‌కి వెళ్లి వచ్చేటప్పుడు వాళ్లని బెదిరించేవారు. వాళ్లు నాకు ఫోన్ చేసి ఏడ్చేవారు. ఒకప్పుడు మేము బాగా బతికేవాళ్లమని బాధితురాలు ఫిర్యాదులోని అంశాలను పోలీసులు సిఎం చంద్రబాబుకు వివరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి తక్షణం స్పందించిన సిఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనతో పాటు ఇటువంటి అప్పుల వాళ్ల వేదింపులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 18-06-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి మ.1.35
పూర్వాభాద్ర రా.12.24
వర్జ్యం రా.9.48-12.38
దు.ఉ.11.42-మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**వృషభం :** పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మిథునం:** చేజారిన విలువైన డాక్యుమెంట్లు లభ్యమవుతాయి. కోర్టుకేసులనుండి బయటపడతారు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం :** కొత్త కార్యక్రమాలను చేపట్టినా సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** అకారణంగా వివాదాలు ఏర్పడతాయి. జాగ్రత్త అవసరం. సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారు అరుదైన సత్కారాలు పొందుతారు. వస్తులాభం.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారంవల్ల కొంత ఊరటచెందుతారు.

**కుంభం :** ఉన్నత హోదాల్లోని వారితో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మీనం :** పనులు శ్రమానంతరం పూర్తికాగలవు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ధన లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుమలేశుని పేరు

>> నరేశ్, సదాశివరావు, శాంతారామ్, రామ్మూర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు. కీలకంగా నిర్ణయించిన వివరాలను మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు క్యాంపు కార్యాలయంలో మీడియాప్రతినిధులకు వివరించారు. బెంగుళూరు పయ్యావలికావలిలోని టిటిడి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని, శ్రీనివాసకల్యాణంలో పాల్గొన్నానన్నారు. ఆ ఆలయం చిన్నదిగా ఉండటంతో విశాలంగా భక్తులు మరింతమంది దర్శనం చేసుకునేలా నిర్మించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ కోరారన్నారు. వారి అభ్యర్థన మేరకు బెంగుళూరునగరంలోని ప్రధానప్రాంతంలో టిటిడి ఆలయాన్ని నిర్మించనుందన్నారు. తిరుపతిలో కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేయనున్న సిఎస్ఐఆర్ ల్యాబ్‌కు అద్దెప్రాతిపదికన టిటిడి స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించింది. తద్వారా టిటిడి అవసరాలకు వినియోగించే నెయ్యి, నీరు, ఆహారపదార్థాల నాణ్యతను ఉచితంగా తనిఖీ చేసేందుకు అవకాశం కలుగుతుంది. 1952లో ఏర్పాటుచేసిన న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక ఎస్వీకళాశాలను ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. సమరసతాసేవాఫౌండేషన్ సహకారంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న అర్చకుల శిక్షణకార్యక్రమంతోబాటు వివిధ వ్రతాలు, పూజా విధానాలలో కూడా శిక్షణాకార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం. అలాగే అక్షరగోవిందం, హరికథావైభవం, భగవద్గీత అనుష్టాన బోధన, భజేశ్రీనివాసం, వన నిధి, గిరి జనార్ధనం, సన్మార్గం వంటి కార్యక్రమాలను నిర్వహించి జనబాహుళ్యంలోనికి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టేలా చర్చించారు. టిటిడి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు హిందూ సనాతన ధార్మిక విలువలతోబాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు 120కోట్లు రూపాయలు ఖర్చుచేయనున్నారు. ఆగస్ట్‌లో వరలక్ష్మీవ్రతం పర్వదినాన తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో సౌభాగ్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం. టిటిడిలో అధ్యాపకుల పోస్టుల భర్తీని నిలిపివేయాలని ఎపిపిఎస్‌సికి సిఫార్సుచేశారు. ఇప్పటికే పనిచేస్తున్న 200మంది కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో దేవాదాయశాఖమంత్రి, టిటిడి ఛైర్మన్, టిటిడి ఇఒలతో త్రిసభ్యకమిటీ ఏర్పాటు జరిగింది. దళితవాడల్లో శ్రీవాణి నిధులతో ఆలయాల నిర్మాణంపై చర్చించారు.

# ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యాచరణ

## -15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపకల్పన: సీఎం చంద్రబాబు

**విజయవాడ.,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యచరణ చేపట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. జాతీయవృద్ధి రేటుతో పోల్చుకుంటే ఇప్పటికే మన గ్రోత్ ఉందన్నారు., 15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారన సాయంత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ వంటి అంశాలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఈ సమీక్షలో ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రుణాలు తగ్గించుకోవడం, సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలక అంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక శాఖ పని చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన ప్రామాణిక సమాచారాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ దిశగా ప్రణాళిక శాఖ పనితీరు మెరుగు పరుచుకోవాలని చంద్రబాబు చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కెబినెట్ సమావేశాలు, 25 ఎస్ఐబీపీ సమావేశాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడితో ఆగకుండా.. ఆ ప్రాజెక్టులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీ సచివాలయంలో ప్లానింగ్ శాఖ ఏపీ ఎకానమీ, గ్రోత్ డ్రైవర్స్, జీఎస్డీపీ ప్రొజెక్షన్స్, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లపై సీఎం చంద్రబాబు సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేస్తూ 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయికిమించి ఏపీ తలసరి ఆదాయం పెరిగిందన్నారు. ఈ మేరకు అధికారులు తమ నివేదికలో వివరించారన్నారు.

దీనిపై వారి నుంచి స్పష్టతను సీఎం చంద్రబాబు కోరారు. 2024- 25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతంగా ఉంటే.. ఏపీ 11.89 శాతం నమోదు చేసిందని తెలిపిన అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు, ఇది సంతృప్తికర అంశమైనప్పటికి మరింతగా తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్రాదాయాలు ఎలా పెరుగుతాయనే అంశంపై మనం దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. అందుకు తగినట్లు అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు అన్నారు.

## సజ్జల పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంత ప్రజలను ఉద్దేశించి 'సంకరజాతి' అంటూ వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిలు కోసం వేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. సజ్జలపై రాజధాని రైతు దళిత జెఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సజ్జల తరపు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఇదే వ్యవహారంపై శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు...డిజీపీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పిటీషనర్‌పై తొందరపాటు చర్యలొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని గుర్తు చేశారు. అలాంటి ఉత్తర్వులనే ప్రస్తుత పిటీషన్ లోనూ ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ...శిరీష ఫిర్యాదుపై ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పూర్తి వివరాలు సమర్పించాలని పేర్కొంటూ విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సంగీత దర్శకుడు శివమణి

**విజయవాడ, జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ చంద్రబాబు నాయుడుని ప్రఖ్యాత సంగీత వాయిద్యకారుడు, దర్శకుడు శివమణి కలిసారు. అమరావతి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన శివమణి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. ఆయన సంగీత వాయిద్య ప్రదర్శనలు పలు మార్లు చూసి తన్మయానికి లోనయినట్లు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించే దిశలో పాలసీలు రూపొందిస్తున్నామని తెలిపారు. సంగీత కళాకారుల ప్రతిభకు పట్టగడతామన్నారు. తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం చంద్రబాబుకు శివమణి ఆహ్వానపత్రిక అందించారు. శివమణిని సీఎం చంద్రబాబు సముచిత రీతిన సత్కరించారు.

# తిరుమల సమాచారం

## ఉచిత విద్యుత్ బస్సులతో భక్తులకు సౌకర్యం

### - తిరుమల, శ్రీవారిమెట్టు మార్గంలో ఉచిత ప్రయాణం



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఏ ఆలయంలో లేని విధంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు తిరుమలకొండపై కాటేజీలు, ఆలయం వద్దకు, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లకు చేరుకునేందుకు వీలుగా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పటికే పదివరకు విద్యుత్‌తో నడిచే ధర్మరథాలు (ఉచిత బస్సులను)తిరుమలలో టిటిడి నడుపుతోంది. కొండపై జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద నుండి జిఎన్‌సి, హెచ్‌విసి, హెచ్‌విడిసి, సన్నిధానం, పద్మావతి విచారణ కార్యాలయం, ఎస్ఎంసి, ఏటిసి, ఎంబిసి, మ్యూజియం, సిఆర్ఒ, లేపాక్షికూడలి ,యాత్రిసదన్‌లు ఇలా భక్తులకు సౌకర్యవంతంగా నడుస్తున్నాయి. తిరుమలకు వస్తున్న లక్షమంది యాత్రికులకు సరిపడేలా ఈ ధర్మరథాలు అందుబాటులో లేవు. పైగా ప్రైవేట్ ట్యాక్సీడ్రైవర్లు కొండపై భక్తులను అధిక ఛార్జీలకు నిలువుదోపిడీచేస్తున్నారనేది ఇటీవల వందలసంఖ్యలో ఫిర్యాదులు టిటిడి అధికారులకు అందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో శ్రీనివాసమంగాపురం ఆలయం, శ్రీవారిమెట్టుకు వెళ్ళే భక్తులను ఆటోడ్రైవర్లు, ట్యాక్సీడ్రైవర్లు నిలువుదోపీడీకి గురిచేస్తున్నారను. రోజుకు 10వేలమంది వరకు భక్తులు ఈ మార్గంలో తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు, అలిపిరి నుండి చేరుకుంటున్నారు. వస్తున్న భక్తుల రద్దీతో ట్యాక్సీలు, ఆటోలు అధికఛార్జీల దోపిడీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు కూడా అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లోనే జారీ చేస్తున్నారు. ఆ తరువాత అలిపిరి నుండి శ్రీవారిమెట్టుకు ఉచిత బస్సులద్వారా చేరవేస్తున్నారు. అయితే ఈ బస్సులు చాలడంలేదు. దీంతో టిటిడి 100 ఉచిత విద్యుత్ బస్సులకోసం కేంద్రానికి, దాతలనుండి సహకారం కోరింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలమేరకు భక్తులకు సకల సౌకర్యాలు కల్పనపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో భక్తులను ఉచితంగా సౌలభ్యంగా రవాణాకు వందవిద్యుత్‌తో నడిచే బస్సులు అవసరమని టిటిడి గుర్తించింది. ఈ మేరకు మంగళవారం తిరుమలలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో కూడా ఛైర్మన్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. భక్తులను ఒకచోట నుండి మరోచోటుకు ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అవసరమైన వంద విద్యుత్‌బస్సులను కేంద్రప్రభుత్వం సమకూర్చేలా కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామి సానుకూలత చూపారు. త్వరలోనే 100 బస్సులు టిటిడికి చేరుతాయని తెలిపారు.

# మహిళల రక్షణ, సాధికారతే జాతీయ మహిళా కమిషన్ లక్ష్యం

### - ఉమెన్స్ కమిషన్ జాతీయ సభ్యురాలు డాక్టర్. అర్చన మజుందార్



మీడియాతో మాట్లాడుతున్న జాతీయ మహిళా కమీషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** బాలికలు, మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కు మహిళా కమిషన్ కృషి చేస్తుందని జాతీయ విమెన్స్ కమిషన్ మెంబర్ శ్రీమతి. డాక్టర్. అర్చన మజుందార్ అన్నారు. దేశంలో ఎక్కడ మహిళకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ మహిళా కమిషన్ మూడు రోజుల రాష్ట్ర పర్యటన లో భాగంగా మొదటి రోజు మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పాత ప్రభుత్వ వైద్యశాలలను జాతీయ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్. అర్చన మజుందార్ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మజుందార్ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై దాడులకు పాల్పడితే చర్యలు తప్ప వన్నారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురిచేసినా, దాడులు చేసినా మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 10 మంది కంటే ఎక్కువ సిబ్బంది పనిచేస్తున్న ఏ వ్యాపార సంస్థలైనా, విద్యాసంస్థలైనా, కార్యాలయాలైనా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమిటీని సీనియర్ మహిళా ఉద్యోగిని ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవా లన్నారు. మహిళల రక్షణ కోసం 24 గంటలు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని, బాధితులు ఏ సమయమైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని, తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు, మహిళల రక్షణ కోసం, వారి సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ) ఏర్పాటు చేశారా లేదా అని జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్ వాకబు చేశారు. వారం రోజుల్లో ఐసీసీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కళాశాలలో మహిళ రక్షణ చర్యలపై డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని, హెల్ప్ లైన్ నెంబర్ లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, కళాశాల ఉద్యోగులు, ప్యాకల్టీల సమస్యలను మొదట ఐసీసీ కమిటీ లో పరిష్కరమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ ఐసీసీ ద్వారా బాధిత మహిళకు న్యాయం జరగపోతే రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్‌రోడ్‌లకు భూసేకరణ వేగవంతం చేయండి

### - ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ హైదరాబాద్ సెక్షన్ లో జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65ను ఆరు లైన్ల రహదారిగా విస్తరణ, పెడన విసన్నపేట 216ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ పనులను వేగవంతం చేసి నివేదికలను సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్‌రోడ్‌లకు భూసేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహణ వంటి పలు అంశాలపై మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్ విజయవాడ ఎన్ హెచ్ 65 రహదారికి సంబంధించి 226 కి.లో మీటర్ల ఆరు లైన్లల విస్తరణలో భాగంగా నందిగామ డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్స వాయి, పెనుగ్రంచిప్రోలు మండలాలలో జాతీయ రహదారుల అధికారులకు ఎన్‌జాయిమెంట్ సర్టిఫికెట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపవలసి ఉందన్నారు. అనుమంచిపల్లి, షేర్‌మహమ్మద్‌పేట, తోటచర్ల, భీమవరం గ్రామాలకు సంబంధించి ఆయా మండల తహశీల్దార్లు ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెడన విసన్నపేట 216 ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి జిల్లాలో విసన్నపేట తిరువూరు మండలాలలో 9 గ్రామాల నుండి ప్రతిపాదనలు రావాల్సి ఉండగా 5 గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్‌డివోకు సూచించారు. అవుటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారుల అధికారులు అవసరమైన భూమికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని రికార్డులను పరిశీలించి 3ఏ రిపోర్టు తయారు చేసి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి కంచికచర్ల, మైలవరం, జి. కొండూరు మండలాలలో 3ఏ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

## యువత నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు యోగా దోహదం: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** యువత నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం యోగా ఎంతో దోహదపడుతుంది. శారీరక, మానసిక ఉల్లాసాన్ని యోగాసనాలు ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. సోమవారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ అథ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీషా పాల్గొని జిల్లా రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో యోగాను భాగం చేసుకునేలా అన్ని వర్గాల ప్రజలను ప్రోత్సహించేందుకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత నిర్ధేశించుకున్న లక్ష్యాల సాధనకు మానసిక ప్రశాంతత పరిపూర్ణమైన ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. యోగాసనాల ద్వారానే అది సాధ్యపడుతుందన్న విసయాన్ని గుర్తెరిగి, ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. ఒక్కో యోగాసనంలో శరీరం లోని ఒక్కో భాగాన్ని క్రియాశీలం చేసేంత శక్తి దాగి ఉందన్నారు. వాటిని ఆచరించడం ద్వారా యోగాలో మాధుర్యాన్ని తెలుసుకోగలుగుతారన్నారు. ప్రజల జీవితంలో యోగాను భాగం చేయడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశ్యమన్నారు. బీపీ. మధుమేహం, కుంగుబాటు వంటి జీవనశైలి సమస్యలు దరిచేరకుండా యోగాసనాలు సహాయపడతాయన్నారు. మానవతావాదంతో నునాల్యవ శ్రమించే రెడ్‌క్రాస్ సభ్యులు, వాలంటీర్లతో కలిసి యోగాసనాలను అభ్యసించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు.

# వేంకటేశ్వరస్వామి దయతోనే కేసు నుండి విముక్తి : టిడిపి నేతలు



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దయ, ఆశీస్సులతోనే తప్పుడు కేసు నుండి నిర్ధోషులుగా విముక్తిలభించిందని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. 2019లో జరిగిన ఎన్నికల సమయంలో తిరుపతినియోజకవర్గంలో టిడిపి తరపున ప్రచారానికి సంబంధిత అధికారుల వద్ద ముందస్తు అనుమతితీసుకోలేదని గతంలోకేసు నమోదుచేశారు. ఈ కేసు తిరుపతి కోర్టుల సముదాయంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విచారణ చేశారు. విచారణ అనంతరం 10మంది నేతలు నిర్ధోషులుగా తేల్చారు. దీంతో తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్రనాయకులు నరసింహయాదవ్, పనబాకలక్ష్మి, సూరా సుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, డాక్టర్ సుధారాణి, ఆర్‌సి మునికృష్ణ, డాక్టర్ ఆశాలత, దంపూరి భాస్కర్‌యాదవ్, బిజి కృష్ణయాదవ్, దినకర్, సత్యశ్రీనివాస్ తదితరులు మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకుని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తమకు దేవుని ఆశీస్సులు ఉన్నాయని విశ్వాసం వెలిబుచ్చారు.

## హైందవ సనాతన ధర్మంపై సద్గమయ విద్యార్థులకు డే స్కాలర్స్‌గా శిక్షణ: టిటిడి హెచ్‌డిపిపి

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల్లో హైందవసనాతనధర్మం నేర్పిన మానవీయ విలువలను ,వ్యక్తిత్వవికాస కార్యక్రమాల్లో శిక్షణనివ్వడానికి సద్గమయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిటిడి హెచ్‌డిపిపి సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం టిటిడికి చెందిన ఏడు పాఠశాలల్లో దాదాపు 1,600మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో శిక్షణనివ్వాలని చర్చించారు. టిటిడి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు హిందూ సనాతన ధార్మిక విలువలతోబాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు 120కోట్లు రూపాయలు ఖర్చు చేయనున్నారు. మంగళవారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన తిరుమలలో హెచ్‌డిపిపి బోర్డు సమావేశం జరిగింది. శ్రీవారిసేవ, సనాతనధర్మం వ్యాప్తి చేయడంపై కీలకంగా చర్చించారు. తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత మంచి దర్శనం కల్పించడానికి ఇంకా ఎలాంటి పద్దతులు అనుసరించాలి అనే విషయంపై అభిప్రాయాలు తీసుకున్నారు. టిటిడి ఆల యాలు, అంతర్జాతీయంగా సేవలను విని యోగించుకునే అంశాలపై చర్చించారు.

## సెప్టెంబర్ నెల ఆర్జిత సేవల టిక్కెట్లు విడుదల

### - ఆన్‌లైన్‌లో వెంకన్న దర్శనాలకు టిటిడి సిద్ధం

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న సెప్టెంబర్‌నెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 18వతేదీ నేడు విడుదల చేయనుంది. సెప్టెంబర్ నెలకోటాను 18వతేదీ బుదవారం ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వతేదీ బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 20వతేదీ మధ్యా హ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు.

# పాఠశాలలకు తాళాలు వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

### - మోడల్ ప్రైమరీ పాఠశాల మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కావాలి
### - పాతపద్ధతినే కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల నిరసన

**పామిడి, జూన్ 17 ప్రభాతవార్త:** మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చిన విద్యాశాఖాధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు తాళాలు వేసిన సంఘటన మంగళవారం అనంతపురం జిల్లా పామిడి మండలం రామగిరి గ్రామంలో చోటుచేసుకుంది. మోడల్ ప్రైమరీ పాఠశాల మాకొద్దు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కావాలి.. అధికారులారా మా పిల్లల భవిష్యత్తుతో చెలగాటమా..? అంటూ మండిపడ్డారు. 2025-26 విద్యాసంవత్సరం ఇక్కడ 1వ తరగతి నుండి 5వ తరగతి వరకే కొనసాగించటం జరుగుతుందని మిగిలిన 6,7,8వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులంతా ఎద్దులపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు వెళ్ళాలంటూ అధికారులు ఆదేశిస్తుండటం ఎంతవరకూ సమంజమని ప్రశ్నిస్తూ గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చివేసిన అధికారులు మిగిలిన తరగతులను ఎద్దులపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వీలినం చేస్తూ ఇక్కడ విద్యనభ్యశిస్తున్న పిల్లల (విద్యార్థుల) జీవితాలతో చెలగాటం ఆడుతున్నట్లైనని వెంటనే ఇక్కడ పాతపద్ధతినే కొనసాగించాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఇక్కడి మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యనభ్యశించేందుకు అన్ని రకాల అవకాశాలు ఉన్నప్పటికీ ఈ పాఠ శాలలో కేవలం 5వ తరగతి వరకే

విద్యార్థులు విద్య నభ్యశించాలని మిగిన 6,7,8వ తరగతుల విద్యార్థులు ఎద్దులపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశా లలో విద్యనభ్యశించాలని ఆదేశించటం దారుణం అంటూ ఎంఈఓ ఎద్దుట నిరసనకు దిగారు.



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు

# వడ్డెర సొసైటీలకు కంకర క్వారీ లీజులు, భారీగా రాయితీలు - సీనరేజ్‌లో సైతం 50 శాతం రాయితీ

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలుకుసన్నద్ధమవుతోంది. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారికి రహదారి కంకర (రోడ్ మెటల్), పలక, క్యూబ్స్, కెర్బ్స్ లీజుల్లో ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వడ్డెర సొసైటీలకు లీజులు కేటాయించి, వాటి ద్వారా వారు ఉపాధి పొందేలా చూడాలని నిర్ణయించింది. లీజుల కేటాయింపులో ఆ సొసైటీలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఆయా ఖనిజాలకు సంబంధించి ఇతర దరఖాస్తుదారులతో పాటు అదే లీజుకు వడ్డెర సొసైటీలు 15 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే. సొసైటీ దరఖాస్తునే పరిగణలోకి తీసుకుంటారు. ఒకవేళ ఏదైనా లీజు ఒకటి కంటే ఎక్కువ సొసైటీల నుండి దరఖాస్తులు వస్తే, వాటిలో ఆ లీజు ప్రాంతానికి ఏ సొసైటీ దగ్గరగా ఉంటుందో పరిశీలించి, దానికి తొలి ప్రధాన్యం ఇస్తారు. ఒక్కో సొసైటీకి గరిష్టంగా 12 హెక్టార్లకు మించకుండా లీజు కేటాయిస్తారు. వడ్డెర సొసైటీలకు కేటాయించే లీజుల్లో తవ్వి, తరలించే రోడ్ మెటల్, పలక, క్యూబ్స్, కెర్బ్స్‌కు గనుల శాఖ వసూలు చేసే సీనరేజ్‌లో ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వనుంది. రాష్ట్రంలో 371 వడ్డెర సొసైటీలున్నాయి. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 140, ఆ తర్వాత పల్నాడులో 72, తిరుపతిలో 47, నంద్యాల జిల్లాలో 37 సొసైటీలు ఉన్నాయి. ఎన్టీఆర్ ,గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి తదితర జిల్లాల్లో కూడ కొన్ని సొసైటీలు ఉన్నాయి. వాటన్నింటికీ లీజుల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వనున్నారు. 1990 దశకం నుండి వడ్డెర సొసైటీలకు క్వారీ లీజులు కేటాయించే విధానం ఉండేది. గత వైకాపా ప్రభుత్వం 2022లో లీజుల కేటాయింపునకు ఈ వేలం విధానం తీసుకొచ్చింది. దీనివల్ల లీజు కావాల్సిన వడ్డెర సొసైటీలు...ఇతరులతో కలిసి వేలంలో పాల్గొని, ఎక్కువ ధర కోట్ చేయాల్సి వచ్చేది. ఒకవేళ అధిక ధర కోట్ చేయకపోతే... ఆ వేలంలో ఎవరు అత్యధిక ధర కోట్ చేశారో ఆ మొత్తాన్ని ప్రీమియంగా చెల్లించేందుకు ముందువచ్చే సొసైటీకి లీజు దక్కేది. దీంతో వడ్డెర సొసైటీలకు లీజు పొందడం కష్టంగా ఉండేది. ఈ విషయం అప ్పట్లో ఎన్నికల ప్రచార నేపథ్యంలో వడ్డెర్లు చంద్రబాబు దృష్టికి తీసుకుని రావడంతో...కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ...వడ్డెర్లకు రాయితీపై లీజులు కేటాయిస్తామని, సీనరేజ్‌లో తగ్గించి ఇస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఆ హామీ అమలుకు గనులశాఖ ప్రతిపాదనలు సిద్దం చేసింది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.08/2025-26/EE(AM)VJA/AE/E.G.Dist తేది: 16.06.2025
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (వ్య.మా) విజయవాడ వారిచే తూర్పుగోదావరి మరియు కోనసీమ జిల్లాలోని వివిధ రైతు బజార్ల యొక్క ఫేస్ లిఫ్టింగ్ పనులు కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 6 పనులకు అంచనా విలువ: రూ. 8.48 లక్షలు. పూర్తి వివరాలను www.eprocurement.gov.in లో తేది: 17.06.2025, మ.1.00గం. నుండి చూడవచ్చును. ఫోన్ నెం. 0866-2974950. 9182361369.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, వ్యవసాయ మార్కెటింగ్, విజయవాడ.
DIPR.NO. 16723/CL/ADVT/1/1/2022-23 తేది: 17.06.2025



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.45/మిషన్ శక్తి సంబల్/2025-26 తేది: 11.06.2025
తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షక ఇంజనీరు పంచాయతీరాజ్ శాఖలో 01 పని చేయుటకు అంచనా విలువ : రూ.45.00 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ డాక్యుమెంట్లు తేది: 19.06.2025, సా.4.30గం. నుండి ఇ-మార్కెట్ ప్లేస్ http://apeprocurement.gov.in లో చూడవచ్చును. ఫోన్ : 0884-2386992.
సం/-. పర్యవేక్షక ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, కాకినాడ.
DIPR.NO. 16714/CL/ADVT/1/1/2022-23 తేది: 17.06.2025

వార్త

ఒక్కొక్కప్పుడు మన సందేహాలే మనలను మోసం చేస్తాయి. సందేహం కలిగినప్పుడు భయం వల్ల మన ప్రయత్నాన్ని విరమిస్తాం. మనం సాధించగలిగే దాన్ని సైతం పోగొట్టుకుంటాం.

-ఫిలిప్స్

# సకల జనగణన సాధ్యమే!

దేశంలో 15ఏళ్ల అనంతరం జరిగే జనగణనకు సైరన్ మోగింది. 16వ జనగణన ఇది. ప్రతి పదేళ్లకూ ఒకసారి దేశ జనగణనకుఆస్కారముండగా 2020లో జరగాల్సిన జనగణన 'కరోనా' రీత్యా వాయిదాపడింది. స్వాతంత్ర్యానికి ముందు 15 జనగణనలు పూర్తయ్యాయి. జనగణనతోపాటు ఈసారి తొలిగా కులగణన చేపట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. 2027 మార్చి1వ తేదీ నాటికి జనగణన పూర్తవుతుంది. జనాభా లెక్కల సేకరణ అంతా డిజిటల్ విధానంలో జరుగుతుంది. సమాచార సేకరణ, బదిలీ, డేటా భద్రత వంటి అన్ని విషయాలనూ కట్టుదిట్టంగా చేయాలని కేంద్రం తలపెట్టింది. రెండు దశల్లో జరిగే జనగణనలో తొలిదశలో అక్టోబరు 1, 2026 నాటికి జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, లఢక్, హిమాచల్‌ప్రదేశ్‌లలో పూర్తవుతుంది. జనగణన కోసం సోమవారం కేంద్ర హోంమంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 1, 2027 నుంచి జనగణన ప్రారంభమౌతోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కల భారత్‌లో జనగణన అంటే అత్యంత కీలక పరిణామం. మంచు ఎక్కువగా కురిసే లఢక్ ప్రాంతంలో 1 మార్చి 2027లో మొదలు పెడతారు. కులగణన వల్ల ఆయా కులాల్లో ఉన్న ఆర్థికపరిస్థితి, సామాజిక అంతరాలు వగైరా అంశాలపై విశ్లేషణలు వీలవుతాయి. దేశంలో సమగ్ర కులాల వారీ జనాభా లెక్కల ప్రక్రియ బ్రిటిష్ వారి హయాంలో 1881 నుంచి 1931 మధ్య కాలంలో జరిగింది. సుదీర్ఘకాలం జరగడానికి కారణాలు అప్పట్లో కేవలం జనాభా లెక్కలు మాత్రమే జరిగేవి. అప్పట్లోనే కులాల వివరాలను కూడా సేకరించినట్లు చెబుతున్నా అవి వెలుగులోకి రాలేదు. కులాల వారీగా ప్రాతిపదికగా జనగణన ప్రక్రియను తెలంగాణ, బీహార్‌లలో ఇప్పటికే పూర్తి చేశాయి. జాతీయస్థాయి అంశం అయినందున ఎంతో పకడ్బందీగా సేకరించాల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు చేపట్టాయని చెబుతున్న జనగణనను రాజకీయ కోణంలో చేశారన్న ఆరోపణలున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలు ఎంతో ముందుచూపుతో చేపట్టిన, అనుసరించిన మార్గదర్శకాలను ఆధునీకరించి, ఆధునిక గణాంక వైఖరితో పారదర్శకంగా జనగణన చేపట్టాల్సి ఉంది. దేశంలో కులగణన చాలా అవసరమని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ఏమయితేనే కాంగ్రెస్ బాటలో అన్ని రాష్ట్రాల్లోనూ జనగణాంక దీక్ష చేపట్టడం స్వాగతించాల్సిన విషయం. తొలిదశలో ఇంటి జాబితాలో ప్రతి ఇంటికి సంబంధించిన గృహనిర్మాణ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం సేకరిస్తారు. రెండో దశ జనాభా గణనలో ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను రాబడతారు. ప్రజల నుంచి ఏయే వివరాలను సేకరిస్తారో ప్రశ్నావళిని విడుదల చేయాల్సి ఉంది. కులగణన విషయంలో కాంగ్రెస్‌పార్టీ పట్టుబట్టి తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసింది. అందులో అర్ధసత్యాలున్నాయని అసమగ్రమని ఆరోపణలున్నా, జాతీయస్థాయలో జరిగే కులగణనకు మార్గదర్శకాలు చూపించినట్లయింది. కేంద్ర ప్రభుత్వం ఒకనాడు కులగణన పేరుచెబితేనే మండిపడేది. అటు పార్లమెంటులో,సుప్రీంకోర్టులోనూ వద్దని వాదించిన కేంద్రప్రభుత్వం కులగణనకు తలూపడం మంచి పరిణామం. కాగా సోమవారం విడుదల చేసిన 16వ జనగణన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన చేయకపోవడం విమర్శలకు గురైంది.ప్రశ్నావళిలో ఉంచి కులగణన వివరాలను విశ్లేషిస్తారేమో చూడాలి. కులాల వారీ ఆర్థిక, సామాజిక వివరాలను క్రోడీకరించుకుని ఆయావర్గాల వెనుకబాటుతనాన్ని నిర్ణయించి ప్రత్యేక పథకాలు చేపట్టేందుకు ఈ విశ్లేషణలు పనికివస్తాయి. తెలంగాణ రాష్ట్రంచేపట్టిన కులగణన వివరాలలతో జాతీయ జనగణనకు కానీతాజాగాచేపట్టే కులగణనకు కానీ సంబంధం లేదు. జాతీయ జనాభా చట్టం 1948 ప్రకారం అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరి ఒకే విధానంతో, ఒకే తీరుగా జనగణన చేయాల్సి ఉన్నందున కేంద్ర ప్రభుత్వంతనకంటూ ప్రత్యేక ప్రశ్నావళి, ప్రణాళిక, సేకరణ విధానాన్ని రూపొందించుకుంటోంది. రాజ్యాంగంలోని 246 అధికరణం కింద ఏడో షెడ్యూలులో 69వ అంశంగా జనగణన చేపడ్తారు.సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రతి సభ్యుడి వివరాలు తప్పనిసరిగా సేకరించే ప్రణాళికలో ప్రభుత్వం ముందుకుకదులుతోంది. ప్రశ్నావళిలో చోటు చేసుకునే ప్రశ్నలు ఆయా నివాసితుల వ్యక్తిగత వివరాలతోపాటు కులం, ఉపకులం, సొంత ఇల్లా అద్దె ఇల్లా! ఆర్థిక పరిస్థితులు ఉద్యోగ ఉపాధి ఆదాయవనరుల వంటి కీలకమైన ప్రశ్నలుంటాయి. కులప్రస్తావనపై పెద్దగా చర్చలు లేని 1881లోనే సమగ్ర కులగణన విషయమై బ్రిటిషర్లు ముందుచూపుతో జనగణనకు అంకురార్పణ గావించారు.'విభజించు, పాలించు' అనేరీతిలో ఆలోచించే వారికి భవిష్యత్‌లో 'కులం' అతికీలకంగా ఉంటుందని భావించి ఉండొచ్చు.స్వాతంత్ర్యం వచ్చాక భారతీయ పాలకులు జనగణన నుంచి 'కుల'ప్రస్తావనగణనలను తొలగించారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో కులాలవారీ సంక్షేమప్రగతి ప్రణాళికలు ప్రధానంగా తీసుకోవాల్సి రావడంతోకులగణన'కు ప్రాముఖ్యత ఏర్పడి కేంద్రప్రభుత్వం తరపున 2010 లోనే ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభలో హామీ ఇచ్చారు. అత్యధిక రాజకీయ పార్టీలు కులగణన మంచిదేనని అభిప్రాయపడ్డాయి. 2011లో కులగణన ప్రయత్నం జరిగింది. కానీ బయటకు రాలేదు. తాజాగా 'కులగణన' అవసరాన్ని గుర్తించినందున ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో సమగ్ర సర్వేకు ముందడుగు పడింది. ఈ రీత్యా సర్వమానవ సౌభ్రాతృత్వంలో భాగంగా సకల జనుల కోసం సంక్షేమ పథకాలు అందేందుకు కొత్త ప్రయత్నాలన్నీ సానుకూల పడగలవని ఆశిద్దాం.



ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కటే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

థామస్ ఫుల్లర్



ఏదైనా ఒక లక్ష్యంతో గట్టిగా కృషి చేస్తే ప్రతి వ్యక్తికీ నేడు కాకపోయినా రేపైనా విజయావకాశం వచ్చి తీరుతుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# 'స్టెమ్' తో పూర్తిస్థాయి విద్యావికాసం!

***ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశాదిశా నిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి.ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం, రాష్ట్ర విద్యారంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అప్పుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమోతుంది. రాబోవు జాతీయ విద్యా చట్రంలో తగిన సంస్కరణలు చేయడం ద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యా విధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం.***



మల్లాడి శ్రీనగేష్

నూతన విద్యా విధానం 2020 నిజమైన స్ఫూర్తితో రూపు దాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమే కాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి, తద్వారా దేశం సమ్మిళిత విద్యా చట్రంలో వివిధ నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అందరికీ నాణ్యమైన, సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. అంతేకాక విద్యార్థి తన మాతృభాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం, ఆంగ్లం లేదా స్థానిక భాషలోనే చదవాలనే నిబంధన లేకుండా ఆయా రాష్ట్రాలు భాషా బోధనలో తన నిర్ణయం తీసుకోవచ్చు అనే విషయం కూడా విదితమే. ఈ ప్రతిపాదనలన్నీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి బాలలకు చదువుతో బాటు మనో బలాన్ని అందించడానికి చక్కటి వెసులుబాటు కల్గిస్తుంది. ఈ విద్యా విధానం రూపకల్పన ప్రాథమిక విద్యా స్థాయి నుండి అనుసరించాల్సిన వివిధ వ్యూహాలు మొదలుకొని ఉన్నత స్థాయి విద్య సాంకేతికత వృత్తి విద్య, గ్రామీణ,పట్టణ స్థాయి విధి విధానాలను మేళవించి సమ్మిళిత విద్యా భావనలను పూర్తి స్థాయిలో పొందుపరచినట్లు చెప్పవొచ్చు. దీనికితోడు ఉన్నత విద్యలో ఉన్న విద్యార్థులకు వారి భవిష్యత్ ఉద్యోగ రంగాలను ఎంపిక చేసుకోవడానికి, గ్లోబల్ స్థాయి ఉద్యోగ పోటీని ఎదుర్కోవడానికి, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో మెరుగైన నైపుణ్యాలను గడించడానికి నూతన విద్యా విధానం సూచించిన స్టెమ్ ఆధారిత విద్య కూడా యువత భవిష్యత్తును ఉజ్వలమయం చేయడానికి తప్పక ఉపకరిస్తుందని చెప్పక తప్పదు. సాంప్రదాయ విద్యాబోధనకు స్వస్తిపలికి, అనుభవాత్మక విద్యకు నాంది పలికి విద్యార్థులకు స్నేహపూరిత తరగతి నిర్వహణలో స్టెమ్ ఒక పటిష్ట వ్యూహంగా వర్ణించవచ్చు. ఈ నేపథ్యంలో స్టెమ్ ఆధారిత విద్య పాఠశాల స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలనేది అనేక మంది విద్యా సంస్కర్తల ప్రధాన అభిప్రాయం! స్టెమ్ ఆధారిత విద్య అనగా సైన్స్,టెక్నాలజీ, ఇంజనీరింగ్ మాథమెటిక్స్ అనే అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్గించడం, తదనుగుణమైన వసతులు అనగా స్టెమ్ లాబొరేటరీలు, అటల్ లాబొరేటరీలను ఏర్పరచి దానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు ప్రయోగాత్మకను ప్రోత్సహించడం తద్వారా ఆలోచనాత్మకతను పెంపొందించడం నూతన విద్యా విధాన ప్రధాన ఉద్దేశ్యం.అనగా 21వ శతాబ్దపు నైపుణ్యాల నేర్పరితనాన్ని ముఖ్యంగా 5 'సి'ఐదు' నైపుణ్యాలను అనగా క్రియేటివిటీ (సృజనాత్మకత ), క్రిటికల్ థింకింగ్ (క్లిష్టమైన ఆలోచన), కమ్యూనికేషన్ సమాచారం, సంభాషణ), కొలాబోరేషన్ (సహకారం) సిటిజెన్ షిప్ (పౌరసత్వం) విషయాలలో విద్యార్థులను సమాయత్తం చేయడం నూతన విద్యా విధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు.

ఈ విషయాన్ని నూతన విద్యావిధానం దేశంలో ఒక కొత్త రూపు, ఒక ఒరవడిని దిద్దడానికి రచించబడిందనివిద్యా విధాన రూపశిల్పి కస్తూరి రంగన్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నేపథ్యంలో బాల్ రక్షా భారత్ (సేవ్ ది చిల్డ్రన్) పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షల సౌజన్యంతో తెలుగు రాష్ట్రాల్లో కాక సుమారు 7రాష్ట్రాల్లో ఏర్పరచిన స్మార్ట్,స్టెమ్ లేబొరేటరీల అనుభవాలను కూడా క్రోడీకరిస్తే విద్యార్థులు ఈ లాబరేటరీలు డిజిటల్ బోధన ద్వారా విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకపాఠ్యాంశాలతో బాటుఆయా అంశాలపై అదనపు సమాచారాన్ని పొందడం స్టెమ్ ప్రయోగాల ద్వారా ప్రత్యక్ష ప్రయోగాత్మక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వెల్లడించారు. ఒడిశాలోని కుగ్రామా ల్లో ఉన్న ఉన్నతవిద్యను అభ్యసించే బహుళ భాషానేపథ్యంతో



చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు కూడా స్టెమ్, డిజిటల్ బోధనా భాగ్యాన్ని కొనియాడారు.దీనికితోడు ఈ స్టెమ్ లాబొరేటరీలను జిల్లాలో గల డైట్‌లో కూడా ఏర్పాటుచేయడం వలన స్టెమ్‌విద్యను పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ శిక్షణపొందుతున్న యువ ఉపాధ్యాయులకు ఈస్టెమ్ లాబొరేటరీలు ఒక చక్కటి లెర్నింగ్‌వసతిగా అభివర్ణించారు. ఈ దిశగా ప్రైమ్ విద్యా బోధనా పద్ధతి తరగతి గదిలో ప్రస్తుతం సాగుతున్న సాంప్రదాయ విద్యాబోధనా సరళికి స్వస్తిపలికి బోధనలో విద్యార్థుల భాగస్వామ్యం, క్లిష్టమైన విషయాలను సులభంగా అవగాహన చేసుకోవడమే కాక ప్రయోగాత్మకంగా విషయాలను పరిశీలించి విద్యార్థులు సాధారణంగా క్లిష్టమని భావించే సైన్స్, ఇంజినీరింగ్, గణిత సబ్జెక్టులలో సరళరీతిన అభ్యసించే వెసులుబాటు స్టెమ్ ప్రయోగశాలలు కల్పిస్తాయి. అంతేకాక దీని ద్వారా పీర్ లెర్నింగ్ అనగా తోటి విద్యార్థుల ప్రయోగాల ద్వారా మరింత సులభంగా కాన్సెప్ట్‌లను నేర్చుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. ఈ విషయాలు వివిధ రాష్ట్ర విద్యాశాఖలు, స్వచ్ఛంధ సంస్థలు సి.ఎస్.ఆర్‌ల సౌజన్యంతో ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో లోనే కాక దేశ వ్యాప్తంగా స్టెమ్ అటల్ లేబొరేటరీల ద్వారా స్మార్ట్ క్లాసురూముల ద్వారా విద్యార్థుల నుండి, ఉపాధ్యాయుల నుండి సేకరించిన ప్రత్యక్ష సమాచారం ద్వారా ఈ ప్రయోగశాలల వలన పిల్లల్లో ఆసక్తి అనుభవాత్మకత, విశ్లేషణ, విషయపరిజ్ఞానం, సృజనాత్మకత వంటి సూక్ష్మవిషయాల్లో మెరుగైన ఫలితాలు లభించాయని దీని ద్వారా ఉపాధ్యాయులు సైన్స్ గణిత విభాగాల్లో క్లిష్టతరమైన విషయాలను సులువుగా బోధించగలుగుతున్నారని ఉపాధ్యాయుల అనుభవాలద్వారా తేటతెల్లమోతోంది. దానికి తోడు ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి ప్రయోగాలు చేబడుతూ తరగతులు నిర్వహించేలా ప్రతి ప్రయోగం ఎలాచేయాలనే పూర్తి సమాచా రంతో ప్రత్యేక వీడియోలను ప్రయోగ శాలలో ఆన్లైన్‌లో సిద్ధంగా ఉండడం వలన ఉపాధ్యాయులు విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడానికి వెసులుబాటు కలుగుతోంది. ఈ ప్రయోగశాలలు ప్రస్తుతం 6వ తరగతి నుండి 10వ తరగతివరకు ముఖ్యమైన కాన్సెప్ట్‌లను దృష్టిలో ఉంచుకొని అమర్చడం జరిగింది. ప్రయోగాల అనంతరం నెల లేదా రెండు నెలలకు ఒకసారి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వ హించే వెసులుబాటు కూడా వుంది. దీనిద్వారా పాఠశాలలో నిర్వహించే సి.సి.ఇ (నిరంతర ఎవాల్యుయేషన్) మదింపు ప్రక్రియకు ఈ పరీక్షలను అనుసంధానం చేసుకోవచ్చు. ఈలాబరేటరీలో జరిగే ప్రయోగాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (పెద్ద టెలివిజన్ లాంటి బోధనా పరికరాలతో) అనుసంధానం చేస్తేఫలితాలు మరింత మెరుగైన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మరింత పెరిగేలా ప్రయత్నించవచ్చు అనడంలో సందేహంలేదు.ఈ అనుభవాల దృష్ట్యాఇదేదిశగా, ప్రతి పాఠశాలలోనూ స్టెమ్ స్మార్ట్ క్లాసురూములను ఏర్పరచడం, డైట్‌లను ఈ రంగంలో బలోపేతం చేయడం ద్వారా ఉపాధ్యాయ శిక్షణకు ఒక కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడం, స్టెమ్ విద్యకు నాణ్యమైన సాంకేతిక విద్య గ్రామీణ ప్రాంత విద్యా ర్థులకు చేరేలా ప్రయత్నాలు చాలాబాగా సత్ఫలితాలు సాధించవచ్చని చెప్పవచ్చు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ యోచిస్తున్నట్లు జిల్లా సైన్స్ సెంటర్లను స్టెమ్ సెంటర్లుగా తీర్చిదిద్ది విద్యార్థులను సైన్స్‌తోబాటు సంబంధిత అంశాలపై పిల్లలకు ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి నుండి పూర్తిస్థాయి అవగాహన, శిక్షణ, క్షేత్ర సందర్శన,స్టెమ్ ప్రదర్శన శాలల నిర్వహణద్వారా విద్యార్థులు స్వంతంగాప్రయోగాలు తయారు చేసి ప్రదర్శించేలా ప్రోత్సహించడం స్టెమ్ విద్యను బలోపేతం చేయడంలో ఒక వినూత్న ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ విధంగా గ్రామీణ ప్రాంత, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ముఖ్యముగా నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం సాంకేతిక విద్యకు దూరంగా వున్న సుమారు 60శాతంమంది బాలికలను సాంకేతిక విద్యతో విద్యారంగంలో బాలికలు ముందంజ వేసేలా అందరు సమిష్టిగా కృషి చేయడం తప్పనిసరియని అవగతమోతోంది. ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశా దిశానిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి. ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం మరియు రాష్ట్ర విద్యా రంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అపుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమోతుంది. రాబోవు జాతీయ విద్యాచట్రంలో తగినసంస్కరణలు చేయడంద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యావిధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం. ●

# దళితుల అణచివేత ఇంకెంతకాలం?

గుర్రం రాంమోహన్ రెడ్డి

దాడులు, అవమానాలు, అణిచివేతలు వివక్ష గ్రామ బహిష్కరణలు పునాదులను దళితల వర్గాలు పెకిలివేయాలి. దళిత బహుజనులపై దాడులు ఇంకెన్నాళ్లు అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దాడులు, దండన,అవమానాలు మూటలతో దళితులు బ్రతుకు బండిలాగుతున్నారు. చరిత్ర నిర్మాతలు మూలవాసులు దళితులే అన్న చారిత్రక సత్యం సమాజంకు తెలియదా! అన్న ప్రశ్నలు వెంటాతున్నాయి. సమానత్వం స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం లభిస్తేనే దళితులు ఆత్మగౌరంతో సమాజంలో జీవనంసాగిస్తారన్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ మాటలు ఎప్పుడు నిజం అవుతాయి.నిప్పుల కొలిమిలో అవమానాలు భరించిన దళితులు విముక్తి, సాయుధ, విప్లవ పోరాటాలు నిర్మించి సమిధలైన బతుకు బండికి భరోసా ఏది. శ్రామిక కులాలు విముక్తి పోరాటాలు సాగించడంలో దళిత బహుజనులు అగ్రభూమిక పోషించిన ఎందుకు దాడులు జరుగుతున్నాయి. ప్రతిగడియ, ప్రతి రోజు దళితులపై దాడులు నిత్యకృత్యం అవుతున్నాయి. ఒక వైపు పాలకవర్గాలు మరోకవంక సామాజికంగా ఉన్నతస్థానంలో వున్న వ్యక్తులు శక్తులు దాడులకు, ఒడిగడుతున్నారు. కారంచేడు కన్నీళ్లు ఇంకా కారుతున్నాయి. పదిరికుప్పం ఘటన జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. నీరు కొండ సంఘటన నేటికి నిలదీస్తున్నా ఎవరికీ కనువిప్పు కలగడంలేదు. రాష్ట్ర జనాభలో 80లక్షలకు పైగా దళిత జనాభా ఉంది.సిందు మాదిగ, పాముల వంటి 59 కులాలను ఎస్.సి. జాబితాలో చేర్చారు. 23 శాతం ఎస్.సి. జనాభా ఉండగా, 15శాతం రిజర్వేషన్లు అవుతున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై, దళిత మహిళలపై అత్యాచారాలకు అంతులేదు.దళితులపై జరిగే నేరాలు సగటున 25శాతం నుంచి30శాతం మధ్యఉన్నట్లు యన్.సి. ఆర్.బి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణాలో చాలా గ్రామాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామాల్లో అధికంగా దళితులపై దాడలు జరుగుతున్నాయి. 2014-2021 సంవత్సరాల మధ్య దళితులపై 12 వేల 645 దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. 2014లో1447, 2019లో 1690, 2021లో 1727, దాడులు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. పెద్ద పల్లి, మహబూబ్నగర్, ఆర్మూర్, ఆదిలాబాద్,నేరళ్ళు, దాడులు, హత్యలు జరిగాయి. ఇసుక మాఫియా దాడుల్లో నేరేళ్ళలో 40 మంది దళితులు మృత్యువాత పడ్డారు. మొత్తంగా గమనిస్తే 1991 నుంచి 2021 మధ్య 7 లక్షలు దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. ప్రతీ 12 నిమిషాలల్లో దౌర్జన్యం ప్రతి ఆరుగురు దళిత మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. 2019-2021లో దళితులపై దారుణాలు 45,961 నుండి 50,900 వరకు అంటే 11 శాతం పెరిగాయని యన్.సి. ఆర్.బి. వెల్లడించింది. బి.జె.పి పాలిత రాష్ట్రాలో ఉత్తరఖండ్, 50శాతం, 46శాతం మధ్యప్రదేశ్, 36శాతం గోవా,యు.పి. 46శాతం, దళితులపై దాడులు జరిగినట్లు విశదమౌతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 6 శాతం దళితులపైదాడులు జరిగినట్లు స్పష్టమౌతుంది. తెలంగాణ 32శాతం దారుణాలు జరిగాయి. సమాజంలో మిగిత సామాజిక వర్గాలతోపాటు దళితులలో రాజకీయ, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక, విద్యాపరమైన సమాన హక్కులు ఉండాలని బి.ఆర్. అంబేద్కర్ ప్రభోదించిన సూత్రానికి భిన్నంగా ఆధునిక విజ్ఞాన సమాజంలో జరుగుతున్నాయి. ●

# వివాదాల సుడిగుండంలో టిజిపిఎస్సీ

భాస్కర్ యలకంటి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వెలువడిన తొలి గ్రూప్1 నోటిఫికేషన్‌ను ఆది నుంచి వివాదాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. లీకేజీ కారణంగా ఒకసారి, హాజరులో వచ్చిన వ్యత్యాసం కారణంగా మరోసారి ప్రిలిమ్స్ పరీక్షలు రద్దుకావడం, తిరిగి కొత్త నోటిఫికేషన్ వెలువడడం, ప్రిలిమ్స్3.0ను నిర్వహించడం, మెయిన్స్ పరీక్షలకు అర్హత జాబితా వెలువర్చడం, తదనుగుణంగామెయిన్స్ పరీక్షలు నిర్వహించబడడం చకచకా జరిగిపోయాయి. అయిననూ వివాదాలు మాత్రం ఇంకా టీజీపీఎస్సీని వెంటాడుతూనే ఉన్నాయి. మెయిన్స్‌పరీక్షల నిర్వహణ తీరుపై, వెలువడ్డ ఫలితాలపై పలు అనుమానాలను వ్యక్తపరుస్తూకొందరు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు.అటు అభ్యర్థుల తరఫున, ఇటు టీజీపీఎస్సీ తరఫున వాద,ప్రతి వాదనలను విన్న కోర్టు నియామక ప్రక్రియ మీద నిలుపుదల ఉత్తర్వులను విడుదల చేసింది. మరోపక్క అభ్యర్థులు టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరు మీద, అభ్యర్థులు లేవనెత్తిన పలు అనుమానాల మీద సరైన వివరణ ఇవ్వాలని కోరుతూ గత ఏప్రిల్ 30వ తేదీన టీజీపీఎస్సీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ రాయడంతో వివాదం మరింత ముదిరింది. ఆ లేఖలో ఏముంది? టీజీపీఎస్సీ సమాధానం ఏంటి? వివాదాలను అధిగమించేందుకు మధ్యేమార్గంగా పరిష్కార మార్గాలు ఏమైనా ఉన్నాయా? బండి సంజయ్ తన లేఖలో పలు అంశాలకు వివరణ కోరగా, మరికొన్ని అంశాల మీద కొన్ని ప్రశ్నలను సంధించారు. మెయిన్స్ పరీక్షలకుహాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్‌మెయిన్స్ హాల్ టికెట్ నంబర్లు, వయసు, కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కులు వంటి పూర్తి వివరాలు బహిరంగపరచడంతో పాటు పరీక్షా కేంద్రాల వారిగా అసమాన ఫలితాలు చోటు చేసుకోవడంపై సరైన వివరణను కోరారు. అట్లే జనరల్ ర్యాంకింగ్ లిస్టు కంటే ముందే ప్రొవిజినల్ ర్యాంకింగ్ లిస్టు అందించకపోవడానికి గల కారణం ఏంటని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు 15.2, 15.3 ఉల్లంఘనకు గలకారణాలు ఏంటని, అట్లే సుప్రీం కోర్టు ఆదేశానుసారం యూపీఎస్సీ తరహాలో మూల్యాంకన ప్రక్రియను మోడరేషన్ చేయకపోవడానికి గల కారణాలు ఏంటని, బయోమెట్రిక్ హాజరులో వ్యత్యాసం ఎందుకొచ్చిందని, ఫలితాల ప్రకటనకు ముందే డేటా లీక్ ఎలా జరిగిందని, మెయిన్స్ హాల్ టికెట్ల నంబర్లు కేంద్రాల కేటాయింపు యాదృచ్ఛికంగా జరిగినదా? లేదా దానిలో ఏమైనా మానవ ప్రమేయం దాగిఉన్నదా? అంటూ పలు ప్రశ్నలను సంధించారు. టీజీపీఎస్సీ వెంటనే స్పందించి అటు అభ్యర్థులకు ఇటు తెలంగాణ సమాజానికి సమాధానమిచ్చి తన పారదర్శకతను చాటుకోవాలని సూచించారు. కానీ ఇంతవరకు టీజీపీఎస్సీ నుండి ఎలాంటి సమాధానం రాలేదు. ఉద్యోగ



నియామక ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకపోవడంతో ఆ జీవోలు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఉన్నాయా? లేవా?అనే విషయాలు తెలియడంలేదని, అట్లే వాటి ప్రభావం నియామక ప్రక్రియలో ఏమేరకు ఉంటుందో అంచనా వేయలేకపోతున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదనే ఉద్దేశంతో కోర్టులను ఆశ్రయిస్తే ఆలస్యం కారణంగా పిటిషన్లను కొట్టివేశారని అభ్యర్థులు వాపోతున్నారు. మరోపక్క రాజ్యాంగపరమైన అంశాలపై ఆలస్యం అనే కారణంగా పిటిషన్లను కొట్టివేయరాదని అది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం ద్వారానైనా పూర్తి వివరాలను తెలుసుకోవాలని ఆరాటం చెందే వారికి అడుగడుగునా చుక్కెదురవుతున్నదని, ఆ చట్టం సామాన్యునికి అందనిద్రాక్షగానే మిగిలిపోయిందనే నిరాసక్తత బలంగా వినిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యమో లేక వారి ఉదాసీనతో తెలియదు గానీ సమాచారం మాత్రం సామాన్యునికి సకాలంలో అందడంలేదని ఒకపక్క ప్రజాస్వామికవాదులు మరోపక్క సమాచార హక్కుల కోసం నిత్యం నినదించే ప్రతినిధులు తమ వాణిని బలంగానే ప్రతిధ్వనింపజేస్తున్నారు. ఇలా వరుస వివాదాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీజీపీఎస్సీ కాలానుగుణంగా కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పటికీ ఏదో ఒక రూపంలో సరికొత్త వివాదాలు మాత్రం ఇంకా రాజుకుంటూనే ఉన్నాయి. నియామక ప్రక్రియలో భాగంగా టీజీపీఎస్సీ చేపట్టిన కొన్నివిధానాలు,వాటికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలు సరికొత్త వివాదాలకు జీవంపోశాయని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నది. వాటిని అధిగమించడం కోసం ఇటీవల టీజీపీఎస్సీ నల్సార్ యూనివర్సిటీతో కలిసి సంయుక్తంగా 'పబ్లిక్‌సర్వీస్ కమిషన్లకు ఎదురవుతున్న న్యాయవివాదాలు పరిష్కారం' అనే జాతీయ సదస్సును నిర్వహించింది.ఆసదస్సు ముగింపు సమావేశంలో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో వివాదాలు తలెత్తకుండా పారదర్శకత పెంచేలా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు పని చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాజ్యాంగ విలువలను కాపాడుతూ స్వతంత్రంగా సమగ్రతతో నియామకాలు చేపట్టాలని కూడా సూచించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సంధించిన పలుప్రశ్నలకు సహేతుకమైన సమాధానం ఇస్తూ ఎంపికైన అభ్యర్థుల పూర్తి వివరాలనుబహిర్గతం చేయడం ద్వారా అభ్యర్థులలో పారదర్శకతను పాదుగొల్పాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కనీసం జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్ మెయిన్స్ హాల్‌టికెట్ నంబర్లు, వయస్సు,కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కుల వివరాలు, అట్లే బయోమెట్రిక్ హాజరులో వచ్చిన వ్యత్యాసం మీద వివరణ ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' కాకుండా నియామక ప్రక్రియలో భాగంగా విడుదల చేసే జీవోలను ముందస్తుగానే పబ్లిక్ డొమైన్‌లో పెట్టి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే అభ్యర్థుల నుంచి నిర్దేశిత సమయంలో స్వీకరించి ఎలాంటి న్యాయవివాదాలకు తావులేకుండా నియామక ప్రక్రియలను సజావుగా ముందుకు తీసుకుపోవాలని అందరూ కోరుకుంటున్నారు. ఆ దిశగా టీజీపీఎస్సీ అడుగులు వేస్తుందని ఆశిద్దాం! ●

# ప్రజావాక్కు



## ప్రొవైడర్లకే అనుమతి ఇవ్వాలి

ఇటీవల కేదార్నాథ్ వద్ద జరిగిన హెలికాప్టర్ ప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రారంభమైన చార్‌ధామ్ యాత్రలో ఇప్పటివరకు ఇది ఐదవహెలికాప్టర్ ప్రమాదం కావడం మరింత ఆందోళనకరం. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆరుగురుమరణించడం దురదృష్టకరం.వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు మన వైమానిక రంగంలో లోపాలు, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా హెలికాప్టర్ సేవలను నిలిపివేసినప్పటికీ, దీన్ని శాశ్వత పరిష్కార దిశగా తీసుకెళ్లాలి.అధిక భక్తులు వచ్చే కాలాల్లో హెలికాప్టర్ సేవలను కేవలం నిబంధనలు పాటించే ప్రొ వైడర్లకే అనుమతించాలి. అంతేగాక, ప్రభుత్వం పర్యవే క్షణను మరింత బలపరచాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి

మన రైల్వేలు దేశ పౌరుల ఇంద్ర వాహనం కానీ తరచుగా ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడం వలన రైల్వే ప్రయాణంఅంటే భయభ్రాంతులను కలుగుచున్నవి. మొన్న ముంబైలో జరిగిన లోకల్‌రైళ్లప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం అత్యంత విషాదకరమైన సంఘటన. రెండు రైళ్ల ప్రయాణికుల సంచులు ఒకదానికి ఒకటి తగిలి ప్రయాణికులు క్రిందపడి దుర్మరణం చెందడం భారత రైల్వే చరిత్రలో మొదటిసారి కావచ్చు! గతంలో ప్రమాదాలు రైళ్లు పట్టాలు తప్పడం ఒకదానికి ఒకటి ఎదురెదురుగా, వెనుక నుండి వచ్చి ఢీకొనడం జరిగేవి. కానీ ఇటీవల జరిగిన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తొక్కిసలాట,రైల్వేశాఖ నిర్లక్ష్యం ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, అవగాహనరాహిత్యం వలన జరిగినవి.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## చెక్ డ్యామ్‌లు అవసరం

వర్షాకాలం ప్రారంభం కాబోతుంది. రాష్ట్రంలోని కొన్ని చెరువులలో30నుండి40శాతనీటిసామర్థ్యంతో ఉన్నాయి. ఆగస్టు వరకు కురిసే వర్షాలకు చెరువులు పూర్తిగా నిండి వృధాగా నీళ్లుబయటికిపోయే నీటికి లోతట్టు ప్రాంతాలలో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలి. వాగులు, కాలువలకు కూడా చెక్ డ్యాములు నిర్మించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

## యుద్ధం ఆగదు

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న హోరాహోరి క్షిపణుల దాడుల వల్ల రెండుదేశాలకు జననష్టం,ఆస్తినష్టం తప్ప గెలుపు అనేది ఎన్నటికీ ఎవరి పరం కాదు. ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో- పాక్‌ల మధ్య ఈమధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను తన చాక చక్యంతో సంధి మాటలు చెప్పి యుద్ధాన్ని నాలుగు రోజులలోనే ఆపివేశానని గొప్పలు చెప్పుకుంటున్న ట్రంప్ మహాశయుడు ఉక్రెయిన్ రష్యా మధ్య ఏడాది పైగా ఎడతెరిపి లేకుండా జరుగుతున్న యుద్ధాన్ని ఆపలేకపోయాడు. ఇజ్రాయిల్‌ను అదుపు చేయలేకపోయాడు.అణుయుద్ధానికి ఏ దేశం ఒడిగట్టినా దాని మూల్యం ప్రపంచ దేశాలన్నీ చెల్లించుకోవాలి. ఐక్యరాజ్య సమితిలోని సెక్యూరిటి కౌన్సిల్ ఏదేశాన్ని కంట్రోల్ చేయలేకపోతోంది.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

## పేదరికం తగ్గింది

భారత్‌లో పేదరికం భారీగా తగ్గి పోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు ఈ వార్త విన్నవారు. ఏప్రభుత్వ పథకానికి నోచుకోలేని వారు గంజి నీళ్ళకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వు బ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరికంలో మరోరకం జాతి ఉంది. వీరు చదువుకున్న వారు. ఉద్యోగం చేసి రిటైర్ అయిన వారు. వీరి ఫించను గత దశాబ్ద కాలంపైగా నెలకు కదలని మెదలని శిలలా వెయ్యి రూపాయలు మాత్రమే. వీరి వార్షిక ఆదాయం పన్నెండు వేల రూపాయలు మాత్రమే. అంటే దారిద్ర్య రేఖకు ఎన్నిమెట్లు దిగువున ఉన్నారో కదా!

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## జీవవైవిధ్య పరిరక్షణ

మానవునికి ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్ల వంటివి. ఆధునిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితో పుడమి వేడెక్కిపోవటంతో పాటు జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వన, జల, జీవరాశులున్న దేశాల్లో ఇండియ స్థానం 8వది. భారత్‌లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణ కోరకు ప్రజల్లో జీవ, పర్యావరణంపై అవగావనను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి.

-షేర్ మీరా, రాజమండ్రి

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



మంగుళూరులో కురిసిన భారీవర్షాలకు నేలకూలిన ఇళ్లు



ముంబయిలో కురుస్తున్న భారీవర్షాలకు జలమయమైన రోడ్లు

# ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో జనజీవనం అస్తవ్యస్తం

## నీటమునిగిన ముంబయి శివారు ప్రాంతాలు, మహారాష్ట్రలో 18 మంది మృతి

## దేశమంతా విస్తరించిన నైరుతి పవనాలు

### వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**ముంబయి, జూన్17:** మూడు వారాల పాట్లు స్తబ్దుగా ఉన్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తిరిగి వేగం పుంజుకున్నాయి. దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమతీర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబై నగరాన్ని వానలు ముంచెత్తగా, కేరళలోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్రాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు మధ్య, ఉత్తర అరేబియా సముద్రంతో పాటు గుజరాత్, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి.

కొంకణ్, మధ్య మహారాష్ట్ర, తెలంగాణలో మిగిలిన ప్రాంతాలను కూడా కప్పేశాయి. రుతుపవనాలు మహారాష్ట్ర మొత్తం వ్యాపించి, పొరుగు రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌లోకి కూడా ప్రవేశించినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రెండు, మూడు రోజుల్లో గుజరాత్, మహారాష్ట్రలోని మరిన్ని ప్రాంతాలు, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ విస్తరించనున్నాయని అంచనా వేస్తున్నారు. గుజరాత్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం నేడు అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, వాయవ్య బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణశాఖ తెలిపింది. ఈ అనుకూల పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న కొన్ని చోట్ల వర్షాలు కురిశాయని, రానున్న 24 గంటల్లో కూడా అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

రుతుపవనాల ప్రభావంతో మహారాష్ట్రలో, ముఖ్యంగా ఆర్థిక రాజధాని ముంబైలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్ల సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 18 మంది మరణించారని, 65 మంది గాయపడ్డారని మహారాష్ట్ర అధికారులు వెల్లడించారు. రాబోయే 24 గంటల్లో ముంబై, శివారు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. భారీ వర్షాలకు ముంబై, థానే, పాల్ఘర్ తదితర ప్రాంతాలకు 'ఆరెంజ్' అలర్ట్, రాయగఢ్‌కు 'రెడ్' అలర్ట్ జారీ చేశారు.

కేరళలోనూ భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల బస్సులు, రైళ్ల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. నదులు, జలాశయాల్లో నీటి మట్టాలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో కన్నూర్, కాసరగఢ్ సహా పలు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కన్నూర్‌లోని కక్కడ్ ప్రాంతంలో రహదారిపైకి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాసర్‌కోడ్ జిల్లాలోని వెల్లరికుండ్ ప్రాంతంలో కనీసం 10 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

# దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ తప్పనిసరి

## ఎన్నికల కమిషన్ నిర్ణయం




**న్యూఢిల్లీ, జూన్ 17:** ఓటింగ్ రోజు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇప్పటి వరకు సమస్యాత్మకమైనవిగా భావించే వాటితో సహా మొత్తంగా 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే దీనిని నిర్వహించేవారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన సమాచారాన్ని ఎన్నికల సంఘం అంతర్గత అవసరాలకు వినియోగించుకోనుంది. త్వరలో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలనుంచి 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్ణయం అమలుకానుంది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులకు ఇసి తెలియజేసింది. రాష్ట్ర స్థాయిలో, ప్రతి జిల్లాలో, అన్ని నియోజకవర్గాల స్థాయిలోనూ వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తుంది. ప్రతి స్థాయిలోనూ నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ కోసం ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకోనుంది. ఆ సదుపాయం లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వీడియో చిత్రీకరణ, ఫొటోలు తదితరాలపై ఆధారపడనుంది. మరింత నిశితంగా ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్‌కాస్టింగ్ ఉపయోగపడుతుందని భావిస్తు న్నారు. ఎన్నికల నిబంధనలకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణల ప్రకారం వెబ్‌కాస్టింగ్ దృశ్యాలు, సిసిటివిల్లో నమోదైన దృశ్యాలను చూసేందుకు ప్రజలను అనుమతించరు.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడి

## కీవ్‌లో అపార్ట్‌మెంట్లు ధ్వంసం, 14 మంది దుర్మరణం



**కీవ్, జూన్ 17:** ఒకవైపు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో మరోవైపు రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కీవ్‌పై మాస్కో భీకర క్షిపణి దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై జరిగిన దాడుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోగా.. 40 మందికిపైగా పౌరులు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. కీవ్ సైనిక పరిపాలన అధిపతి తైమూర్ ట్కాచెంకో మాట్లాడుతూ రష్యా దాడిలో కీవ్‌లోని డజన్లకొద్దీ అపార్ట్‌మెంట్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఇప్పటికే 14 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు.

భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని..దీంతో మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఘటనా స్థలాల్లో సహాయకచర్యలు కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. ఈ దాడిలో ఒక అమెరికా పౌరుడు కూడా మరణించినట్లు వెల్లడించారు. రష్యా ప్రయోగించిన పలు డ్రోన్లను ఉక్రెయిన్ వైమానిక రక్షణ దళాలు కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. అయితే డ్రోన్లశిథిలాలు పడడంతో కీవ్‌లోని పలు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయన్నారు. కాగా కెనడాలో జరుగుతున్న 'జి-7సదస్సు'కు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హాజరవ్వనున్నారు.

కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ రష్యా వరుసగా ఉక్రెయిన్‌పై అతిపెద్ద వైమానిక దాడులకు పాల్పడుతోంది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో 80 నివాస భవనాలుసైతం ధ్వంసమయ్యాయి. ఇరాన్ రూపొం దించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించినట్లు అధికారులు పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడానికి రష్యాపై ఒత్తిడి పెంచాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, పశ్చిమ దేశాలను కోరారు.



# నిలకడగానే సోనియా ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జూన్ 17:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని గంగారామ్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. మంగళవారం సోనియా ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి ఛైర్మన్ అజయ్ స్వరూప్ మాట్లాడారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఉదర సంబంధిత సమస్యనుంచి ఆమె పూర్తిగా కోలుకుంటున్నారని తెలిపారు. ఆమె డైట్‌ను పూర్తిగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోనియాగాంధీ డిశ్చార్జి తేదీని ఇంకా నిర్ణయించలేదన్నారు. డాక్టర్ ఎస్ నండే, డాక్టర్ అమితాబ్ యాదవ్ సోనియా ఆరోగ్య పరిస్థితితోపాటు డైట్‌ను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ నెల 9న మెడికల్ చెకప్ నిమిత్తం సోనియాగాంధీ ఆస్పత్రికి వెళ్లిన విషయం తెలిసిందే.

# భాషల ఆధారంగా విడదీయొద్దు

## దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం అమలు చేయాలి: ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రపంచంలోనే అత్యంత ఉత్కృష్టమైన భారతదేశాన్ని భాషల ఆధారంగా విడదీయడాన్ని భరించలేమని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ అన్నారు. దేశ భవిష్యత్తు, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ భయంకరమైన 'తుఫాన్'ను అధిగమించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం 2020ని అమలు చేయాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇది విద్యారంగంలో ఓ 'గేమ్ ఛేంజర్' అవుతుందని, దేశాభివృద్ధిని మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎందుకు ఇతర భాషలంటే వ్యతిరేకత?**

పుదుచ్చేరి విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఎవరి పేరు ప్రస్తావించకుండా పరోక్షవిమర్శలుచేశారు. దేశంలోని కొంత మందికి ఇతర భాషలు అంటే వ్యతిరేకత ఉందని విచారం వ్యక్తం చేశారు. 'గత దశాబ్దకాలంలో జరిగిన అసాధారణ అభివృద్ధి ఫలితంగా భారత్ ప్రపంచంలోనే అత్యంత ఆకాంక్షాత్మక దేశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశాన్ని భాష పేరిట ఎలా విభజించగలుగుతాం?' అని ఆయన ప్రశ్నించారు.

**ఇండియా గ్రేట్**

ప్రపంచంలో ఏదేశంలోకూడా భారత్‌లో ఉన్నన్ని భాషలులేవు. సంస్కృతానికి ప్రపంచ ప్రాముఖ్యత ఉంది. మన దేశంలో పాలీ, ప్రాకృతం, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, బెంగాలీ, అస్సామీ అనే 11 శాస్త్రీయ భాషలు ఉన్నాయి. 'పార్లమెంట్‌లో సభ్యులు 22భాషల్లో ప్రసంగించడానికి అనుమతిస్తారు. మన భాషలు దేశ సమగ్రతను సూచిస్తాయి. సనాతన ధర్మం ఒకే ఉన్నత లక్ష్యం కోసం కలిసి పనిచేయడానికి బోధిస్తుంది' అని జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. 'మన దేశ గమ్యస్థానాన్ని చూడండి. భవిష్యత్‌ను పరిగణనలోకి తీసుకోండి. భాషల పేరిట దేశాన్ని విడదీయాలనే వాదనను అధిగమించండి' అని ఆయన కోరారు.

**గేమ్ ఛేంజర్**

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని, ఇది ఒక గేమ్ ఛేంజర్ అవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. 'జాతీయ విద్యావిధానం ప్రపంచంలోనే అత్యుత్తమ విధానం. ఇది విద్యార్థులు తమ ప్రతిభను, సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ఒకటి కంటే ఎక్కువ కోర్సులు నేర్చుకోవడానికి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది' అని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు భాషల విషయంలో రాజకీయ ఘర్షణలు అవసరం లేకుండా విధానాన్ని రూపొందించారు. ఇందులో ఎలాంటి గందరగోళం లేదని అందరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం..

## డిఎన్ఎ పరీక్షల ద్వారా 125 మృతదేహాల గుర్తింపు!

**అహ్మదాబాద్, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డిఎన్ఎ పరీక్ష ద్వారా ఇప్పటి వరకు 125 మంది బాధితుల వివరాలను గుర్తించినట్లు ఆసుపత్రి అధికారులు తాజాగా వెల్లడించారు. అందులో 83 మృతదేహాలను వారి కుటుంబసభ్యలకు అప్పగించారు. మిగతా మృతదేహాల అప్పగింత ప్రక్రియ కొనసాగుతోంది. మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డిఎన్ఎ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. 72 గంటల్లో పూర్తవుతుందని చెప్పిన డిఎన్ఎ పరీక్ష 84 గంటలైనా పూర్తి కాకపోవడంతో మృతుల బంధువుల సిటీ సివిల్ దవాఖాన వద్ద పడిగాపులు పడాల్సి వస్తున్నది. అయితే ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డిఎన్ఎ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.

గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


# పట్టాలెక్కనున్న 200 కొత్త రైళ్లు

## రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్

**న్యూఢిల్లీ, జూన్ 17:** రైలు ప్రయాణికులకు శుభవార్త! కొత్తగా 200 రైళ్లను పట్టాలెక్కించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. 'ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్తగా 50 నమో భారత్ రైళ్లు, 100 మెమూ రైళ్లు, 50 అమృత్ భారత్ రైళ్లు' అంటూ రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ రైళ్ల విడియోను ఆయన షేర్ చేశారు. అయితే, ఈ రైళ్లు ఎప్పుడు పట్టాలెక్కబోతున్నాయి? ఏయే స్టేషన్లు / డివిజన్లలో అందుబాటులోకి వస్తాయనే వివరాలను మాత్రం పేర్కొనలేదు. మరోవైపు, హర్యానాలోని మనేసర్‌లో దేశంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సేవల్ని అప్‌గ్రేడ్ చేసేందుకు ఇటీవల ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం ఉన్న మెమూ రైళ్లను 8-12 కోచ్‌ల నుంచి 16-20 కోచ్‌లకు పెంచుతున్నామన్నారు. తద్వారా తక్కువ దూరం ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 100కి పైగా మెమూ రైళ్ల తయారీ కోసం కాజీపేటలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, కొత్తగా 50 నమో భారత్ రైళ్లను తయారు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులతోపాటు సరకు రవాణాలో రైల్వే శాఖ కృషిని ప్రశంసించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేలు దాదాపు 720 కోట్ల మంది ప్రయాణికులను, 1,617 మిలియన్ టన్నుల సరకును రవాణా చేసినట్లు తెలిపారు.

# 9 ఎయిరిండియా విమానాలు రద్దు



## సాంకేతిక లోపాలే కారణం

## సమీక్షించిన డిజిసిఎ

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమాన యాన సంస్థపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) చర్యలకు ఉపక్రమించింది. వరుసగా విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడడం, అవి రద్దు కావడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో మంగళవారం ఎయిర్ ఇండియాతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించింది. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దృష్ట్యా డిజిసిఎ కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని ఎయిర్ ఇండియాకు రెండువారాల గడువు విధిస్తూ డిజిసిఎ ఆదేశాలు కూడా ఇచ్చింది. అయితే.. ఈలోపే వరుసగా సాంకేతిక లోపాలతో ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో డిజిసిఎ అప్రమత్తమైంది. గత 48 గంటల్లో 9 ఘటనలు చోటుచేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే మంగళవారం ఎయిరిండియా ప్రతినిధులతో వర్చువల్ సమావేశం నిర్వహించింది. బోయింగ్ విమానాల్లో సాంకేతిక సమస్యలపై ప్రశ్నలు సంధిస్తూ ఎయిరిండియా ఇంజినీరింగ్ చీఫ్‌కు డిజిసిఎ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం ఒకేరోజు ఎయిర్ ఇండియాకు చెందిన మూడు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. శాన్‌ఫ్రాన్సిస్కో-ముంబై, అహ్మదాబాద్-లండన్ సర్వీసు రద్దు కాగా తాజాగా ఢిల్లీ-ప్యారిస్ సర్వీసు కూడా రద్దు అయినట్లు తెలుస్తోంది.

**ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం**

అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే మరో ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానసర్వీసును రద్దు చేశారు. మధ్యాహ్నం 1.10 గంటలకు ఎఐ 159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం లండన్‌కు బయల్దేరాల్సి ఉంది. ఎయిర్‌పోర్టు వచ్చాకే విమానం రద్దు విషయం తెలిసిందని ఓ ప్రయాణికుడు తెలిపాడు. విమాన రద్దుకు కారణంలేదా ఛార్జీల వాపసు వివరాలను సిబ్బంది చెప్పడం లేదని అంటున్నాడు.

**సాంకేతిక సమస్యతో ప్రయాణికుల దించివేత**

ఎయిర్ ఇండియా విమానం (ఎఐ180) శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబయికి వెళ్తోంది. మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ఈ క్రమంలో విమానంలోని ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని సిబ్బంది వెంటనే గుర్తించి అప్రమత్తమయ్యారు. భద్రతా కారణాల రీత్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అలాగే తాజాగా ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలోనూ సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని ఎయిర్‌లైన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ 143 రద్దు చేసినట్లు తెలిపింది. ముందస్తు విమాన తనిఖీల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొంది. ఫలితంగా బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిర్ ఇండియా ఎఐ 142ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. హోటల్ వసతి సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపింది. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు.

# జి-7లో 'మెలోనీ వైఖరి'పై ఆసక్తికర చర్చ

## ప్రధాని మోడీ రాకముందే వెనుదిరిగిన ట్రంప్

**ఒట్టావో, జూన్ 17:** కెనడాలో జి-7 సదస్సు జరుగుతున్న విషయంతెలిసిందే. ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మధ్య చోటుచేసుకున్న ఆసక్తికర సంఘటనకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో 51వ జి-7 శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి భారత ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా వివిధ దేశాల ప్రధానమంత్రులు హాజరయ్యారు. అయితే ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ప్రవర్తించిన తీరు ప్రస్తుతం నెట్టింట చర్చకు దారి తీసింది. సభలో వివిధ అంశాలపై డొనాల్డ్ ట్రంప్ తదితరులు చర్చిస్తున్న సమయంలో జార్జియా మెలోనీ విచిత్రంగా ప్రవర్తించారు. పక్కనే కూర్చున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్.. జార్జియా మెలోని చెవిలో ఏదో చెప్పసాగాడు. దీంతో ఆమె తల దగ్గరగా పెట్టి మరీ ఆసక్తిగా మొత్తం విన్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలోనే ఇదంతా జరిగింది. ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాటలను శ్రద్ధగా విన్న జార్జియా మెలోనీ. చివరగా బొటనవేలు పైకి చూపడంతోపాటు కళ్లను ఆర్పుతూ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో అంతా వీరి సంభాషణపై వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు. నెటిజన్లు వారి సంభాషణపై తమకు తోచిన విధంగా ఫన్నీ ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు.

గతంలో అల్బేనియా రాజధాని టిరానాలో జరిగిన యూరోపియన్ పొలిటికల్ కమ్యూనిటీ సమ్మిట్‌కు మెలోనీ హాజరైనసందర్భంలో అల్బేనియన్ ప్రధానమంత్రి ఎడి రామా మోకాళ్లపై నిలబడి మెలోనీకి స్వాగతం పలికిన విడియో తెగ వైరల్ అయింది. అలాగే అమెరికా టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో జార్జియా మెలోని దిగిన ఫొటోలు కూడా తెగ వైరల్ అయ్యాయి. ఇదిలా ఉండగా అల్బెర్టాలో సోమవారం రాత్రి జరిగిన 51వ జి-7 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన విషయం తెలిసిందే. అయితే ట్రంప్ సదస్సు నుంచి అకస్మాత్తుగా నిష్క్రమించారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగానే ఇలా త్వరగా వెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు పదేళ్ల తర్వాత భారత ప్రధాని నరేంద్రమోడీ కెనడాలో అడుగుపెట్టారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు మోడీ ఈ సదస్సుకు హాజరయ్యారు. అయితే ప్రధాని మోడీ కెనడాలో అడుగుపెట్టడానికి ముందే .. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ సదస్సు నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.


# కర్ణాటక డిప్యూటీ సిఎం సోదరుడు డికె సురేష్‌కు ఇడి సమన్లు

**బెంగళూరు, జూన్ 17:** మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాంగ్రెస్ నేత, కర్ణాటక ఉపముఖ్యమంత్రి శివకుమార్ సోదరుడు డికె సురేశ్‌కు సమన్లు జారీ చేసినట్లు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. మాజీ ఎంపి సురేశ్‌ను ఈ నెల 19న విచారణకు హాజరుకావాలని.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద వాంగ్మూలం నమోదు చేయాలని కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్‌లో ఐశ్వర్యగౌడ అనే మహిళను ఇడి అరెస్టుచేసింది. ఆ మహిళ అనేకమంది హైప్రొఫైల్ రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉందని చెప్పుకుందని ఇడి ఓ ప్రకటనలో పేర్కొంది. బంగారం, నగదు, బ్యాంకు డిపాజిట్లపై అధిక మొత్తంలో రాబడిని ఎరవేసి మోసి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డికె సురేశ్ పేరును ఉపయోగించుకుందని.. అతని సోదరి అని చెప్పుకున్నట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. మాజీ ఎంపి సైతం బెంగళూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.

# పనితీరు ఆధారంగా పోస్టింగులు, బదలీలు

- కూటమి ప్రభుత్వ మొదటి యేడాదిలో ప్రభుత్వ వైద్య రంగంలో మార్పుకు శ్రీకారం
- ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించిన వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించే దిశగా సానుకూల వాతావరణాన్ని కల్పించి మంచి ఫలితాల్ని సాధించే దిశగా మొదటి అడుగు వేశామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగంలో భాగస్వాములైన అందరూ జవాబుదారీతనం, క్రమశిక్షణలతో వ్యవహరించడం అన్ని స్థాయిల్లో వైద్యులు, అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ ఫలితాల్ని మదింపు చేయడం జరిగిందన్నారు. బాగా పనిచేసిన వారిని ప్రోత్సహించడం,అక్రమాలు, రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడం వంటి అంశాల ఆధారంగా వైద్య సేవల్ని మెరుగుపర్చడానికి గత ఏడాది కాలంగా కృషి చేసినట్లు మంత్రి వివరించారు. ఈ మేరకు మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు, ఫలితాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి 5 పేజీల వివరణాత్మక నివేదికను సమర్పించారు. గతేడాది జూన్ 16న పదవీ స్వీకారం చేసిన మంత్రి ఈనెల 16న ముఖ్యమంత్రికి తన నివేదికను పంపారు. క్రమశిక్షణ, జవాబుదారీతనం గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనా వైఖరితో వైద్య సిబ్బందిలో గైరు హాజరీ, జవాబుదారీతనం లేకపోవడం, వివిధ స్థాయిల్లో పనితీరు మరియు ఫలితాలపై పర్యవేక్షణ లోపించడం కారణంగా వైద్య సేవల నాణ్యత దెబ్బతిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వారసత్వంగా సంక్రమించిన ఈ సమస్యల్ని అధిగమించడానికి నిర్దిష్ట ప్రణాళికలతో కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా చేసిన కృషి సత్ఫలితాల్ని ఇస్తోందని మంత్రి తన నివేదికలో ముఖ్యమంత్రికి వివరించారు. వైద్య సిబ్బంది హాజరు, ఓపీ మరియు ఐపీ సేవల్లో కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ఇతోధికంగా పెరుగుదలను సాధించామని, ఇది ప్రజారోగ్య రంగంలో వచ్చిన మార్పునకు నిదర్శనమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. తత్ఫలితంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సర్వేల్లో ప్రభుత్వ వైద్య సేవల పట్ల సానుకూలత బాగా పెరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రశ్నించడం ద్వారా మెరుగైన పాలనా ప్రక్రియసమగ్ర సమాచారంతో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో కూడిన నిర్ణయాలు ఏ రంగంలోనైనా సత్ఫలితాల్ని సాధించడానికి ప్రధానమని మంత్రి అన్నారు.



## యోగాంధ్రను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- యోగా నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు
- ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలి
జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

**విజయనగరం, జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** యోగా జీవన విధానంలో భాగం కావాలనే ఉద్దేశ్యంతో ప్రధాని మోడీ యోగా కార్యక్రమానికి అత్యంత ప్రధాన్యతనిస్తున్నారని, ఒకే రోజు ఒకే చోట 5 లక్షల మందితో విశాఖపట్నంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంచార్జ్ మంత్రి రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, రహదారులు భవనాల శాఖామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డిలతో కలసి ఈ నెల 21న నిర్వహించే యోగా కార్యక్రమంపై మూడు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులతో, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు రాష్ట్రం లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీక్ష బూనారని, ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. నెల రోజుల నుండి యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలందరినీ సన్నద్ధం చేయడం జరుగుతోందని తెలిపారు. విశాఖపట్నంలో ఒకే రోజున ఒకే వేదిక నుండి 5 లక్షల మంది యోగ చేయడం ద్వారా దేశమంతా వైజాగ్ వైపు చూస్తుందని, అంతే కాకుండా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదిస్తామని పేర్కొన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలనీ కోరారు. యోగా కార్యక్రమానికి వచ్చే వారికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను వేసి రహదారి మార్గంలో అత్యవసరాల కోసం వాష్ రూమ్స్‌ను గుర్తించడం జరిగిందని, వాటిని బస్సులతో మ్యాప్ చేయడం జరిగిందని, అలాగే మెడికల్ ఎమర్జెన్సీ కోసం కూడా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఉదయాన్నే బస్సులు బయలుదేరతాయి కావున ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు మూడు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గం వారీగా , సచివాలయం వారీగా నమోదు చేసుకున్న జాబితాలను సంబంధిత శాసన సభ్యులకు ఇవ్వాలని, వారు వారి కార్యకర్తల ద్వారా జన సమీకరణ లో భాగస్వామ్యులవుతారని తెలిపారు . సురక్షితంగా గమ్యాలను చేరే వరకు ఇంచార్జ్ లు బాధ్యత తీసుకోవాలని, అలాగే ట్రాఫిక్ నియంత్రణకు జాతీయ రహదారిపై హెవీ వాహనాలను తిరగకుండా నిరోధించాలని సూచించారు. యోగా వేదిక వద్ద కంపార్ట్మెంట్లను కేటాయించడం జరుగుతుందని, ఎవరికీ ఏ కంపార్ట్మెంట్ కేటాయించారో, ఆ నెంబర్ వారు వెళ్ళే బస్సు పైన రాయడం జరుగుతుందని , దాని ప్రకారంగా ఎటువంటి ఆందోళన పడకుండా ఇంచార్జ్‌లు జాగ్రత్తగా తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా నుండి 36 వేల మందిని సిద్ధం చేసుకున్నామని, కనీసం 30 వేల మందిని పంపడానికి 2 రూట్లలో 660 బస్సు లను సిద్ధం చేసామని, ప్రతి బస్సు కు ఒక లైజెన్ అధికారిని నియమించామని, సచివాలయం వారీగా బస్సులను, టాయిలెట్లను మాప్ చేయడం జరిగిందని తెలిపారు. 15 వేల మంది విద్యార్థులను వేయడం జరిగిందన్నారు.

## జూలై 11న కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు ఎన్నికలు

**గుంతకల్లు రైల్వే, జూన్ 17,ప్రభాతవార్త :** రాయలసీమ జిల్లాలలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలి ఎన్నికలు జూలై 11న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాలవ్యవధి పూర్తయిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకమండలిలకు జూలై 1 నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఉన్న పాకాల రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 1న, రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 4న,నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 7న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసిన ఎన్నికల యంత్రాంగం తాజాగా జూలై 11న కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది.

## మాదక ద్రవ్యాల మహమ్మారిపై మూకుమ్మడి దాడి: కలెక్టర్ లక్ష్మీశ


- అన్ని విద్యాసంస్థల్లోనూ ఈగల్ క్లబ్స్ ఉండాల్సిందే
- క్యాంపస్ అంబాసిడర్లనూ నియమించాలి

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త** ప్రతినిధి:సుసంపన్న,ఆరోగ్య ఆనంద ఆంధ్ర సాకారం దిశగా అడుగులేస్తూ మూకుమ్మడి దాడితో మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేయిచేయీ కలుపుదామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం,నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ,దుష్ప్రభావాలు,అవగాహనా కార్యక్రమాల నిర్వహణ,కౌన్సిలింగ్ సేవలు తదితరాలపై సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు,కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఇందుకు ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని ఆదేశించారు. వీటి సభ్యులకు వర్క్‌షాప్స్ నిర్వహించి డ్రగ్స్ అంటే ఏమిటి?డ్రగ్స్ ఉపయోగిస్తున్న వారిని గుర్తించడం ఎలా?సున్నితంగా సమస్యను ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలు వ్యక్తుల జీవితాలను,కుటుంబాలను ఎలా నాశనం చేస్తాయనే విషయాలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. అదే విధంగా పోస్టల్,కొరియర్ సంస్థల సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జనజాగృతికి అవసరమైన లఘు చిత్రాలు,కరపత్రాలు వంటి వాటిని రూపొందించాలని ఆదేశించారు. యోగాంధ్ర మాసోత్సవాలు ముగిసిన అనంతరం నెల రోజుల పాటు విస్తృత స్థాయిలో మాదక ద్రవ్యాలపై పోరాటానికి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయ శాఖలు,ఎన్‌జీఓలు,డీఎల్ఎస్ఏ నిపుణులు తదితరుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ర్యాలీలు,వాకథాన్‌లు, సదస్సులు వంటి వాటిని నిర వ్వహించనున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్,ఈగల్ బృందాలు తీసుకుంటున్న చర్యలను డీసీపీ కెజీవి సరిత వివరించారు. యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్,టాస్క్‌ఫోర్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను తెలియచేశారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డిపిఎస్)చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని,ఈ ఏడాది జనవరి నుంచి 73 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు.

## ఘనంగా శ్రీచైతన్య ఐరావత్ ఛాంపియన్స్ వేడుక

విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు, నటుడు అడివి శేష్

శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు




**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటి-జెఇఇ(మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్), నీట్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తన అగ్రస్థానాన్ని నిరూపించుకుని, ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచిన సందర్భంగా "ఐరావత్ చాంపియన్స్ వేడుక" ను ఘనంగా నిర్వహించింది. హైటెక్ సిటీ శిల్ప కళావేదికలో అంగరంగ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య టాపర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఈ స్ఫూర్తిదాయక వేడుకలో పాల్గొన్నారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమంగా, సాధకులను సత్కరించే వేదికగా "ఐరావత్" నిలిచింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు, సినీ నటుడు అడివి శేష్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా శ్రీచైతన్య డైరెక్టర్లు శ్రీధర్ యలమంచిలి, సుష్మా బొప్పన, సీమ బొప్పన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక సన్మానాలు చేశారు. శాస్త్రీయ శిక్షణతో, అత్యాధునిక మౌలిక వసతులతో ముందంజలో ఉన్న శ్రీచైతన్య విజయం వెనుక ఉన్న కలలు, కృషిని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది. గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ "చదరంగం మాదిరిగానే, జెఇఇ అండ్ నీట్ వంటి పోటీ పరీక్షల విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరం. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఈ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రేరణనిచ్చే అవకాశాన్ని నేను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. సినీ నటుడు అడివి శేష్ మాట్లాడుతూ.. "202565 జెఇఇ అండ్ నీట్ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన ప్రతి శ్రీచైతన్య విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. ఈ విజయాల వెనుక ఉన్న ప్రణాళిక, అంకితభావం అభినందనీయం. ఇంజనీరింగ్, మెడికల్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రతిభావంతులను అందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఓ మార్గదర్శక శక్తిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ.. భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ దొమ్మరాజును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు పాఠశాల విద్యార్థుల నుండి జెఇఇ, నీట్ అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయి. శ్రీచైతన్యలో, మేము విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు మేము అంకితభావంతో ఉన్నాము. గుకేష్ సామర్థ్యాలు, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయి.

శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమా బొప్పన మాట్లాడుతూ.. "గుకేష్ దొమ్మరాజు శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించటం గర్వకారణం. గుకేష్ ప్రేరణతో విద్యార్థులు మరింత దృఢంగా ముందుకు సాగుతారని మేము నమ్ముతున్నాం" అని తెలిపారు.

## సమకాలీన సమాజంలో ప్రజల పక్షం 'అల్లిక కవితా సంపుటి' : వక్తలు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన కవిత్వం సమస్యలపై కేవలం స్పందనకే పరిమితం కాకూడదని. స్థిరమైన,సంఘటితమైన ఆలోచనా విధానంతో జాగృతం కలిగించేదిగా ఉండాలని పలువురు వక్తలు అన్నారు. ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు, కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి రచించిన పుస్తక పరిచయసభ జరిగింది.. ఇటీవలే అల్లిక పుస్తకావిష్కరణను ప్రముఖ కవి శిఖామణి చేసారు.అల్లికను పాఠకులకు వివరించేందుకు ప్రత్యేకంగా పరిచయ సభను నిర్వహించారు.ఈ సభలో వక్తలు మాట్లాడుతూ, వర్తమాన వ్యవస్థలో , ప్రస్తుత పరిస్థితులపై, అవసరమైనటువంటి కవిత్వం అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లిక కవిత్వ సంపుటిలో మొదటి కవిత నుంచి చివరి కవిత వరకు చదివేకొందిగా చదవాలనిపించే కవిత్వంఅని , కవిత్వం లో మంకెన పువ్వు నుంచి అల్లిక వరకు స్వరుపరాణి అక్షరాల ప్రవాహం తెలుగు సాహిత్యంలో ప్రత్యేక మైందని వక్తలు విశ్లేషించారు.సంఘటన , సమయానుకులన , చారిత్రక,వాస్తవ, ఫిలాసఫీ, తత్వశాస్త్రం వున్న కవిత్వం ఈ అల్లిక గా అభివర్ణించారు. . ఇది స్వరూప రాణి పై ఉన్న ,అపారమైన ప్రేమ, అక్షరంపై ఉన్ననమ్మకంతో , ఒక కమిట్మెంట్ పర్సన్ రాసిన కవిత్వం కాబట్టి , జనాలు కదలకుండా, వచ్చినవారు వెళ్లకుండా, సభలో ఉండి సభను విజయవంతం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి చాలామంది వచ్చి ఈ సభలో ఉన్నారు అందరూ కూడా అల్లిక తో అల్లుకునిపోయారు అనేక ఆలోచనల రగిలించుకొని వెళ్లారు. కవులు , రచయితలు , మేధావులు ,పాఠకులు, జర్నలిస్టులు, ఉద్యమకారులు, ఇంకా అనేకమంది స్వరూపారాణి అక్షరాలను చదివి, వచ్చిన వారు ఎందరో ఉన్నారు. అందరితో చల్లపల్లి స్వరూప రాణి వుండే , మంచితనం ,కలివిడితనంతోనే ఎంతమంది అల్లిక సభలో కూర్చొని ఉన్నారు. చాంటింగ్ బై బుద్ధిస్ట్ మాంక్స్ తో సభ ప్రారంభమైంది. . సిక్కోలు బుక్ ట్రస్ట్ దుప్పల రవికుమార్ బరవే అధ్యక్షత వహించిన సభలో జి .లక్ష్మీనరసయ్య, షేక్ కరీముల్లా , గూడూరి సీతామాలక్ష్మి ,తంగిరాల సోనీ, పేరూరు మురళి కుమార్, నూకతోటి రవికుమార్, మల్లవర ప్రభాకర్ రావు, పెద్దిరాజు కోలాటి, నేలపురి రత్నాజీ , కూరాటీ భీమాకర్ స్పందనగా చల్లపల్లి స్వరూపారాణి మాటలు, ఎంతో ప్రేమతో కూడినవి. సభ ముగింపు వాక్యాలు చేసారు.

## లిక్కర్ స్కాం.. కానిస్టేబుల్ మదన్‌రెడ్డి ఆరోపణలపై సిట్ స్పష్టత

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు వేధిస్తున్నారంటూ గన్‌మెన్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి డీజీపీకి లేఖ రాసారు.తీవ్ర సంచలనం సృష్టించిన ఈ లేఖపై . సిట్ స్పందించింది. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ సిట్ అధికారులు మీడియాకు ప్రకటనను విడుదల చేశారు. చెవిరెడ్డి దగ్గర గన్‌మెన్ గా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి పని చేశారని తెలిపారు. లిక్కర్ కేసులో తాము చెప్పినట్టు రాసి సంతకం చేయమని సిట్‌అధికారులు ఒత్తిడి చేశారని మదన్ రెడ్డి చెప్పడంలో నిజం లేదని స్పష్టం చేశారు. చెవిరెడ్డికి కేసుతో సంబంధం ఉందని చెప్పమన్నారని, తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వమని బలవంతం చేశారనేది కూడా వాస్తవం కాదని సిట్ అధికారులు తేల్చిచెప్పారు. మద్యం కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. దర్యాప్తులో కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు తేలిందన్నారు. కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు తేలిందన్నారు. ఈ నగదును ఎన్నికల సమయంలో ప్రజలకు పంచినట్లు తెలిసిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి పర్సనల్ గన్ మెన్‌గా చేసిన మదన్ రెడ్డిని విచారణకు పిలిచామన్నారు.

## విధాన స్పష్టత వచ్చేవరకు బదలీలు నిలిపివేయాలి

రాష్ట్ర డైరెక్ట్ రిక్రూటెడ్ విఆర్ఓ అసోసియేషన్

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రస్తుతం రేషనలైజేషన్ ద్వారా జరుగుతున్న బదిలీ ప్రక్రియపై తమకెలాంటి అభ్యంతరాలు లేవని, కానీ విఆర్ఓల విషయంలో అస్పష్టంగా, గందరగోళంగా వున్న పరిస్థితులవల్ల బదిలీ ప్రక్రియలను నిలిపేసి, రూల్స్ పై స్పష్టత వచ్చిన తరువాత చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూటెడ్ విఆర్వోస్ అసోసియేషన్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ కి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జీఎస్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్‌లో రెవెన్యూ శాఖకు చెందిన విఆర్వో గ్రేడ్1లను కొనసాగిస్తూ డ్యు ప్రొసీజర్ ఆఫ్ లాకు వ్యతిరేకంగా విధానాలు పాటిస్తూ మాకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు విన్నవించామని ఆయన వెంటనే స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఈ అంశంపై ప్రభుత్వం నుండి సమాచారం రాలేదన్నారు ఇపుడు జీఎస్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ అధికారులు గ్రామవార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ జరుపుతున్నట్లు జీఓ 4, 5 లు ఇచ్చారని, ఎటువంటి స్పష్టత లేకుండా ఇచ్చిన ఈ జీవోలలో తమకెంతో అన్యాయం జరుగుతుందన్నారు.

## ఉద్యోగ సంఘాలు సామాజిక బాధ్యత వహించాలి

- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా



ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనాను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగాలు సంఘాలు కేవలం యూనియన్ సంబంధిత అంశాలకే పరిమితం కాకుండా సామాజిక అభివృద్ధిలో కూడా తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా అన్నారు. సంఘాలు నైతిక నాయకత్వం, పారదర్శకత, ప్రజాసేవ విలువలపై దృష్టి సారిస్తూ, తమ సభ్యుల హితాన్ని కాపాడేలా వ్యవహరించాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో మీనా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం తరఫున మీనాకు సత్కారం నిర్వహించి, శాఖాభివృద్ధికి ఆయన అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.విజయవాడలో జరిగిన ఎన్నికల ద్వారా డాక్టర్ ఆర్.ఎస్. కుమారేశ్వరన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## యూపిఎస్ పెన్షన్ పథకంపై గుత్తిలో సెమినార్

**గుంతకల్లు రైల్వే, జూన్ 17,ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న యూపిఎస్ పెన్షన్ పథకంపై కార్మికుల్లో అవగాహన కల్పించేందుకు గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ప్రత్యేక సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలులో ఉన్న నేషనల్ పెన్షన్ పథకం(ఎన్‌పిఎస్) పట్ల కార్మికుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం మార్పులు చేర్పులతో గత ఏడాది ఆగస్టులో ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపిఎస్) ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేయాలనుకునే ఔత్సాహిక కార్మికులకు అవగాహన కల్పించేందుకు డిపిఓ కో-ఆర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏపిఓ శైలజా సుధాకర్‌లు గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం నిర్వహించే సదస్సులో కార్మికులు పాల్గొని తమ తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా యూపిఎస్ పథకంలో చేరాలనుకునే రైల్వే సిబ్బంది తమ ఆప్షన్స్ ఫారాలను ఈ నెల 30వతేదీలోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందచేయాల్సి ఉంటుంది.

## తిరుపతిలో పాతచాళుక్యలాడ్జి దక్కించుకునేందుకు కూటమి నేతల పథకం? - నేడు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

**తిరుపతి,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ యాత్రాస్థలం, స్మార్ట్‌సిటీ తిరుపతినగరంలో నగరపాలకసంస్థకు ఆదాయవనరుగా ఉన్న 924 అంకణాలు 138కోట్లు రూపాయలు విలువైన స్థలం. ఈ స్థలాన్ని తక్కువ ధరకు తమవారికి అప్పనంగా కట్టబెట్టేందుకు కూటమిపెద్దలు వ్యూహాత్మకంగా కథనడిపించారనేది తిరుపతిలో సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతజిల్లాలో...ఆయనకు బాగా పరిచయం,గుర్తుఉన్న వందలకోట్ల రూపాయలు ఈ ఖరీదైన స్థలాన్ని కేవలం 5.54కోట్ల రూపాయలకే తక్కువ ధరకు పాతచాళుక్య భవనాన్ని కూటమినేతలు తమవారికి కట్టబెట్టేందుకు పావులు కదిపేశారు. ఈ స్థలం తిరుపతిలో అటు ఆర్టీసి బస్టాండుకు,

ఇటు రైల్వేస్టేషన్‌కు మధ్యప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్ స్థలం. బుధవారం ఉదయం జరిగే నగరపాలక కౌన్సిల్ సమావేశంలో దీన్ని విక్రయించేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారనేది తిరుపతివాసుల్లో చర్చ మొదలైంది. ఈ స్థలాన్ని తక్కువ ధరకు మార్కెట్‌విలువ కంటే తక్కువకు తమవారికి కూటమి పార్టీల నేతలు ఎవరి హవాచేసి ఫైల్‌కు ముగింపుపలుకుతారనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.

## వైఎస్సార్సీ ఎంపి మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ విచారణ నేటికి వాయిదా

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిదాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.ఈ కేసులో వాదోపవాదాల కొనసాగాయి.అయితే ఈ కేసులో పూర్తి స్థాయి వాదనలు వినిపించేందుకు హైకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డి అత్యంత కీలకమని సీఐడీ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సాగింది. మద్యం విధానం రూపకల్పన, దానిని అమలు చేయడం, ముడుపులు చెల్లించిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు ఇవ్వడంలో ఆయన పాత్ర కీలకం అని దర్యాప్తులో తేలిందని అన్నారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ము నకిలీ సంస్థలకు మళ్లించడంలో మిథున్‌రెడ్డి కీలకపాత్ర వహించారని తెలిపారు. ముడుపుల వ్యవహారం బయటకు: ముడుపులు రూపేణా డీకార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన బ్యాంక్ ఖాతాలో రూ.5 కోట్లు జమయ్యాయని లూథ్రా కోర్టుకు తెలిపారు. పీఎల్ ఆర్ ప్రాజెక్ట్ మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిందే అయినా తనకు సంబంధం లేదని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు.

## జాతీయ బిసిసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మయూరి శ్యామ్ యాదవ్



**గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరు పట్టణానికి చెందిన డాక్టర్ బండి శ్యాంసుందర్ రావు (మయూరి శ్యామ్ యాదవ్)ను నియమించారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజ యాదవ్, రాష్ట్ర నేతలు రాయి రమణయ్య, డాక్టరు గుండాల సురేంద్ర, రజిని, పద్మమ్మ, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగరంలో మరో హత్య

**నెల్లూరు క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త :** నగరంలో హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కారణాలు ఏవైనా ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఏదో ఒక సందర్భంలో నెలలో ఒకటి రెండు సార్లు హత్య సంఘటనలు చోటు చేసుకుంటూ ఉండడం నగరవాసులను కలవరానికి గురిచేస్తుంది. తాజాగా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిని అతని తోటి స్నేహితులు హత్య చేయడమే కాకుండా తామే హత్య చేశామని ఇంట్లో ఉన్న శవాన్ని తీసుకెళ్లాలంటూ హతుని బంధువులకు సమాచారం ఇవ్వడం విశేషం. ఈ సంఘటన సంబంధించి పోలీసుల కథనం మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జైహింద్ సహానీ (40) స్థానిక నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్ లో నివాసముంటూ ఇంటీరియర్ పనులు చేస్తుంటాడు. అతనితో పాటు అదే రాష్ట్రానికి చెందిన పరదేశి గౌతమ్, రామ్ కేసరిలు కూడా ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి ముగ్గురు ఒకే గదిలో ఉంటూ పనులు చేసుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో వీరి ముగ్గురు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో జైహింద్ పై కక్ష పెంచుకున్న మిగతా ఇద్దరు అతనిని అంతమొందించాలని నిర్ణయించి, సోమవారం రాత్రి పొద్దుపోయాక జైహింద్ తో గొడవపడి అతనిపై రోకలి, ఇనుప రాడ్తో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. రక్తస్రావానికి గురైన జైహింద్ అక్కడికక్కడే మరణించాడు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయిన నిందితులు ఇద్దరు సమీపంలో నివాసం ఉంటున్న జైహింద్ బంధువులకు సమాచారం ఇచ్చి,

తామే హత్య చేశామని, ఇంట్లో శవం ఉందని చెప్పడంతో బైకంప్లీతులైన జై హింద్ బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా జైహింద్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 18 - జూన్ - 2025


## తెలుగుదేశం పార్టీ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

**అంబాజీపేట , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
అంబాజీపేట మండలంలో ఉన్న 16 గ్రామాలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గత వారం రోజులుగా మండల ఎన్నికల పరిశీలకుడు టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామాల వారిగా కార్యకర్తల అభిప్రాయం మేరకు జరిగింది.

**గ్రామాల వారీగా టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు :**
పసుపల్లి: గ్రామ శాఖ అధ్యక్షులు పెట్ట కృష్ణ, కార్యదర్శి గుత్తుల నాగరాజు, వక్కలంక: గుత్తుల అరుణ్ కుమార్,నేదునూరి సూర్య వెంకట రమణ,ముక్కామల: ముషిణి మణికంఠ, యడ్లపల్లి నరేష్, ఇరుసుమండ: సుంకర గణపతి రావు,మోర్ల వెంకట సాయి,పుల్లేటికుర్రు :పబ్బినీడి రాంబాబు, దొమ్మేటి సురేష్ కుమార్, పెదపూడి: తిరుమనాథం హనుమంత రావు,పెదపూడి శ్రీనివాసరావు, మొసలపల్లి: అంబటి నాగేశ్వరరావు,మట్టపర్తి నాగ సత్యనారాయణ...గంగలకుర్రు: యర్రంశెట్టి వీరభద్రరావు, కమిడి వీర వెంకట సత్యనారాయణ, చిరుతపూడి:వారా శ్రీనుబాబు, సానబోయిన అర్జునరావు, ఇసుకపూడి: యనమదల సాయిబాబా, కోడేటి గంగాధర రావు,నందంపూడి:కేతా అర్జునుడు, విప్పర్తి నారాయణరావు, తొండవరం: పెచ్చెట్టి వెంకట దుర్గాప్రసాద్, నాగళ్ల వెంకటేశ్వరరావు, వాకలగరువు:చప్పిడి శ్రీను,కాప నాగభూషణం, కముజువారిలంక: బొక్కా శ్రీనివాసరావు,వాసంశెట్టి నాగ సుబ్రహ్మణ్యం,మాచవరం: దొమ్మేటి శ్యామ్,నేదునూరి నాగేశ్వరరావు,గంగలకుర్రు అగ్రహారం : అధ్యక్షులుగా మంద నాగరాజు,కార్యదర్శిగా మట్టపర్తి వీర వెంకట సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నేడు మండల కమిటీ ఎన్నిక :**
అంబాజీపేట మండలం తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నిక నేడు (బుధవారం) నిర్వహించ నున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో జరిగే మండల కమిటీ ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులుగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకు షేక్ సుబాన్, మండల ఎన్నికల కమిటీ అబ్జర్వర్ టేకుమూడి లక్ష్మణరావులు పాల్గొంటారని తెలిపారు.

## కోనసీమ గోవిందునికి అష్టోత్తరపూజలు..వేలాదిగా తరలివచ్చిన భక్తులు

### స్వామివారి ఆదాయం రూ.3,25,836/-లు



**ఆత్రేయపురం , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
ఏడు వారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం ఏడువారాలు పూర్తి అయిన వేలాదిమంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అష్టోత్తరపూజలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మేలుకొలుపు, లక్ష్మి ఐశ్వర్య హోమం,అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం గోపూజ,బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్ర సాదాలు స్వీకరించారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.3,25,836/-లు వచ్చి నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వచ్చిన భక్తులకు డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు ను చేశారు.



## డ్రోన్ల వినియోగం వ్యవసాయ రంగంలో "గేమ్ చేంజర్" : ఎమ్మెల్యే సత్యానందరావు

**- వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పవర్ టిల్లర్లు, డ్రోన్లు పంపిణీ**

**రావులపాలెం , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తే రైతులకు మేలు చేకూరుతుందని, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం గేమ్ చేంజర్ గా మారనుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులైన రైతులకు పవర్ టిల్లర్లు, డ్రోన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సుమారు రూ. 1.05 కోట్ల సబ్సిడీపై 52 మందికి పవర్ టిల్లర్లు, ఏడుగురికి డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ వ్యవసాయరంగంలో నానాటికీ పెరుగుతున్న పెట్టుబడులను నియంత్రించి అధిక దిగుబడులను సాధించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ ఎంతగానో దోహదం చేస్తోందన్నారు. సాగు విధానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అన్నదాతలు అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు.

**తీరు మారకపోతే వైసీపీకి బహిష్కరణే :**
గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి సుమారు 10 వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేయడంతో రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఇది చూసి ఓర్వలేక దిగజారుడు విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకులు ఈ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి బహిష్కరిస్తారని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి 42 లక్షల మంది విద్యార్థులకు 4,500 కోట్ల రూపాయల నిధులు విడుదల చెస్తే నేడు కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం ద్వారా సుమారు 8,700 కోట్ల రూపా



యల నిధులను ఒకేసారి విడుదల చేసిందని, ఇది ఒక చరిత్ర అని సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, బీజేపీ ఇన్చార్జి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయాధికారి బి.మీనా పాల్గొన్నారు.



## ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహాలు : గిడ్డి



**మామిడికుదురు , జూన్ 17, ( ప్రభాతవార్త )**
ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు.పాశర్లపూడి లంకకు చెందిన కోలా ప్రవీణ్ కుమార్ జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలో జాతీయ స్థాయిలో 328 వ ర్యాంకు,ఎంసెట్ లో 153 వ ర్యాంకు సాధించాడు.అదే గ్రామానికి చెందిన కోలా మధువల్లి పదవతరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కలెక్టర్ చేతుల మీదగా ప్రతిభా అవార్డు అందుకుంది.
స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, మధువల్లిక లను ఎమెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ,ఎఎంసి చైర్మన్ పెనుమాల లక్ష్మి,పార్టీ నాయకులు తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు,చెరుకూరి పార్వతి, జనసేన పార్టీ అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఏడు శనివారాల వెంకన్నపై దష్ప్రచారం తగదు

**- బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం**

**ఆత్రేయపురం , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కోరినకోర్కెలు తీర్చేస్వామి గా దేశవిదేశాలనుండి, ఇతర రాష్ట్రాలనుండి లక్షలాదిమంది భక్తులు వచ్చి వారి స్వామివార్ని దర్శించుకుంటున్నారని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లక్షల్లో భక్తులు రావడంతో వారికి ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా నిత్యాన్నదానం, నిత్యం ఆ ఆలయంపై ప్రత్యేక దృష్టి పెట్టి వివిదరకాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన వాడపల్లి ఆలయంపై కొంతమంది నాయకులు రాజకీయాలు చేస్తు నకిలీలు దుష్ప్రచార వార్తలు సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న విషయం అందరకీ తెలిసిందే.అయితే కాలం ఎవ్వర్ని వదలదు,భగవంతునిపై అవాకులు చవాకులు పేలుతున్నవార్ని శక్తివంతుడైన వెంకన్నవదలడని పాలూరి హెచ్చరించారు. ఇంత విశిష్ట మైన దేవాలయం మన కోనసీమ లో ఉండటం ప్రతీ హిందువు ఆనందించ



వలసిన విషయం అని సత్యానందం అన్నారు. ఆలయ విశిష్టత, అభివృద్ధి ఓర్వలేక హిందూ వ్యతిరేకులు దృష్ప్ర చారం లో ముం దు ఉంటున్నారు అని వారికి ఆ అవ కాశం ఇవ్వకూడదు అని సత్యానందం తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు..పిల్లలతో సహా యువతని గుర్తించిన పోలీసులు



**కోనసీమ బ్యూరో , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
ఈనెల 14 వ తేదీ పేరూరు కు చెందిన చవ్వాకుల హారతి కుమార్తె నందన, కుమారుడు అయ్యాన్ భార్గవ్ లతో అదృశ్యమైన సంగతి తెలిసిందే. భర్త చవ్వాకుల శ్రీ నగేష్ ఇచ్చిన ఫిర్యాదు పై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా, మూడు రోజులలో తల్లి ఇద్దరు పిల్లలను క్షేమంగా కనుగొని వారి బంధువులకు అప్పగించినట్లు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. భార్యాభర్తల మధ్య గొడవ వల్ల హారతి ఇంటి నుంచి వెళ్ళిపోయిందన్నారు. డి.ఎస్.పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ ఆదేశాలతో ఎస్. ఐ మనోహర్ జోషి, పీసీ రాయుడు శ్రీనులు వారిని విశాఖపట్నం నుండి క్షేమంగా అమలాపురం తీసుకు వచ్చారని సీఐ వీరబాబు తెలిపారు.

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



**సీతానగరం , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
మండలంలోని సీతానగరం కైలాసగిరి సమీపంలోని ఇసుక ర్యాంపు నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే మంగళవారం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా బొండు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. కొందరు అక్రమ ఇసుక వ్యాపారులకు ఇది వరంగా మారింది. పగలు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా బొండు మట్టిని, రాత్రిపూట ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తు న్నారు. ఈ అక్రమ రవాణా మండల ప్రధాన రహదారి మీదుగా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ, రెవెన్యూ మరియు పోలీసు అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ బొండు మట్టి, ఇసుక రవాణా పై ఉ న్నతాధికా రులు తక్షణమే దృష్టి సారించి, అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో ఆకస్మికంగా రికార్డులు తనిఖీ



**ఆత్రేయపురం , జూన్ 17, ( ప్రభాతవార్త )**
ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కు చెందిన పలు రికార్డులను జిల్లా పరిషత్తు ఉప ముఖ్య కార్యనిర్వహణాదికారి, వి.రాంగోపాల్ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఉన్నతాధికారి ఆకస్మికంగా కార్యాలయమునకు రావడంతో పలు కార్యాలయాల ఉద్యోగులు ఏం జరుగుతుందో అన్న డైలామా లో పడ్డారు. ఎంపిడి వో .బి.కె.ఎస్.ఎస్ .వెంకట రామన్ . మండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, సీనియర్ సహయకులు పి.అనిల్ కుమార్, జూనియర్ సహయకులు, ఆర్.ఎస్ . ప్రత్యూష, టైపిస్టు పి.పురుషోత్తమ రావు ఉన్నారు.

## పూరీ జగన్నాథ రథయాత్రకు రావులపాలెం నుండి ప్రత్యేక బస్సు

**రావులపాలెం , జూన్ 17, ( ప్రభాతవార్త )**
ఒరిస్సాలోని పూరి జగన్నాథ స్వామి రథో త్సవం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జి.జి.వి.రమణ మంగళ వారం తెలిపారు. ఈ బస్సు ఈనెల 26వ తేదీన బయలుదేరి జగన్నాథ స్వామి రథోత్సవం అనం తరం అరసవల్లి, కోణార్క్, భువనేశ్వర్, సింహాచలం క్షేత్రాల సందర్శన అనంతరం 29వ తేదీన రావులపాలెం చేరుతుందని చెప్పారు. టికెట్ ధర (ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్న భోజనం తో కలిపి ) రూ.4600 గా నిర్ణయించినట్లు తెలిపారు. అడ్వాన్స్ టికెట్లు, పూర్తి వివరాలకు డిపో మేనేజర్ (9959225537) అసిస్టెంట్ మేనేజర్లకు (7382 911871) ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

## వాడపల్లి 'వెంకన్న'ను దర్శించుకున్న ద్వారకా తిరుమల ఆర్.జె.సి.ఎన్.వి. సత్యనారాయణమూర్తి దంపతులు



**ఆత్రేయపురం , జూన్ 17, ( ప్రభాతవార్త )**
ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ద్వారకా తిరుమల ఆర్.జె.సి.ఎన్.వి. సత్యనారాయణ మూర్తి సతీసమేతంగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు అర్చకులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహ ణాధికారి నల్లం సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

## కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

**- 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు**
**- కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల వెల్లడి**

**కాకినాడ టౌన్ , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ఇచ్చిన హామీలో భాగంగా 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నట్లు కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ వెల్లడించారు. దీనిపై ప్రతిపక్ష పాత్రలేని వైకాపా నేతలు దుష్ప్రచారం చేసి ప్రజల చీత్కారానికి గురవు తున్నారని ఆయన చెప్పారు. మంగళ వారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జ్యోతుల విలేకరులతో సమావేశం నిర్వహించి తల్లికి వందనం పథకంతో పాటుగా ప్రభుత్వం నిర్వహి స్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను వివరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే పథకం అమలు



చేశారని 67.27 లక్షల మందికి ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం అంటే అప్పటి సీఎం జగన్ & కోకు ఏమాత్రం తెలియదని వారికి విధ్వంసం, అక్రమం, అన్యాయాలు చేయడం మాత్రమే తెలుస న్నారు. చంద్రబాబు ఏడాదిలోగా రోడ్లు నిర్మించి సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యం పోసారన్నారు. అమరావతిని నాశనం, ప్రజలు కష్టాలు తెలుసుకునే ప్రజా వేదికను కూల్చి ప్రజాగ్రహంనకు గురయ్యారని చెప్పారు. వరుసగా ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తామని నవీన్ చెప్పారు. దేశంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో అగ్రభాగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అతనికి ప్రధాని మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారని నవీన్ కుమార్ చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు, ఎండి జహీరుద్దీన్ జిలానీ, పెంకే శ్రీనివాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ర్యాంకర్ వైష్ణవిని అభినందించిన టిడిపి నేత పర్వత సురేష్



**శంఖవరం , జూన్ 17, ( ప్రభాతవార్త ) :**
ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో ఉత్తమమైన ర్యాంకు సాధించిన పెద్దనాపల్లికి చెందిన గొల్లపల్లి వైష్ణవిని ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి సీనియర్ నేత పర్వత సురేష్ అభినందించారు. ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) సోదరుడు కుమార్తెన వైష్ణవి నీట్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 532 వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ లో 33 వ ర్యాంకు సాధించింది. దీనితో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెద్దనాపల్లి గ్రామంలోని వైష్ణవి గృహానికి వెళ్లిన పర్వత సురేష్ వైష్ణవిని సత్కరించి, భవిష్యత్తులో చేపట్టే వైద్య విద్యలో మంచి ఫలితాలు సాధించి, ఉత్తమ వైద్యురాలిగా ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టిడిపి నేతలు బొర్రా వాసు, వరప్రసాద్, జట్లా శ్రీను, పడాల కృష్ణమూర్తి, దాసరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు వినతి

**సామర్లకోట , జూన్ 17, ( ప్రభాతవార్త )**
సామర్లకోట ఎడిబి రోడ్డులోని రాక్ సిరామిక్ వద్దనుండి నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల వంతెన వద్ద నుండి భీమేశ్వర స్వామి ఆలయం వెనుక ఉన్న పొలాల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ భీమేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం, రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్ మోహన్ తదితరులు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబుకు వినతిపత్రం అందచేశారు. మంగళవారం వారు ఎమ్మెల్యే ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మేరకు సర్వీస్ రోడ్డు వేసేందుకు కిలో



మీటర్ మేర రైతులు భూములు ఇచ్చేందుకు సైతం అంగీకరించారని నాయకులు కంటే బాబు అన్నారు. ఈ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు వేయడం వల్ల దూరప్రాంతాల నుండి ఆలయానికి వచ్చే భక్తులకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. కాగా దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు ఏర్పాటుకు కృషి చెయ్యనున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, తెదేపా నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, గోల్తి సత్యనారాయణ, సామర్లకోట రైతులు ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై 'ఆర్‌టి76'


మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో తన కొత్త చిత్రం ఆర్‌టి76తో మరోసారి తన సిగ్నేచర్ ఎనర్జీతో అలరించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇటీవల పూజా వేడుకతో ప్రారంభమైయింది. ప్రేక్షకులను ఆకట్టుకునే హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో చిత్రాలను అందించే ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఆర్‌టి76 హ్యూమర్, ఎమోషన్స్‌తో కూడిన హోల్సమ్ ఎంటర్ టైనర్‌గా వుండబోతోంది. ఈ చిత్రం అఫీషియల్‌గా సెట్స్‌పైకి వెళ్ళింది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. రవితేజ, ఇతర ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ ట్రేడ్ మార్క్ కామిక్ టైమింగ్, మాస్ అప్పీల్‌తో కూడిన ఫుల్ లెంత్ ఫ్యామిలీ డ్రామాని రాశారు. రవితేజ ఈ సినిమా కోసం చాలా స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ధమాకా చిత్రానికి బ్లాక్‌బస్టర్ సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో మరో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కోసం రవితేజతో కలిసి పని చేస్తు న్నారు. ప్రసాద్ మురెళ్ల సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఆర్‌టి76 2026 సంక్రాంతి సందర్భంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్: ఎస్ఎల్వి సినిమాస్, డిఓపి: ప్రసాద్ మురెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.



# 'కన్నప్ప' వీక్షించడం ఆనందంగా ఉంది: మోహన్ బాబు

దిగ్గజ నటులు రజనీకాంత్, డాక్టర్ ఎం. మోహన్ బాబు కలిసి నటించిన పెద రాయుడు చిత్రానికి ముప్పై ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా చెన్నైలో వీరిద్దరూ కలుసుకుని నాటి జ్ఞాపకాల్ని నెమరవేసుకున్నారు. జూన్ 15, 1995న విడుదలైన ఈ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది. సినిమా విడుదలై ముప్పై ఏళ్లు అవుతున్న సందర్భంగా ఇలా చెన్నైలో రజనీకాంత్, మోహన్ బాబు సందడి చేశారు. ఈ క్రమంలోనే సూపర్ స్టార్ రజనీకాంత్ కన్నప్ప సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. కన్నప్ప చిత్రాన్ని వీక్షించిన రజనీకాంత్ తన అభిప్రాయాల్ని పంచుకున్నారు. సినిమా అద్భుతంగా ఉందని విష్ణుని కొనియాడారు. ఈ మేరకు విష్ణు మంచు సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకున్నారు. కన్నప్ప చిత్రాన్ని రజనీకాంత్ ప్రత్యేకంగా వీక్షించారు. సినిమాను చూసిన తరువాత నన్ను గట్టిగా హత్తుకున్నారు. కన్నప్ప ఎంతో నచ్చిందని ఆయన అన్నారు. ఈ క్షణం కోసం నేను గత 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. నా నటనను ఆయన ఎప్పుడు మెచ్చుకుంటారు.. ఇలా ఎప్పుడు హత్తుకుంటారు అని అనుకుంటూ ఉన్నాను.. ఆ కల ఇప్పుడు నెరవేరింది. నాకు ఈ రోజు ఎంతో ఆనందంగా, సంతోషంగా, గర్వంగా ఉంది అని అన్నారు. డా.ఎం.మోహన్ బాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ.. జూన్ 15కి పెదరాయుడు రిలీజ్ అయి 30ఏళ్లు పూర్తయ్యాయి. అదేరోజు నా ప్రియ మిత్రుడు రజనీ కాంత్ కన్నప్ప చిత్రాన్ని వీక్షించారు.






# ఓటీటీ

ఎవ్వరూ ఊహించని ఓ క్రేజీ కాంబినేషన్‌ను నెట్ ఫ్లిక్స్ తీసుకురాబోతోంది. ఒక మైండ్‌బెండింగ్ క్రాస్‌ఓవర్‌ను నెట్ ఫ్లిక్స్ తాజాగా విడుదల చేసింది. ఎలాంటి సమస్యనైనా ఫిక్స్ చేసే ఓజీ ఫిక్స్ రానా నాయుడు, కట్టప్పని కలవబోతోన్నారు. తీవ్రమైన ముఖాముఖి చర్చలు, కొన్ని ఆవేశపూరిత పరిహాసాలు చూడబోతోన్నాం. గతం వర్తమానాన్ని కలవబోతోంది.

# రానా నాయుడు, కట్టప్ప కలిస్తే.. ఇక సోషల్ మీడియా బద్దలే..



రానా నాయుడు సీజన్ 2కి ముందు ఈ ప్రత్యేక వీడియోని నెట్ ఫ్లిక్స్‌లో చూడండి. ఎందుకంటే రానా ఒక్కసారి దారి తప్పినా, హద్దుల్ని దాటినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# 'సయారా' కొత్త పాటతో ప్రమోషన్‌లో మోహిత్ సూరి

యష్ రాజ్ ఫిల్మ్స్, మోహిత్ సూరి కాంబోలో రూపొందుతున్న సయారా బెస్ట్ మ్యూజికల్ ఆల్బమ్‌గా మారుతోంది. చార్ట్‌బస్టర్ సయారా టైటిల్ ట్రాక్ తర్వాత జుబిన్ నౌటియాల్ పాడిన బర్బాద్ కూడా బ్లాక్ బస్టర్ అయింది. ఇక ఇప్పుడు మూడవ పాటను రిలీజ్ చేశారు. ఇండియన్ సెన్సేషనల్ సింగర్ విశాల్ మిశ్రా ఈ థర్డ్ సింగిల్ తుమ్ హో తోని ఆలపించారు. ఈ పెప్పీ లవ్ ట్రాక్‌ను మేకర్స్ మంగళవారం జూన్ 17నాడు విడుదల చేశారు! ఈ మూడో పాట రిలీజ్ సందర్భంగా మోహిత్ సూరి మాట్లాడుతూ, 12 సంవత్సరాల క్రితం విశాల్ నన్ను కలవడానికి వచ్చినప్పటి నుండి నేను, తను కలిసి ఓ ప్రత్యేకమైన సినిమా కోసం పని చేయాలని అనుకున్నాము. మేము సరైన క్షణం కోసం వేచి చూస్తున్నాం. చివరకు అది సయారాతో నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నా పాటలే అతన్ని సంగీత ప్రపంచంలోకి తీసుకు వచ్చాయని, అవే స్ఫూర్తి నింపాయని విశాల్ చెప్పడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. మన పని ఎవరిపైన అయినా ఇలాంటి ప్రభావాన్ని చూపుతుందని తెలుసుకున్నప్పుడు అదొక గొప్ప అనుభూతిని ఇస్తుంది. సంగీతానికి ప్రజల హృదయాలను తాకే సామర్థ్యం ఉందని, అది చాలా స్వచ్ఛమైన మాధ్యమమని నేను ఎప్పుడూ భావించాను. కాబట్టి నా 20 సంవత్సరాల దర్శకత్వం, సంగీత సృష్టిలో నా పాటల ద్వారా ప్రజలకు ఎన్నో జ్ఞాపకాలను సృష్టించినందుకు నాకు నేనే కృతజ్ఞుడిగా భావిస్తుంటాను. నా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత ప్రతిభావంతులైన కళాకారులలో విశాల్ మిశ్రా ఒకరు. సయారా మ్యూజిక్ ఆల్బమ్‌లో ఆయన పాట పాడటం నా అదృష్టం. 12 సంవత్సరాలుగా నన్ను కలుస్తూనే ఉన్నప్పటి నుండి విశాల్ నాకు ఇచ్చిన గీతాలు ఇప్పటికీ నా దగ్గర ఉన్నాయి. అవన్నీ అద్భుతాలే. విశాల్ గురించి, అతని టాలెంట్ గురించి, అతని ఎదుగుదల గురించి తెలుసుకోవడం నాకు ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. తుమ్ హోతో పాటతో మరోసారి అద్భుతాన్ని క్రియేట్ చేశారు. సయారా సినిమా నుండి మూడవ పాటతో అతని ప్రతిభను బయటపెట్టడానికి మేం ఎంతో ఎదురుచూశాం. అతని సంగీతాన్ని ఇష్టపడే వారు, అతని అత్యుత్తమ రొమాంటిక్ పాటను విని ఎంతో థ్రిల్ అవుతారు. విశాల్ సంగీతాన్ని ఇష్టపడే వారు తుమ్ హోతో పాటతో ప్రేమలో పడతారు అని అన్నారు. సయారా టీజర్‌కు అన్ని వైపుల నుంచి ప్రశంసలు వచ్చాయి. సయ్యారా టైటిల్ కూడా ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. దీని అర్థం సంచరించే నక్షత్రం. ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ, ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ ఉంటుంది. కానీ ఎప్పుడూ ఎవ్వరికీ అందదు. కేవలం వర్ణించడానికి ఉపయోగిస్తారు. ఈ చిత్రం ద్వారా అహాన్ పాండేను హిందీ చిత్ర పరిశ్రమకు హీరోగా పరిచయం చేస్తున్నారు. అనీత్ పడ్డా ఈ చిత్రంలో కథానాయికగా నటించారు. సయారాను అక్షయ్ విధాని నిర్మించారు. జూలై 18, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. వైఆర్ఎఫ్ గత 50 సంవత్సరాల సినీ చరిత్రలో భారతదేశానికి అన్ని కాలాలలోనూ కల్ట్ రొమాంటిక్ చిత్రాలను అందించింది.



# 28న 'హనుమాన్ జంక్షన్' రీ రిలీజ్

2001లో విడుదలైన హనుమాన్ జంక్షన్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించింది. యాక్షన్ అద్భుతమైన హ్యూమర్ మేళవించిన ఈ సినిమాలో అర్జున్, జగపతి బాబు, వేణు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆయన తరువాత తమిళ జయం, తనీ ఒరువన్, గాడ్‌ఫాదర్ వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించారు. లయ, స్నేహ, విజయలక్ష్మి కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో బ్రహ్మానందం, కోవై సరళ, అలీ, ఎల్.బి. శ్రీరామ్, ఎం.ఎస్. నారాయణ, వేణు మాధవ్ వంటి ప్రముఖులు హాస్య పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఎడిటర్ మోహన్ స్థాపించిన ఎం.ఎల్. మూవీ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎం.వి.లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఎంగేజింగ్ స్క్రీన్‌ప్లే, ఆకట్టుకునే సంభాషణలు, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు కల్ట్ స్టేటస్‌ను తీసుకు వచ్చాయి. ఇప్పుడీ ఎవర్ గ్రీన్ ఎంటర్‌టైనర్ మళ్లీ ప్రేక్షకులను థియేటర్లో అలరించబోతోంది. హనుమాన్ జంక్షన్‌ను జూన్ 28న మళ్లీ థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్రబృందం అనౌన్స్ చేసింది. ఈ తరహా సినిమాలు ఎప్పుడు వచ్చినా హిట్ అవుతాయి. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్స్ కొరవడుతున్న సమయంలో, హనుమాన్ జంక్షన్ మళ్లీ తన మ్యాజిక్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయబోతోంది. ఈ చిత్రానికి సి. రామ్‌ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందించారు.




# జులై 11 'ఓ భామ అయ్యో రామ'

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామ అయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్‌మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రాన్ని జూలై11న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఇదొక బ్యూటిఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. అన్ని వర్గాలకు కావాలసిన అంశాలు ఇందులో ఉంటాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ అందర్ని అలరిస్తుంది. ఇదొక క్యూట్ అండ్ ఎంటర్‌టైనింగ్ లవ్‌స్టోరీలా సినిమాలోని ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంది. సుహాస్ ఎంతో ఎనర్జీ ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్. రామ్‌గా సుహాస్, సత్యభామగా మాళవిక మనోజ్‌లు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతారు. హీరోయిన్ మాళవిక, హీరో సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో వినోదాన్ని పంచుతాయి. ఖర్చు విషయంలో నిర్మాత ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించాడు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు అన్నారు. నిర్మాత మాట్లాడుతూ సాధారణంగా లవ్ రొమాంటిక్ కామెడీ సినిమాలను అందరం ఇష్టపడుతుంటాము. ఇప్పుడు అదే తరహాలో సుహాస్ హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఓ భామ అయ్యో రామ. అందరిని నవ్వించే వినోదమైన యువకుడి చుట్టూ తిరిగే ఓ కథగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఖర్చు విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించాం. తప్పకుండా ఈ చిత్రం సుహాస్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. జూలై 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు థియేటర్‌లో ఎంజాయ్ చేస్తారు అన్నారు. నటీనటులు: సుహాస్, మాళవిక మనోజ్, అనిత హసానందిని.



# ఆ హీరో అంటే నాకిష్టం: హీరోయిన్ స్నేహ

సాధారణ ప్రేక్షకులకే కాదు, సినిమాల్లో నటించే హీరోలకీ, హీరోయిన్లకు కూడా అభిమాన నటీనటులుంటారు. అయితే కొంతమంది తమ అభిమాన నటీనటుల గురించి బయటకు చెప్తే మరికొందరు మాత్రం తమ యిష్టాయిష్టాలను మనసులోనే దాచుకుని అభిమానిస్తుంటారు. సౌత్ హీరోయిన్ స్నేహ తాజాగా తనకు ఇష్టమైన హీరో గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసి ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న స్నేహను అందరూ చాలా ఇష్టపడతారు. పక్కింటి అమ్మాయి లా కనిపించే స్నేహ ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తొలి వలపు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన స్నేహ ఆ తర్వాత ప్రియమైన నీకు సినిమాతో సూపర్ హిట్‌ను ఖాతాలో వేసుకుంది.ఆ తర్వాత హీరోయిన్‌గా స్నేహ వరుస సినిమాలు చేసింది. అందంతో పాటూ మంచి అభినయంతో ఎంతో మందిని ఆకట్టుకున్న స్నేహ ఈ మధ్య సపోర్టింగ్ రోల్స్‌లో కనిపిస్తోంది. మొన్నా మధ్య అల్లు అర్జున్ హీరోగా వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలో ఉపేంద్ర భార్యగా కనిపించగా, ఆ తర్వాత వినయ విధేయ రామలో రామ్ చరణ్‌కు వదిన పాత్రలో మెరిసింది. రీసెంట్‌గా డ్రాగన్ సినిమాలో డాక్టర్ పాత్రలో కూడా స్నేహ మెరిసింది. రీసెంట్‌గా గోట్ సినిమాలో విజయ్‌కు భార్యగా నటించి ఆకట్టుకున్న స్నేహ తమిళంలో చాలా మంది స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేయగా, వారందరిలో తనకు అజిత్ అంటే ఇష్టమని తెలిపింది. విజయ్, కమల్, సూర్య, అజిత్,ప్రశాంత్, ధనుష్‌తో కలిసి నటించిన స్నేహకు మీ ఫేవరెట్ హీరో ఎవరనే ప్రశ్న రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ఎదురవగా తనకు అజిత్ అంటే ఇష్టమని చెప్పింది. ప్రస్తుతం సినిమాల ఎంపిక విషయంలోజాగ్రత్తగా ఉంటున్న స్నేహ ఎంతో ఆచి తూచి వ్యవహరిస్తుంది.



# '8 వసంతాలు' ట్రైలర్ రిలీజ్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్ సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్, టీజర్లు, పాటలు స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేశాయి. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఆడవాళ్లు నిప్పు పట్టకూడదు. అంత్య క్రియలకి కర్మకాండలకు వాళ్లు పనికిరారు అంటూ ఓ క్యారెక్టర్ చెప్పిన మాట లకు పేగు పంచి ప్రాణం పొయ్య గలిగిన వాళ్ళం.. చితిముట్టించి మోక్షం ఇప్పించలేమా అంటూ అనంతిక బదులు చెప్పిన సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. ఇది కేవలం ఒక మహిళ ప్రయాణం కాదు, సమాజంలో చెరపాల్సిన మూఢ నమ్మకాలకు ఎదురు నిలిచే కథని ట్రైలర్ చూస్తే అర్థమోతోంది. తండ్రి చేతే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ, ఆనందం, ప్రేమ, విషాదం లాంటి అను భూతులతో అనంతిక ప్రయాణం సాగుతుంది. ప్రతి వసంతం ఒక కీలక మలుపు. ఆమె ఒక కుమార్తెగా మొదలై, కొన్ని విధా నాలను ఎదిరించే ధైర్యవంతురాలిగా మారడాన్ని ట్రైలర్ అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. అనంతికా సనీల్‌కుమార్ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. ఆమెక్యారెక్టర్‌లో ఎమోషన్స్‌ని చాలా చక్కగా ప్రజెంట్ చేశారు. ఒక మటన్ షాప్‌లో జరిగే యాక్షన్ సీన్ ఆమె ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ముఖ్య పాత్రలలో ఆకట్టుకున్నారు. వీరి పాత్రలు కూడా కథకు అర్థవంతమైన బలాన్నిస్తాయి. లోతైన కథలు చెప్పడంలో పాపులరైన దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కథనాన్ని కవిత్వం లాగా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ ప్రతి భావోద్వేగాన్ని అద్భుతంగా క్యాప్చర్ చేస్తుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం మనసుని తాకేలా వుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు అత్యుత్తమంగా వున్నాయి. ఆర్ట్ డైరెక్షన్ అరవింద్ ములే, ఎడిటింగ్ శశాంక్ మాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బాబాసాయి కుమార్ మామిడిపల్లి. బోల్డ్ కథనం, అద్భుతమైన విజువల్స్, మరపురాని పెర్ఫార్మెన్స్‌లతో 8 వసంతాలు భావోద్వేగాలతో నిండిన సినిమాటిక్ అనుభూతిని ఇవ్వనుంది.



# 'డబుల్ చిన్'కు చెక్

అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది. ఈ సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను సులభంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం..



ఎందుకిలా?... డబుల్‌చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

- అధిక బరువు-ఆకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.
- వంశపారంపర్యంగా డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు.
- వయసు పైబడడం-వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం, తద్వారా గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులువడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట!

**ఇంటి చిట్కాలతో ఉపశమనం!..**

బాగా నమలండి..!: డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది పటిష్టంగా తయారవుతాయి. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా చక్కటి ముఖాకృతిని సొంతం చేసుకోవచ్చు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదే తద్వారా దవడల దగ్గర పేరుకున్న కొవ్వు సులభంగా కరుగుతుంది.



**తెల్లసొనతో..** రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె-నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి ఈ మిశ్రాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గు ముఖం పడుతుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చు.

**గ్రీన్ టీ.....** గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు.

**విటమిన్ 'ఇ'....** మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'ఇ' ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. బ్రౌన్ రైస్, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, స్వీట్ కార్న్, యాపిల్, సోయా బీన్స్, పప్పు దినుసులు.. ఇలాంటి వాటిల్లో విటమిన్ 'ఇ' ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి వీటిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

**నీళ్లు ఎక్కువగా ...** రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఉండే కొవ్వుతో పాటు దావడ, గడ్డం కింద పేరుకున్న అనవసర కొవ్వులు కూడా కరిగిపోతాయి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్ల కూడా ఆహారంలో చేర్చుకోవాలి.

**ఈ వ్యాయామాలతో...** •. ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్‌చిన్‌నూ తగ్గించుకోవచ్చు.

• మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. • అలాగే క్యాలరీలు, కొవ్వులు లేని ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. □

# మహిళలు అనారోగ్యం బారిన పడొద్దని ..

హుషారైన పాటొస్తే... డ్యాన్స్ పరిచయం లేనివారు శరీరాన్ని కదుపుతారు. ఆరోగ్యం కోసం వినియోగిస్తే ఎలా ఉంటుంది అని ఆలోచించారు ఆర్ఎం అంజన. 'తాండవ్' పేరుతో బాలికలు, మహిళలకు ప్రత్యేక తరగతులు ఉన్నారు. ప్రముఖ డయాబీటాలజిస్ట్, మద్రాస్ డయాబీటీస్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) అధ్యక్షులురాలీమె. డ్యాన్స్‌వైపు ఎందుకు వెళ్లారో మనతో పంచుకున్నారిలా...

దేశంలో 3 శాతం మందే వ్యాయామాలు చేస్తున్నారంటూ దేశంలో ఐసీఎంఆర్ పరిశోధన. అది చదవగానే మిగిలినవారి పరిస్థితేంటి? వారి ఆరోగ్యాలేం కావాలి? వీళ్లలో మార్పు తెచ్చేదెలా.... లాంటి ప్రశ్నలెన్నో నాలో మెదిలాయి. మార్పు తేవడానికి ఏం చేయాలన్న నా తపన నుంచి వచ్చిందే 'తాండవ్ ప్రాజెక్టు'. అమ్మాయిలు, మహిళలు అనారోగ్యం బారిన పడొద్దని దీన్ని డిజైన్ చేశాం. ఇది కేవలం పది నిమిషాల కాన్సెప్ట్ వారంలో మూడు రోజులు 10 నిమిషాల చొప్పున డ్యాన్స్ చేయిస్తాం. ఇందులో ఆంగ్లం, హిందీ, తెలుగు, పంజాబీ, తమిళం... ఇలా అనేక భాషల్లో పాపులర్ అయిన 4 పాటలకి నృత్యం చేయిస్తాం. తొలి రెండు నిమిషాలూ హాయ్ ఇంటెన్సిటీ వేస్తాం. తరవాత కాస్త నెమ్మదైనది... ఇలా ఒక్కో పాట ఒక్కోలా ఉంటుంది. ప్రతి రెండు నిమిషాలకూ 30 సెకన్ల విరామం ఉంటుంది. వారంలో కేటాయించేది 30 నిమిషాల్లో కానీ ఆరు గంటలు వ్యాయామం చేయగల సామర్థ్యం పొందుతారు. ప్రత్యేకంగా కొరియోగ్రాఫర్లనీ నియమించుకున్నాం. నెలలో అరగంట అదనపు కార్యక్రమమూ ఉంటుంది. దీనితో ఎన్నో సానుకూల మార్పులను గమనించాం. పైగా చాలామంది జంక్ఫుడ్కి దూరమయ్యారు. ఇదంతా ఉచితమే.



**ఆలోచన వెనక ..**

పదేళ్ల క్రితం... నృత్యం ద్వారా ఫిటినెస్ పెంచుకోవచ్చనే ఒక వీడియో చూశా. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి నృత్యంతో సాంత్వన కలిగిద్దామని ఎంతో రిసెర్చ్ చేశా. అదే 'తాండవ్' ఆలోచన తెచ్చింది. ముందు ఆడ, మగవారిని కలిపి ట్రయల్ చేశా. కానీ చాలామంది. మహిళలు 'వ్యాయామాలు చేయడానికి మా సంస్కృతి, సంప్రదాయాలు ఒప్పుకుంటారు. బయటికి, తరవాత మైదానాలకెళ్లేందుకు ఇంట్లోవారు అంగీకరించారు. మగవాళ్ల ముందు డ్యాన్స్ చేయలేం' అన్నారు. వారి పరిస్థితి అర్థమయ్యాక కేవలం మహిళలు, ఆడపిల్లల కోసమే ప్రాజెక్టు తీసుకుని నేను, నా సహ పరిశోధకురాలు డాక్టర్ రంజనీ హారీష్ కలిసి 'తాండవ్' ప్రోగ్రామ్‌ను డిజైన్ చేశాం. దానికి జోడించాం. రంజనీ ఎండీఆర్ఎఫ్ డిజిటల్ అండ్ ప్రివెంటివ్ రిసర్చ్ హెడ్, ముందు మా ఇద్దరిపైనే ప్రయోగం చేసుకున్నాం. తరవాత బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో శాస్త్రీయంగా పరిశోధన చేశాం. సైడ్‌ఫెక్ట్స్ లేకుండా శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగవ్వడం, విద్యార్థులపైనా పరిశోధన చేశాం. ఇక్కడా మెరుగైన ఫలితాలొచ్చాక 2018 నుంచి తాండవ్ అందుబాటులోకి తెచ్చాం



**నాన్న మెచ్చుకున్నారు.** 'తాండవ్' 10 వేల మందికి పైగా మహిళలు, బాలికలకు చేరింది. భారత్ సహా, యూకే, ఆస్ట్రేలియా దేశాలకు శిక్షణ ఇచ్చాం. చెన్నైలో ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ క్లాస్‌లూ ఉన్నాయి. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగినులే కాదు. ఇతర రాష్ట్రాలవారూ ఆసక్తి చూపుతున్నారు. మధుమేహామూ అదుపులో ఉండటం గమనించాం. పరిశోధనలు చేస్తున్నాం. నా లక్ష్యం ఇంతటితో ఆగదు. సమాజం కోసం పాటుపడాలని అమ్మానాన్నలు ఎప్పుడూ చెప్పేవారు. 'వాళ్లిద్దరూ వైద్యులే నాన్న మోహన్ ప్రముఖ డయాబీటిక్ స్పెషలిస్ట్. ఆయనకి తాండవ్ ప్రాజెక్టు గురించి చెప్పినప్పుడు ప్రోత్సహించారు. నిజానికి ఆయన స్ఫూర్తితోనే నేను దయాబీజాజిస్ట్‌నయ్యా నా వంతుగా దేశప్రజలకు సాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. □

# కిచెన్ కింగ్ మసాల



**ఫలానా మసాలాపొడి వల్ల కూరసూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .** ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మరింత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయాలంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళ చొప్పున దాల్చినచెక్క,శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరప కాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేచాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీనినన తడ లేని గాలి చొరబడని డ్బాలో భద్ర చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది. □

# పల్లీలు పాడవకుండా..

కాసిని పల్లీలు వేయించి, కారం, ఉప్పు చల్లితే.. వారెవా.. ఎంత కమ్మగా ఉంటాయి! బెల్లంతో పాకుపట్టి ఉండలు చుడితే.. మరే మిఠాయిలూ సాటి రావు, పల్లీ పచ్చడి గురించి చెప్పాల్సిందే.. ఇడ్లీ, దోశ.. ఎందులోకైనా సూపర్‌గా ఉంటుంది. పల్లీపొడి కూరల్లో వేస్తే వాటికి రెట్టింపు రుచి వచ్చేస్తుంది. ఈ టేస్టీ టేస్టీ పీనట్స్ ఎక్కువకాలం నిలవుండవు. వీటిల్లో ఉన్న ఫ్లేవొనాయిడ్స్, ఎమినో యాసిడ్స్ వల్ల పాడవుతాయి కనుక బాగుండడం కొనుక్కోవడమే మంచిది. తెచ్చినవి ఫంగస్ రాకుండా కొన్నాళ్లు తాజాగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలి..

- పల్లీలను చల్లటి, పొడి ప్రదేశంలో భద్రం చేయాలి. వేడి కానీ తడి గానీ తగలకూడదు. ఫ్రిజ్‌లో ఉంచితే ఎక్కువ కాలం నిలవుంటాయి.
- .గాలి చొరబడని సీసాలలో ఉంచాలి.
- .పల్లీలు ఇటుకరంగులో మెరుస్తుంటాయి. బదులుగా పేలవమైన రంగులోకి మారితే బాగాలేవని అర్థం. వీటి వాసన బాగుంటుంది. అలా లేకుంటే పాడైనట్లు, రుచిలో ఏమాత్రం తేడా వచ్చినా వాడకూడదు. □

# లిచీతో మంచి ప్రయోజనాలు

రోడ్డు పక్క బండ్లపై ఎక్కడ చూసినా లిచీ పండ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి కదూ! ఎరుపు, తెలుపు మేళవింపుతో జెల్లీలా కనిపిస్తూ తెగ నోరూరిస్తాయి. మరి తింటున్నారా? ఎందుకంటే..

ఈ పండ్లు మనకి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

- చినుకులు మొదలయ్యాయి. వాటితోపాటే బోలెడు ఇన్‌ఫెక్షన్లూ పలకరిస్తాయి. వాటి బారిన పడొద్దంటే రోగనిరోధకత పెంచుకోవాల్సిందే. లిచీలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని పెంచడంలో సాయపడుతుంది.
- బి విటమిన్లు, ఫ్లావనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తకణాల ఉత్పత్తికి ఇవి సాయపడతాయి. అందుకే నెలసరి మొదలైన అమ్మాయిలకు వీటిని తప్పక ఇవ్వమంటారు. ఇంకా మాంగనీస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, ఫోలేట్ వంటి ఖనిజ లవణాలకు ఇది మంచి వనరు. పైగా రుచీ బాగుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తప్పక ఇవ్వాల్సిన పండ్లలో వీటినీ ఒకటిగా చెబుతారు.



- వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని ఫ్రీరాడికల్స్‌తో పోరాడి, వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరకుండా కాపాడతాయి.
- విటమిన్-సి నల్లమచ్చలు, హైపర్ పిగ్మెంటేషన్‌ని తగ్గిస్తుంది. అందుకే స్కిన్‌కేర్ ఉత్పత్తుల్లోనూ దీనికి చోటిస్తారు. పైపూతల కంటే నేరుగా తీసుకోవడం మరింత మేలు కదా! అందుకే తరచూ ఆహారంలో చేర్చుకోండి. పైగా ఈ పండు బరువు తగ్గించడంలోనూ సాయపడుతుంది.
- ఇది మనసుకి చేసే మేలూ ఎంతో! దీని తీయనైన సువాసన అరోమా థెరపీలా పనిచేస్తుందట. విశ్రాంతి భావన కలిగించి, ఒత్తిడిని దూరం చేస్తుందట. అంటే వీటిని తినడం ద్వారా శరీరానికే కాదు.. మనసుకీ మేలు జరిగేలా చేయొచ్చన్న మాట. అయితే ఎంత నచ్చినా వీటినీ పరిమితం గానే తీసుకోవాలి. రోజుకి 7కి మించకుండా తినాలి. □

# అందానికి, ఆరోగ్యానికి..

అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో ఛాతీ పాత్ర కీలకం. అయితే తీసుకునే ఆహార, జీవన శైలి వంటవన్నీ దీని ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఓ రకంగా చెప్పాలంటే మనం చేసే చిన్న చిన్న పొరపాట్లే ఛాతీ అదాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు రొమ్ము క్యాన్సర్ ఊబిలోకి లాగుతున్నాయంటున్నారు. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఛాతీ ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచిస్తున్నారు.



**సరిపడినంత నిద్ర..** రాత్రి నిద్రపోయే సమయంలో శరీరంలో హార్మోన్లన్నీ సక్రమంగా వస్తాయి. ముఖ్యంగా ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్ స్థాయి తగ్గుతుంది. ఇది అధిక స్థాయిలో ఉంటే ఛాతీ ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి రోజూ ఎనిమిది గంటల పాటు ప్రశాంతమైన నిద్ర పోవడం చాలా అవసరం అంటున్నారు నిపుణులు.

**తగినంత ఫోలిక్ యాసిడ్..** మను తీసుకునే ఆహారం ద్వారా తగినంత ఫోలిక్ యాసిడ్ శరీరానికి అందకపోయినా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందంటున్నారు నిపుణులు అందుకే రోజూ మనం తీసుకునే ఆహారంలో భాగంగా 4000 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్ అందేలా జాగ్రత్తపడడం చాలా అవసరం. పాలకూర నిమ్మజాతికి చెందిన పండ్లు, బీన్స్, అవకాడో.. మొదలైన వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి.

**సరిపడినంత విటమిన్ 'డి'..** ఛాతీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాటిలో విటమిన్ డి కూడా ఒకటి. అందుకే లేలేత సూర్యకిరణాలు చర్మంపై పడేలా కాసేపు ఉదయాన్నే ఎండలో నిలబడ డం మంచిది. అలాగే ఈ పోషకాలు అధికంగా ఉండే పదార్థాలను ఆహారంలో చేర్చండి. మరీ అత్యవసరమైతే వైద్యుల సలహా మేరకు విటమిన్ 'డి' సప్లిమెంట్లను వాడడం కూడా మంచిది.

**మృదువుగా మసాజ్...** రోజువారీ ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు మసాజ్ చక్కగా తోడ్పడుతుంది. చేతులతో మృదువుగా మసాజ్ చేయడం చాతీ ఆరోగ్యానికి మంచిదంటున్నారు నిపుణులు. ఐదు రోజుల పాటు నిమిషాల చేతులతో ఛాతీపై మృదువుగా మర్దన చేయడం వల్ల వాటిని తీరైన ఆకృతిలో తీర్చి దిద్దుకోవడంతో పాటు.. నొప్పి వంటి సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. □

# పిసిఓఎస్ తగ్గాలంటే..

పొట్ట కండరాలు బలపడటానికీ, వెన్నెముక, పిసిఓఎస్ సమస్యలు తగ్గటానికీ, సిస్టులు, ఫైబ్రాయిడ్స్ కరగడానికీ ఉష్ట్రాసనం బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా రెండు కాళ్లను వెనకకు మడిచి కూర్చోవాలి. తరవాత నెమ్మదిగా మోకాళ్ల మీద లేచి కుడిచేత్తో కుడికాలి




మడమని, ఎడమేత్తో ఎడమ కాలిమడమని వెనక్కి వాలుతూ ఫొటోలో చూపిన విధంగా పట్టుకోవచ్చు. మొదటిసారి ప్రయత్నించేవారు పాదాన్ని అందుకోలేక పోతే పాదాన్ని వేళ్లమీద ఆనించి మడమని పట్టుకోవాలి. ఈ ఆసనాన్ని పదిసెకన్ల చొప్పున రోజుకి మూడుసార్లు చేయాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటే యథాస్థితికి వచ్చి మోకాళ్లపై కూర్చోవాలి. ఈ ఆసనం చేశాక దీని అనుబంధ ఆసనం కూడా చేస్తే మరింత ఫలితం చేకూరుతుంది.

**శశాంకాసనం ...** ఉష్ట్రాసనం వేసిన తరవాత ఈ




శశాంకాసనం చేస్తే శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. అందుకే దీన్ని శాంతినిచ్చే ఆసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వేయడం వల్ల ఛాతీ, పొట్ట, వెన్నెమక కండరాలకి నూతన శక్తి లభించి హాయిగా ఉంటుంది. మంచి నిద్రపడుతుంది. కోపం అదుపులో ఉంటుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. నెమ్మదిగా రెండు చేతులనూ పైకి పెట్టి శ్వాస వదులుతూ మెల్లగా వంగి, చేతులను ముందుకు ఫొటోలో చూపిన విధంగా ఉంచాలి. ఈ క్రమంలో నుదుటిభాగం నేలను తాకేలా ఆనించాలి. మొదటిసారి ప్రయత్నించేవారు దిండుసాయంతో చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు. □

# మణి మండపం

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తయ్యింది. ఆ సంతోష సమాచారాన్ని తన గురువు కు తెలియజేయాలని వెళ్ళాడు భాస్క రుడు. అప్పుడు గురువు, దైవారాధన చేసి నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచి పెడుతు న్నాడు. గురువుని చూసిన భాస్కరుడు ఆలయ నిర్మాణం పూర్తి అయ్యిందని, ఇకపై చేయాల్సిన కుంభాభిషేకం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట తదితర కర్తవ్యాలను నిర్దేశించమని కోరాడు. గురువు చిన్న నవ్వు నవ్వి ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. నువ్వు చేయాల్సింది చాలా ఉంది" అన్నాడు. ఆశ్చర్యపోయాడు భాస్కరుడు. ఆలయ నిర్మాణం చేసినంత మాత్రానే పూర్తి అయినట్టు లెక్క కాదు. నువ్వు ఒక్కడివే వచ్చావు, ఊరిలో ఎవ్వరూ నీతోపాటు రాలేదా?" అని ప్రశ్నించాడు గురువు. దానికి సమాధానంగా ఎవ్వరూ సహకరించడం లేదని, ఏపనికీ ఊరిలో వాళ్ళు దగ్గరకు రావడం లేదు. వారిమీద ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చూసుకున్నాను, పైగా ఆలయ నిర్మాణం ఖర్చు మొత్తం నేనే భరించాను కూడాను" అని చెప్పాడు భాస్కరుడు. అది పూర్తి అయింది కానీ పూజలైనా కలసి చేస్తారో లేదో అని గురువుతో విచారం వ్యక్తం చేశాడు. దానికి గురువు ఇందాక ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చూసావు కదా! నీకు ఏమీ అనిపించలేదా? ఇక్కడ ఉన్న ఒక్కరు లేదా ఇద్దరో కూర్చొని మొత్తం తినేస్తే అది ఫలహారం అవుతుంది కానీ ప్రసాదం ఎలా అవుతుంది. అందరికీ పంచితేనే అది ప్రసాదంగా గౌరవింప బడుతుంది. అలాగే ఆలయం అంటే అందరిదిగా ఉండాలి. అందరికీ ఇది మనది అన్న భావన కలగాలి. అప్పుడే అది కలకాలం ఆలయంగా, కోరిన కోరికలు తీర్చే కోవెలగా విరాజిల్లుతుంది. ఇందులో భక్తికి శక్తి అవరోధం కాదు కదా! ఊరిలో వారి వాటా కూడా ఉన్నప్పుడే అది అందరికీ ఆమోదయోగ్యం. లేదంటే మీ ఇంటి గుడి లేదా మండపమో అవుతుంది. వారికి ఎలాంటి హక్కు గానీ బాధ్యత గానీ లేనట్టు భావించే అవకాశం లేక పోలేదు. అందరూ కలసి నిర్మిస్తే మణి మండపం అవుతుంది. ఒక్కడే నిర్మిస్తే తనీ మండపం అవుతుంది. మీరు ఉన్నంత వరకే దాని ఆలనా పాలన జరుగుతుంది. తర్వాత పాడుబడి పోతుంది. ఊరు ఉన్నంత వరకు ఆలయం ఉండాలంటే ఊరిలో అందరి సహ కారం తప్పక తీసుకోవాలి", అని హితవు పలికాడు గురువు. 'తప్పదంటారా ?" అని అమాయకంగా అడిగాడు భాస్క రుడు. దానికి గురువు గారు మరింత లోతుగా చెప్పదలచి "మానవుడు సంఘజీవి". పాలల్లో నీళ్ళలాగా సమాజంలో జీవనం చేసుకుంటూ చుట్టూ ఉన్న మనుషులపట్ల దయ, జాలి, మృదు స్వభావం కలిగి ఉండాలి. మనిషి సామాజిక స్పృహ కలిగి జీవించాలి. బృందంగా ఏర్పడితే అది ఒక బంధంగా మారు తుంది. ఏ పనైనా సులభం అవుతుంది. ఇవి అన్నీ ఆలయ కేంద్రంగా దొరుకు తాయి అని గట్టిగా హితవు చెప్పాడు గురువు. కనువిప్పు కలిగిన భాస్కరుడు ఊరిలోని బంధువులందరికీ ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగిం చాడు. వారి శక్తి కొలది దీపములు, గుడిగంటలు, తీర్థ పాత్రలు, శఠగోపము, గోపురము పైన కలశము, ఉత్సవ మూర్తులు ఇలాంటి వన్ని స్వీకరించాడు.

- కాపా మధుసూదన్

# కళ్ల ఉపశమనం కోసం..

కళ్లు తగినంత కన్నీటిని ఉత్పత్తి చేయనప్పుడూ, లూబ్రికేషన్ అందనప్పుడూ డ్రై ఐ సింట్రోమ్‌కు దారితీస్తుంది. దీనివల్ల ఒక్కోసారి కళ్లలో మంట, దురద, ఎర్రబడటం, కాంతిని చూడలేకపోవడం జరుగు తుంది. వీటి నుంచి ఉపశమనం పొందడానికి ఈ కింది చిట్కాలను పాటిస్తే సరి.

**శుభ్రం చేయడం..** కాటన్ వస్త్రాన్ని గోరువెచ్చని నీళ్లలో ముంచి నీటిని పిండాలి. కళ్లపై ఐదు నిమిషాలు ఉంచి, వృత్తా కారంలో కను రెప్పలపై మృదువుగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కంటిలో ఉండే దుమ్మూధూళీ బయటకు వచ్చేస్తాయి. ఇలా రోజులో కనీసం మూడు సార్లు చేయాలి.

కొబ్బరినూనె.. కళ్ల తేమను కోల్పోకుండా ఇది కాపాడుతుంది. అంతేకాదు ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పొడిబారడం వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కొబ్బరి నూనెలో దూదిని ముంచి మూసి ఉననన కనురెప్పలపై 15 నిమిషాలు ఉంచాలి. ఇలా ఉపశమనపం కలిగేంత వరకూ రోజులో ఎన్నినసార్లైనా చేయవచ్చు.



**కలబంద గుజ్జు :** ఇందులో ఉండే ఆల్కలీన్ గుణాలు కళ్లను తేమపూరితం చేస్తాయి. దీనిలోని మాయిశ్చరైజింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఎరుపు తద్వారా వచ్చే వాపును తగ్గిస్తాయి. ఇందుకుగానూ కలబంద గుజ్జు తీసుకుని కంటి చుట్టూ సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటిలో శుభ్రం చేస్తే సరి. రోజుకి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**రోజ్‌వాటర్ :** ఒత్తిడి వల్ల అలసి పోయిన కంటికి ఇది ఉపశమనం కలిగిస్తుంది. విటమిన్-ఎ లోపం వల్ల కళ్లు పొడిబారుతుంటాయి. రోజ్‌వాటర్ లో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. గులాబీ నీళ్లలో దూది ఉండల్ని నాననివ్వాలి. వాటిని కళ్లపై పదినిమిషాలు ఉంచాలి. తరవాత చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. రోజులో కనీసం మూడు సార్లు చేస్తే సమస్య తగ్గుతుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకుంటే మంచిది. చేపలు, అవిసెలు,వాల్‌నట్స్‌తోపాటు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలుండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కంటిలో తేమ పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. □



మంగళవారం ప్రజావాణీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

# ప్రజావాణికి 272 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 17,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 272దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 51దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 74దరఖాస్తులు ,ఇందిరమ్మ ఇండ్ల కోసం 28దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 24 దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణీకి 2దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 93దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఎస్సీ గురుకులాల్లో ముగిసిన అడ్మిషన్లు

### 5 నుంచి 9వ తరగతి వరకు పూర్తి

### సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్‌సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్‌సి గురుకులాల్లోని స్కూల్స్ లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్టు సొసైటీ కార్యదర్శి డాక్టర్ వీఎస్ అలుగు వర్షిణి తెలిపారు. ఎస్‌సి గురుకులాల్లోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఇప్పటికే నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు వారు సాధించిన మార్కులను బట్టి, కులం, ఆయా జిల్లాలోని గురుకులాల్లో ఖాళీలను బట్టి వారికి సీట్లను కేటాయించడం జరిగిందని గురుకుల కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 5 నుండి 9వ తరగతి వరకు అన్నితరగతులకు 100శాతం పూర్తిగా భర్తీ అయ్యాయని ప్రకటనలో వెల్లడించారు. అడ్మిషన్ల లో ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆయా జిల్లాలోని జోనల్ అధికారులను సంప్రదించాలని సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

# ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

### టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు

### రెస్టారెంట్‌ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** హోటల్స్ లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాహోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ. ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు,అతిధులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు.అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిధుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

# కులగణన చేపట్టకపోతే రోడ్లపైకి వచ్చి యుద్ధమే

### మాజీ పిసిసి చీఫ్ వి.హనుమంతరావు




**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** జనాభాగణన కోసం కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వులలో కులగణ అంశం పేర్కొనలేదని ఒక వేళ కులగణన చేపట్టకపోతే కులగణన చేయాలని రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని మాజీ పిసిసి చీఫ్,మాజీ రాజ్యసభ సభ్యుడు విహనుమంతరావు హెచ్చరించారు. గాంధీ భవన్‌లో వీహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణన అంటుదే, కానీ కులగణన ప్రస్తావన చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణనతో మాకేం లాభం ఉండదని వనరులపై మాకు మా వాటా దామాషా పద్ధతిలో అందాలంటే కులగణన చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. అగ్రకులంలో ఉన్న రాహుల్, రేవంత్ బిసి కోసం ఆలోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. బిసి అని చెప్పుకునే నరేంద్ర మోడీ బిసి కోసం ఆలోచించడం లేదు అని అన్నారు. జనగణన వల్ల బిజెపికి లాభం తప్పా బిసిలకు లాభం లేదు అని ఆయన అభిప్రాయ పడ్డారు. కులగణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన కోరారు.

# భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం




మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసిన కొత్తగా నియమితులైన కలెక్టర్లు

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, భూ భారతి చట్టంతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు.కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్‌ప్రావీణ్య, సిద్దిపేటకలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి,స్టాంప్స్ రిజిస్ట్రేషన్ స్పెషల్‌సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ మంగళవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు,బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చే 2 నెలలు రెవెన్యూశాఖకు అత్యంత కీలకమైనవని భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పని చేయాలని సూచించారు.

# గ్రామ స్థాయి నుంచి బిసిలు ఉద్యమించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు



**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 17 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంతవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌లపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గ్రామ స్థాయి నుంచి రాజధాని నగరం వరకు బిసిలను చైతన్యవంతం చేస్తామని ఆయన తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్‌లు పెంచడానికి ప్రభుత్వానికిగల ఇబ్బందులు ఏమిటి?, వాటిని అధికమించడానికి ఏమి చర్యలు తీసుకోవాలని, దీనికి అన్ని పార్టీల మద్దతు ఎలా కూడాగట్టాలి? అనే అంశాలపై ప్రభుత్వం ఏనాడైన ఆలోచించిందా!, ఆదిశగా ప్రభుత్వం ఏమైన చర్యతీసుకుందా ?అని ప్రశ్నించారు. గతంలో బిసిలకు రిజర్వేషన్‌లు ఎన్టీఆర్, విజయభాస్కర్‌రెడ్డి పెంచారని, వారికి మంచి పేరు వచ్చిందని, ఇప్పుడు కూడా ప్రభుత్వం పెంచితే సిఎం రేవంత్‌రెడ్డికే మంచి పేరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, బిసి నేతలు అనంతయ్య, జిల్లపల్లి అంజీ, వేముల రామకృష్ణ, పగిళ్ళ సతీష్, రాందేవ్, కార్మిక నేత చిక్కుడు బాలయ్యముదిరాజ్, కె.సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం లక్ష కోట్లకు పైగా వ్యయం

### 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలు జమ

### చొప్పదండి, పరిగి శాసనసభ్యులు, మేడిపల్లి సత్యం, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి




**హైదరాబాద్,జూన్17,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 18నెలల కాలంలో వ్యవసాయదారుల సంక్షేమం అభివృద్ధి కోసం లక్షల కోట్లరూ పాయలు వ్యయం చేశామని రైతును అప్పుల ఊబిలో నుంచి గట్టెక్కించేందుకు 20 వేల 616 కోట్ల రుణమాఫీ చేశామని చొప్పదండి,పరిగి శాసనసభ్యులు మేడిపల్లిసత్యం, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని సిఎల్పీ మీడియా సెంటర్‌లో ఇరువురు శాసనసభ్యులు మాట్లాడుతూ రైతు భరోసా పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారనీ,కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపా యలు రైతు ఖాతాల్లో వేయడం సాహసోపేతమైన చర్య అని అభివర్ణించారు. చరణ్ సింగ్‌ను ఛాంపియన్ ఆఫ్ ది ఫార్మర్స్ అన్నట్లుగానే తెలంగాణ పునర్నిర్మాణ నేత రేవంత్ రెడ్డి ఛాంపియన్ ఆఫ్ తెలంగాణ ఫార్మర్స్ అయ్యారని వారు కొనియాడారు.దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చర్యలు రైతుల సంక్షేమం కోసం అమలు చేశారని వారు చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ కూడా సరిగా చేయలేక ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం చతికిలపడి పోయిందని వారు చేసిన అరకొర రుణమాఫీ వడ్డీకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని వారు చరిత్రను గుర్తుచేసుకున్నారు. మా ముఖ్యమంత్రి రైతన్నలకు అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా తో ప్రతిపక్ష నాయకులకు నిద్ర లేకుండా పోయిందనీ ప్రతిపక్ష నేతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయిందని అన్నారు. ఒక నాయకుడు జ్వరంతో ఆస్పత్రిలో చేరారని అపహాస్యం చేశారు. మా ప్రభుత్వాన్ని కొందరు శాపనార్థాలు పెడుతున్నారనీ,రైతులపట్ల మా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపక్షాలు ఆహ్వానించాలని కోరారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి కెసిఆర్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. దేశంలోనే తెలంగాణ రైతులు తలెత్తుకునేలా మా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని 25 లక్షల మంది కి పైగా రైతులకు రైతు భరోసా కింద ఇప్పటివరకు 12,682 కోట్ల చెల్లించామని గణాంకాలతో వివరించారు. ఈ సారి రైతు భరోసా కింద 8,675 కోట్లు చెల్లించబోతున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం16,691 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్ కోసం43,835 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. రైతు బీమా కోసం.2,181 కోట్లు, పంట నష్టపరిహారం కోసం 260 కోట్లు చెల్లించామని మేడిపల్లి సత్యం, రామ్మోహన్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని నిరుపేదలకు నిలువ నీడ కల్పించిన ఘనత మా కాంగ్రెస్‌దే అని వారు అన్నారు.మరో విడతఇందిరమ్మ ఇళ్లుత్వరలోనే మంజూరు చేస్తాం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తానని గతంలో కెసిఆర్ మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు కరెంటు బిల్లు లేదు, సన్న బియ్యం ఇస్తున్నాం,రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు చూసి తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు అడుగుతున్నారని ఎమ్మెల్యే లిద్దరు చెప్పుకున్నారు. కెసిఆర్ కుటుంబం సముద్రంలో మునిగిపోయే నావ లాంటిదని ప్రజలు నమ్మడం లేదని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా బిఆర్ ఎస్ నాయకులు అనేక విధాలుగా కుట్ర చేస్తున్నారని అందువల్లే రాబడి తగ్గిందని ఆవేదన వ్యక్తంచేశారు.

# హత్యాకాండను తక్షణమే ఆపాలి

### మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలి

### శాంతి చర్చల కమిటీ నేతల డిమాండ్




మంగళవారం మహాధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), జూన్ 17, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపాలని శాంతి చర్చల కమిటీ, తెలంగాణ రాష్ట్రం నేతలతో పాటు వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకార్యక్రమంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి,అరుణోదయ నాయకురాలు విమలక్క, ప్రొఫెసర్ హరగోపాల్, కందిమళ్ల ప్రతాపరెడ్డి, పశ్య పద్మ, రమ, మల్లు లక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కే.గోవర్ధన్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో 2024 జనవరి నుండి మావోయిస్టులను అణిచివేసే పేరిట ప్రారంభించిన హత్యాకాండలో ఇప్పటి వరకు దాదాపు ఐదు వందల మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో రాజ్యాంగం, చట్టాలలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాయటమే కాకుండా, అక్కడ ఉన్న ప్రకృతి వనరులు, ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు ధారాదత్తం చేయటమే లక్ష్యంగాఈ హత్యాకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వమే హత్యలకు పాల్పడటం, గిరిజన బిడ్డలను పొట్టనపెట్టుకోవటం దారుణమన్నారు. నక్సల్ సమస్య సామాజిక అసమానత సమస్య కాబట్టి, శాంతి చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందని అభిప్రాయపడ్డారు. టెర్రరిస్టులను ప్రోత్సహించిన పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరిపిన మోదీ ప్రభుత్వం ప్రజల కొరకు పనిచేస్తున్న మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కొరకు కృషి చేయకపోవటం రాజ్యాంగానికి వ్యతిరేకమని ఆరోపించారు. ఆదివాసీలతో సహా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను ఆపి, కాల్పుల విరమణను ప్రకటించి, మావోయిస్టు పార్టీతో భేషరతుగా శాంతిచర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ మహా ధర్నా లో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే ప్రతిపాదన విరమించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 17 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భారీ ధర్నా భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లైయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడంతో పాటు అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన భారీ ధర్నాలో సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వము ఆలోచన చేయడం బాధాకరమని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా భీమా రంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమో పునరాలోచించాలన్నారు. రాష్ట్రంలో 15 లక్షాకుపైగా మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదైనారని, బోర్డు ద్వారా చెల్లిస్తున్నటువంటి డబ్బులు కార్మికశాఖ చేతులు దులుపుకొని బీమా కంపెనీకి అప్పజెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు పెన్షన్ అమలు చేయాలని, ఇన్సూరెన్స్ రంగానికి ఇచ్చే టెండర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటియూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన గుట్టు చప్పుడు కాకుండా సంక్షేమ బోర్డు వారు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇన్సురేన్స్ కంపెనీకి అప్పజెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు వెల్లడించాలని, సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ నేడు బీమా కంపెనీ లకు అప్పచెప్పటం విచారకరమన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోటె నరసింహ , వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షులు ఏం ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు,, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి రాజు నూనె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని పనిచేయాలి

### పంచాయతీరాజ్ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** అధికారులు నెలవారీగా లక్ష్యాలు పెట్టుకుని పని చేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆమె పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సమీక్ష సమావేశంలో శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని, అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాలను,హమ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ,ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అత్యంత కీలకమైన శాఖ, రెండున్నర కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శాఖలోపని చేసిన అధికారులు పదోన్నతులు పొందారని ఆమె గుర్తు చేశారు. పంచాయితీరాజ్‌శాఖలో మంత్రి, ఉద్యోగులు వేరు వేరుగా చూడలేదు.మంత్రి నుంచి మల్టీపర్పస్ వర్కర్ వరకు అందరూ ఒక కుటుంబంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పరచాలన్నారు. వరంగల్ కలెక్టర్‌గా సింగరేణి సిఎండిగా నా నియోజకవర్గ అభివృద్ధికి శ్రీధర్ ఎంతగానో సహకరించారని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఉద్యోగ సమస్యలను పరిష్కరిం చాము.93 వేల గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నా మని,ఎంపీడీవోల బదిలీల ఫైలు సీఎం వద్ద ఉందన్నారు. ఎంపీడీవోలకు వాహనాల అలవెన్స్ ఫైల్ ఆర్థిక శాఖవద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్ళకు కొద్ది రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. ఎంతోకాలంగా గ్రౌండింగ్ కానీ పనులను రద్దు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ బిజెపిలో అంతర్గతపోరు

### కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ రియాక్షన్

### ఆ విషయంలో ఎక్కడికైనా, ఎప్పుడైనా రావడానికి సిద్ధం!



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే రాజాసింగ్ "సీనియర్ నాయకుడు"అని, తనను "సామాన్య కార్యకర్తను" అని పేర్కొనడమే కాకుండా, రాజాసింగ్ చెప్పినట్లు తాము పాటిస్తామని రాష్ట్ర కమలం పార్టీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతుంది. దీంతో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభేదాలను విడిచి పెట్టి, ఐక్యంగా లక్ష్య సాధన కోసం పని చేద్దామని కోరారు. మీరు ఎప్పుడు కలిస్తానని చెప్పిన అప్పుడు వచ్చి కలుస్తానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి రావాలనేది నా ఉద్దేశ్యం, వ్యక్తిగత లబ్ధి, పదవుల కోసం తాను ఎప్పుడూ పని చేయలేదని రాజాసింగ్ వెల్లడించారు. అయితే, పార్టీని బలోపేతం చేయడం కోసం అంకితభావంతో పని చేశాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించడంపై దృష్టి పెట్టడానికి బదులుగా, పార్టీకి నిస్వార్థ సేవ చేసినప్పటికీ, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం? ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డాను.ఈ రోజు కూడా నా కోసం కాకుండా, పార్టీ ఐక్యత కోసమే పని చేస్తున్నాను, లక్షలాది మంది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడు తున్నాను అని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను..కొంచెం సమయం కేటాయించండి వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు. కిషన్‌రెడ్డి ఎక్కడికి, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాను పార్టీని విభజించడానికి కాదు. ఐక్యంగా ఉండటానికి ఇక్కడ ఉన్నాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.



# మోడీ పాలనతో రెండింతల అభివృద్ధి

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** దేశంలో నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లో రెండింతలు అభివృద్ధి కనిపిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీరో బ్యాలెన్స్‌తో ప్రారంభించిన జన్‌ధన్ యోజనపై అప్పట్లో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. కానీ ఈరోజు కోట్లాది అకౌంట్లు ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు సుమారు 6 లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్ అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో పేదలకు 4 కోట్ల ఇండ్లు నిర్మించింది. రాబోయే 5 సంవత్సరాల్లో మరో 3 కోట్ల ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆ పనులు ప్రారంభమయ్యాయని, పిఎం ఉజ్వల యోజన కింద గ్రామీణ మహిళలకు లక్షలాది ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. కోవిడ్ టైంలో ప్రారంభమైన ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 5 కిలోల ఉచిత బియ్యం పథకం కొనసాగుతుందన్నారు.

# వికసిత సంకల్ప సభల కోసం బిజెపి కార్యాచరణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** తెలంగాణలో వికసిత్ సంకల్ప సభలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక విడుదల చేసిన ప్రకటన విడుదల చేశారు. బిజెపి రాష్ట్ర స్థాయి నేతలు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు నియోజకవర్గాల లో మండలం, పట్టణ ప్రాంతాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సభల ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడం

# వాగ్దానాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అన్ని వర్గాలకు సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తుందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన నిర్వాహక వైఫల్యాల దృష్ట్యా ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. గత ఎన్నికల సమయంలో బిసి, ఎస్సీ, యువ డిక్లరేషన్‌ల పేరుతో ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పాలనలో నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాట వినడం లేదని ఐఏఎస్ అధికారులపై లీకులు ఇచ్చే స్థితికి దిగజారడం దురదృష్టకరమన్నారు.. సిఎంఓ ఆదేశాలకే అధికారులు స్పందించక పోతున్నారన్న ఆరోపణలు వినపడుతు న్నాయ న్నారు. ప్రభుత్వ వైఫల్యాల బాధ్యతను ఉద్యోగు లపై నెట్టడం అనాగరికపు చర్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికి వదిలిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రిటైర్డ్ ఉద్యోగులకు పిఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్లు ఇవ్వలేమన్న మాటలు ముఖ్యమంత్రి నోటివెంట రావడం దురదృష్టకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రజలకు ఇచ్చిన హామీలఅమలు బాధ్యత సిఎంపై ఉందని, ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రతి హామీని



# డబ్ల్యుటిసి గెలవకున్నా.. నంబర్ వన్‌లో ఆస్ట్రేలియా

## నాలుగుకి పడిపోయిన ఇండియా

## లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో షాకింగ్





**న్యూఢిల్లీ:** 2025 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. కానీ లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మాత్రం ఆ జట్టు నెంబర్ వన్ స్థానానికి చేరుకోలేకపోయింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి చెందిన ఆస్ట్రేలియా నెంబర్ వన్‌గా నిలిచింది. త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను ఐసీసీ విడుదల చేసింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2025 ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది. భారత జట్టు ఈ ఏడాదిలో ఇంగ్లాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కోసం జట్లు ఐసీసీ ర్యాంకింగ్‌ల ఆధారంగా అర్హత సాధిస్తాయి. ప్రస్తుత ర్యాంకింగ్‌ల ఆధారంగా, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ డబ్ల్యూటీసీ 2025-27కి అర్హత సాధించాయి. వన్డే, టీ20లలో జట్టు ర్యాంకింగ్‌ల గురించి మాట్లాడితే, భారత్ ఇప్పటికీ ఈ రెండు ఫార్మాట్‌లలో నంబర్1 జట్టుగా కొనసాగుతోంది.

# ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1 స్మృతి

## 15, 16 స్థానాల్లో రోడ్రిక్స్, హర్మన్‌ప్రీత్







**న్యూఢిల్లీ:** భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్ 1 స్థానానికి ఎగబాకింది, దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత కెరీర్‌లో ఇది ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. 727 రేటింగ్ పాయింట్లతో, స్మృతి ఒక స్థానం మెరుగుపరుచుకుని, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్ట్, ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలీ స్కైవర్ బ్రంట్‌లను అధిగమించింది. ఇద్దరూ ఇప్పుడు 719 పాయింట్లతో సమానంగా ఉన్నారు. 2019 తర్వాత భారత ఓపెనర్ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండటం ఇదే మొదటిసారి. ముఖ్యంగా కొలంబోలో శ్రీలంక మరియు దక్షిణాఫ్రికాతో జరిగిన భారత్ ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో స్మృతి సెంచరీ చేసింది. ఆమె కెరీర్‌లో 11వ వన్డే సెంచరీ అయిన ఆ ఇన్నింగ్స్ ఆమెను ర్యాంకింగ్స్‌లో తన సన్నిహిత ప్రత్యర్థులను అధిగమించేలలా చేసింది. టాప్ 10లో నిలకడగా స్థానం సంపాదించినప్పటికీ, ఈ టాప్‌కి తిరిగి రావడం చాలా కాలం నిరీక్షణకు ముగింపు పలికింది. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇతర భారత క్రీడాకారిణులు జెమిమా రోడ్రిగ్స్ 15వ స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 16వ స్థానంలో ఉన్నారు, దక్షిణాఫ్రికాకు చెందిన టాజ్మిన్ బ్రిట్స్ ఐదు స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకోగా, ఆమె సహచరురాలు మరియు మాజీ కెప్టెన్ సునే లూస్ ఏడు స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకుంది. వెస్టిండీస్ జట్టులో షెమైన్ కాంప్‌బెల్ 62వ స్థానానికి, ఓపెనర్ కియానా జోసెఫ్ 67వ స్థానానికి చేరుకుంది. కాగా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో, కేప్ హిల్‌లో దక్షిణాఫ్రికాపై నాలుగు వికెట్లు తీసిన అఫీ ఫ్లెచర్ నాలుగు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నాన్కులులెకో మ్లాబా బౌలర్ల జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకోగా, క్లోయ్ ట్రయాన్ కూడా ఆరు స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి చేరుకుంది. మ్లాబా 11 స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకుంది.

# చరిత్రనే మార్చిన టి20 ట్రై సిరీస్

## తొలిసారి మూడో సూపర్ ఓవర్

## నేపాల్‌పై నెదర్లాండ్స్ ఉత్కంఠ విజయం



**న్యూఢిల్లీ:** నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ చరిత్రను మార్చివేసింది. ఈ మ్యాచ్‌లో, రెండు జట్ల మధ్య 3-3 సూపర్ ఓవర్లు ఆడబడ్డాయి. నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన స్కాట్లాండ్ టీ20 ట్రై సిరీస్‌లో తొలిసారి మూడు సూపర్ ఓవర్ల తర్వాత విజేతను ప్రకటించారు. గ్లాస్గోలో జరిగిన ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ నేపాల్‌ను ఓడించింది. రెండు జట్లు 20 ఓవర్లలో 152 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో కూడా విషయం టైగా ముగిసింది. చివరికి, నెదర్లాండ్స్ మూడవ సూపర్ ఓవర్‌లో గెలిచింది. జాక్ లియాన్‌కాషెట్ అద్భుతంగా బౌలింగ్ చేసి నెదర్లాండ్స్‌ను చిరస్మరణీయ విజయానికి నడిపించారు. చివరి సూపర్ ఓవర్‌లో అతను ఒక్క పరుగులూ ఇవ్వకుండా రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ స్కాట్లాండ్ టీ20 ట్రైసిరీస్‌లో రెండవ మ్యాచ్. నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. ఇక నేపాల్ 8 వికెట్లకు 152 పరుగులు చేయడంతో స్కోరు టై అయింది. మొదటి సూపర్ ఓవర్ లో నేపాల్ 19 పరుగులు చేసింది. కుశాల్ భూర్టెల్ 5 బంతుల్లో 18 పరుగులు చేశాడు. కానీ నెదర్లాండ్స్ కూడా సులభంగా 19 పరుగులు చేసింది. మాక్స్ ఓ'డౌడ్ కేవలం 3 బంతుల్లో 12 పరుగులు, లెవిట్ 6 పరుగులు చేశారు. రెండవ సూపర్ ఓవర్‌లో నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 17 పరుగులు చేసింది. స్కాట్ ఎడ్వర్డ్స్ ఒక సిక్స్ కొట్టాడు. నేపాల్‌పై ఒత్తిడి ఉంది, కానీ రోహిత్ పౌడెల్ (7), ఆరీ (10) కలిసి స్కోరును సమం చేశారు. రెండు జట్లు వదులుకోవడానికి సిద్ధంగా లేవు, కాబట్టి మ్యాచ్ మూడవ సూపర్ ఓవర్‌లోకి వెళ్ళింది. ఈసారి లయన్‌కాచెట్ నెదర్లాండ్స్ తరపున అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను మొదటి బంతికే రోహిత్ పౌడెల్‌ను అవుట్ చేసి, మూడు బంతుల తర్వాత రూపేష్ సింగ్‌ను అవుట్ చేశాడు. నేపాల్ ఒక్క పరుగు కూడా చేయలేకపోయింది మరియు ఒత్తిడిలో కూలిపోయింది. నెదర్లాండ్స్ గెలవడానికి కేవలం ఒక పరుగు మాత్రమే అవసరం. మైఖేల్ లెవిట్ మొదటి బంతికే లామిచానే బౌలింగ్‌లో సిక్స్ కొట్టడం ద్వారా జట్టుకు విజయాన్ని అందించాడు.

# ఆసియా కప్‌లో భారత్ మహిళల ఆర్చరీ టీం వరల్డ్ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు అండర్21 ప్రపంచ రికార్డును నెలకొల్పింది. సింగపూర్‌లో జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు రికార్డు స్థాయిలో ప్రదర్శన ఇచ్చింది, ర్యాంకింగ్ రౌండ్‌లో అండర్21 ప్రపంచ రికార్డును తిరగరాసింది. షణ్ముఖి బుద్దే, తేజల్ సాల్వే మరియు తనిష్క తోకల్ త్రయం అసాధారణమైన ప్రదర్శన చేసి 2101 పాయింట్లతో లీడర్ బోర్డ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇది 2076లో భారతదేశం పేరిట ఉన్న మునుపటి అండర్21 ప్రపంచ రికార్డును అధిగమించింది, ఈ రికార్డును 2023 ఆసియా కప్ ఎడిషన్ సందర్భంగా దీప్శి, ప్రగతి మరియు సాక్షిచౌదరి ఒకే వేదికపై నెలకొల్పారు. కుశాల్ దలాల్ 714 స్కోరుతో కాంపౌండ్ పురుషుల ర్యాంకింగ్ రౌండ్‌లో ముందంజలో ఉన్నాడు. కాంపౌండ్ మహిళల విభాగంలో షణ్ముఖి నాగ సాయి బుద్దే 706 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు, ఆ తర్వాత సహచరురాలు తేజల్ సాల్వే 700 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాడు. పురుషుల రికర్వ్ విభాగంలో విష్ణు చౌదరి మరియు పరాస్ హుడా వరుసగా మూడు మరియు నాల్గవ స్థానంలో నిలిచారు, ఇద్దరూ 669 పాయింట్లు సాధించారు. రికర్వ్ మహిళలలో, వైష్ణవి బాబారావు పవార్ భారతదేశంలో అత్యుత్తమ ప్రదర్శనకారిగా నిలిచారు, 654 పాయింట్లతో 7వ స్థానంలో నిలిచారు.



**న్యూఢిల్లీ:** సిఎవిఎ పురుషుల అండర్19 వాలీబాల్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ కాంస్య పతకం సాధించింది. ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లోని జెఎఆర్ స్పోర్ట్స్ హాల్‌లో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో 3-1 తేడాతో కిర్గిజ్‌స్థాన్‌ను ఓడించింది. గ్రూప్ దశలో ఆటుపోట్లకు గురైన భారత జట్టు అద్భుతమైన ప్రదర్శనతో పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం మధ్య ఆసియా వాలీబాల్ వేదికపై యువ భారత జట్టుకు ఒక ముఖ్యమైన విజయాన్ని సూచిస్తుంది. కాంస్య పతక పోరులో 21-25, 25-14, 25-08, 25-23

# వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్యం

సెట్ స్కోర్లతో కిర్గిజ్‌స్థాన్‌ను 3-1 తేడాతో ఓడించడంలో భారతదేశం అసాధారణమైన స్థితిస్థాపకత మరియు జట్టుకృషిని ప్రదర్శించింది. ప్రారంభ సెట్‌ను కోల్పోయిన తర్వాత, జట్టు వ్యూహాత్మక ప్రతిభతో తిరిగి పుంజుకుంది. మరియు మిగిలిన సెట్లలో ఆటను నియంత్రించింది. ఉజ్బెకిస్తాన్ 2 పై 25-20, 19-25, 25-16, 25-22 సెట్ స్కోర్లతో విజయం సాధించిన తర్వాత భారత్ జట్టు కాంస్య పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకుంది. కెప్టెన్ మహేంద్ర ధుర్వే కీలకమైన మ్యాచ్‌లో 21 పాయింట్లతో ముందుండి నడిపించాడు. రజత్ సింగ్, ఆదర్శ్ రాయ్ మరియు కునాల్ దాస్ కూడా టోర్నమెంట్ అంతటా గణనీయంగా దోహదపడ్డారు. భారతదేశం మూడవ స్థానాన్ని దక్కించుకోగా, ఇరాన్ ఫైనల్‌లో ఉజ్బెకిస్తాన్ 1ని ఓడించి బంగారు పతకాన్ని గెలుచుకోగా, ఉజ్బెకిస్తాన్ 1 రజతంతో సంతృప్తి చెందింది.

# ఎటిఎంలలో పెరిగిన రూ.100, రూ.200 నోట్ల లభ్యత

**ముంబై, జూన్ 17:** ఏటీఎంల్లో రూ.100, రూ.200 నోట్ల లభ్యత పెరిగింది. ఏటీఎంల్లో (తిగిల్బీ)ఎప్పటికప్పుడు ఈ నోట్లు అందుబాటులో ఉండేలా చూడాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించిన గడువుకు మూడు నెలల ముందే వీటి లభ్యత 73 శాతం పెరిగింది. గతేడాదిలో డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరింది. ఏటీఎంలను నిర్వహిస్తున్న సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఈ గణాంకాల్ని వెల్లడించింది.ప్రజల కోసం చిన్న నోట్లు ప్రజలు ఎక్కువగా వాడే నోట్ల లభ్యతను పెంచే ఉద్దేశంతో బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం (తిగిలీ)ఆపరేటర్లు వాటి ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు అందుబాటు ఉండేలా చూడాలని ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది. 2025 సెప్టెంబరు 30 నాటికి 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంల్లో రూ.100 లేదా రూ.200 నోట్లు ఉపసంహారణ జరగాలని తెలిపింది. ఇక ఆర్‌బీఐ నిర్దేశించిన గడువుకు మూడు నెలల కంటే ముందే ఈ నోట్ల వినియోగం 73 శాతం చేరడం విశేషం. బ్యాంకులు తమ ఏటీఎంల్లో చిన్న నోట్ల స్టాక్‌ను నియమితంగా నింపుతున్నాయి. వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు కూడా శితీ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పాత



ఏటీఎంలలో పెద్దనోట్ల కోసం మాత్రమే ప్రత్యేకంగా ట్రేలుఉండేవి. రూ.100, ..200 నోట్ల లభ్యతలో పెరుగుదల ప్రజలకు నగదు లావాదేవీలలో ఎంతో సౌలభ్యం కలిగించనుంది. శితీ నిర్దేశించిన గడువులను ముందుగానే చేరుకోవడం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు మంచి సూచన. ప్రజలు చిన్న మొత్తాల చెల్లింపుల కోసం ఇక ఏటీఎంల ముందు తిప్పలు పడాల్సి న అవసరం ఉండదు.

# టీసీఎస్ కొత్త పాలసీ.. బెంచ్‌పై ఇక 35 రోజులే !

**ముంబై, జూన్ 17:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇకపై ఏటా ప్రతి ఉద్యోగి 225 బిల్ల్‌డ్ బిజినెస్ డేస్ పనిచేసి ఉండాలన్న నిబంధన తీసుకొచ్చింది. బెంచ్ మీద ఉండే సమయాన్ని 35 రోజులకు పరిమితం చేసింది. జూన్ 12 నుంచి ఈ కొత్త నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు పనిచేయకుండా ఉండే సమయాన్ని తగ్గించడం, వర్క్‌ఫోర్స్‌ను సమర్థంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఐటీ కంపెనీల్లో బిల్ల్‌డ్ డేస్ అంటే క్లయింట్ ప్రాజెక్ట్‌పై పని చేయాల్సిన రోజులు. ఇది ఏడాదికి 225 రోజులు గా టీసీఎస్ నిర్ణయించింది. అంటే ప్రతి ఉద్యోగి కనీసం అన్ని రోజులు ప్రాజెక్టు లపై పని చేయాల్సి ఉంటుంది. ఇక ఏ ప్రాజెక్ట్‌పై పనిచేయకుం డా ఖాళీగా ఉండే సమయాన్ని బెంచ్ పీరియడ్‌గా పేర్కొంటారు. ఇకపై 35 రోజులు మాత్రమే ఒక ఉద్యోగి బెంచ్ మీద ఉండాలి. దీర్ఘకాలం పాటు ఏ ఉద్యోగి ప్రాజెక్టుపై లేకుండా ఖాళీగా ఉండకూడదని కొత్త పాలసీ నిర్దేశిస్తోంది. అలా జరిగితే అతడి పారి తోషికం, కెరీర్‌లో వృద్ధి, చివరికి ఉద్యోగ జీవితం పైనా ప్రభావం పడుతుందని కంపెనీ తన పాలసీ డాక్యుమెంట్‌లో పేర్కొంది. టీసీఎస్‌లో ఏ



ప్రాజెక్ట్‌కు ఎవరు సరిపోతారు? ఎవరి నైపుణ్యాలు సరిపోతాయి? వంటివి రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ చూస్తుంది. దీనికి గ్లోబల్ హెడ్‌గా ఉన్న చంద్రశేఖరన్ రామ్‌కుమార్ నిర్ణయా నికి అనుగుణంగా ఈ పాలసీ రూపుదిద్దుకుంది. అసోసి యేట్‌కు ఏ ప్రాజెక్ట్‌నూ కేటాయించని సందర్భంలో తనకు సరిపడే ప్రాజెక్ట్ అప్పగించేలా ఎప్పటికప్పుడు యూనిట్/ రీజనల్ ఆర్‌ఎంజీతో సంప్రదింపులు జరపడం వారిదే బాధ్యత అని పాలసీలో పేర్కొన్నారు. బెంచ్‌పై ఉన్న ఉద్యోగులు సంస్థ అందిస్తున్న ఐఎవాల్వ్, ఫ్రెస్కో ప్లే, వీఎల్ఎస్, లింక్డిన్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వినియో గించుకొని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. ఆర్‌ఎంజీ నిర్దేశించిన సెషన్లకు హాజరవ్వాలి. బెంచ్‌పై ఉండేటప్పుడు ఆఫీసుకు రావడం

# ఇంటెల్‌లో భారీగా ఉద్యోగాల తొలగింపు !

**ముంబై, జూన్ 17:** ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం మళ్లీ ఊహించని దిశగా వెళ్లుతోంది. కోవిడ్ తర్వాత ప్రారంభమైన ఆర్థిక మాంద్యం ప్రభావాలు ఇంకా విడిపోలేదు. భారీగా ఉద్యోగ నియామకాలు చేసిన కంపెనీలు ఇప్పుడు ఆగమాగం చేస్తున్నాయి. గడచిన రెండు సంవత్సరాలుగా టెక్ దిగ్గజాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలని ఉద్యోగులను వరుసగా తొలగిస్తున్నాయి. ఇందులో తాజా పేరుగా ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కూడా చేరింది. తాజా సమాచారం ప్రకారం, జూలై మధ్యలో ఉద్యోగాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించడానికి ఇంటెల్ సన్నాహాలు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే మెయిల్ పంపినట్లుగా తెలుస్తోంది. కాగా ఇటీవల కొత్తగా నియమితులైన దినివీ లిప్‌బు టాన్ మొదటిసారిగా ఈ తొలగింపులను చేపడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.ఎలాంటి విభాగాలపై ఇది ప్రభావం చూపుతుందన్న దానిపై స్పష్టత లేదు. కథనం ప్రకారం ఇంటెల్ కంపెనీ జూలై నెల మధ్యలో ఉద్యోగుల తొలగింపులను ప్రారంభించాలని ప్లాన్ చేస్తోందని, ఈ ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి ముగిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఈ తొలగింపులు ఎంతమంది ఉద్యోగులను ప్రభావితం చేస్తాయనే దానిపై ఇంకా ఎటువంటి స్పష్టత లేదు.



ఏయే ప్రాంతాల్లో ఉద్యోగ తొలగింపులు ఉంటాయనేదానిపై కూడా అధికారిక సమాచారం లేదు. అయితే తొలగింపులు మాత్రం జరుగుతాయని తెలుస్తోంది. కంపెనీ బలోపేతంలో భాగంగానే ఈ తొలగింపులు జరుగుతున్నాయని తెలుస్తోంది. కస్టమర్ల అవసరాలను తీర్చడమే మా లక్ష్యమని ఇంటెల్ కూడా ఓ బహిరంగ ప్రకటనలో తెలిపింది.గత కొద్ది నెలల్లో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ సంస్థలు కూడా పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించాయి.

# స్టార్‌బక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా డాలీ చాయ్‌వాలా!

**న్యూఢిల్లీ, జూన్ 17:** సోషల్‌మీడియాలో ఫేమస్ అయిన డాలీ చాయ్‌వాలాను ప్రముఖ కాఫీ దిగ్గజం స్టార్‌బక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిందన్న వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ వదంతులకు చెక్ పెడుతూ స్టార్‌బక్స్ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము ఎవరినీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించలేదని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో స్టార్‌బక్స్‌కు అధికారిక ప్రచారకర్తలు ఎవరూ లేరని స్పష్టం చేసింది. స్టార్‌బక్స్‌కు డాలీ చాయ్‌వాలా బ్రాండ్ అంబాసిడర్ అంటూ మీమ్స్ నెట్టింట చక్కర్లు కొట్టాయి. దీన్ని చూసి చాలా మంది నిజమని భావించారు. ఈ ప్రచారం హోరెత్తడంతో కంపెనీ స్పష్టత ఇవ్వాల్సి వచ్చింది. నాగ్‌పూర్‌కు చెందిన టీ విక్రేతే ఈ డాలీ చాయ్‌వాలా. ప్రత్యేక శైలిలో టీ అమ్మే ఆయన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. గతేడాది మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ భారత్ పర్యటన సందర్భంగా చాయ్‌వాలాతో చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఈ షార్ట్ వీడియో వైరల్ కావడంతో డాలీ చాయ్‌వాలా ఫేమస్ అయ్యాడు.



# వాణిజ్యం

# అక్రమ వసూళ్లపై ఇపిఎఫ్ఓ అసహనం


**న్యూఢిల్లీ, జూన్ 17:** ఆన్‌లైన్ పోర్టల్ ఉపయోగించి భవిష్య నిధి ఖాతాలకు సంబంధించిన సేవలు అందిస్తామని ముందుకొచ్చే మధ్యవర్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని, తమ చందాదార్లను ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) హెచ్చరించింది. కీలక సమాచారం వారి చేతికి వెళ్లకుండా చూడాలని స్పష్టం చేసింది. సేవలను వేగంగా, పారదర్శకంగా, వినియోగదారు హితంగా అందించేందుకు ఈపీఎఫ్ఓ వరుసగా సంస్కరణలు చేపడుతోందని కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈపీఎఫ్ఓలో సుమారు 7 కోట్ల మందికి పైగా చందాదార్లు ఉన్నారు. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఉన్నారు. పలు సైబర్ కేఫ్ ఆపరేటర్లు/ ఫిన్‌టెక్ కంపెనీలు చందాదార్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి, సేవలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఈపీఎఫ్ఓ తెలిపింది. ఈపీఎఫ్ఓ సంబంధిత సేవలు అందించేందుకు థర్డ్‌పార్టీ కంపెనీలు, వాటిని దుర్వినియోగం చేస్తే చందాదార్ల నష్టపోవాల్సి ఉంటుందని తెలిపింది. ఇలాంటి సేవలు అందించేందుకు బయటి సంస్థలు/ వ్యక్తులకు ఈపీఎఫ్ఓ అనుమతి ఇవ్వలేదని వెల్లడించింది. ఈపీఎఫ్ఓలో సమస్యలు ఉంటే, సీపీజీఆర్ఏఎంఎస్ లేదా ఈపీఎఫ్ఐజీఎంఎస్ పోర్టళ్లలో తెలియజేస్తే, వాటికి పరిష్కారం నిర్ణీత సమయంలో లభిస్తుందని వివరించింది. 2024-25లో ఫిర్యాదులు 2024-25లో ఈపీఎఫ్ ఐజీఎంఎస్ పోర్టల్‌లో 16,01,202 ఫిర్యాదులు, సీపీజీఆర్ఏఎంఎస్‌లో 1,74,328 ఫిర్యాదులు రాగా, 98 పరిష్కరించినట్లు తెలిపింది. చందాదార్లు, యాజమాన్య సంస్థలు, పింఛనుదార్లు ఆన్‌లైన్ సేవల కోసం ఈపీఎఫ్ఓ పోర్టల్, ఉమాంగ్ యాప్‌లను వినియోగించుకోవాలని సూచించింది. సేవలు వేగంగా, పారదర్శకంగా, వినియోగదారులకు అనుకూలంగా అందించేందుకు ఈపీఎఫ్ఓ వరుసగా మార్పులు చేస్తోంది.





# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 17:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చనుందనే సంకేతాలు ఇందుకు కారణమయ్యాయి. టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని పౌరులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించడం ఇందుకు నేపథ్యం. ఇరు దేశాల మధ్య యుద్ధం ప్రాంతీయ పోరుకు దారితీయొచ్చన్న భయాలు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు ధరలు కూడా పెరగడంతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,900 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,869.47 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,427.01 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. 212 పాయింట్ల నష్టంతో 81,583.30 వద్ద ముగిసింది. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,853.40 వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువ 86.24గా ఉంది. ఎటర్నల్, సన్ ఫార్మా, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.28 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3405 డాలర్ల వద్ద ట్రేడయింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.